# కథా మంజరి

పది కథల సమాహారం



## కథా మార్గదర్శి

జయంతి ప్రకాశ శర్మ
సంపాదకుడు

అవసరాల వెంకట రావు
ప్రచురణ కర్త

**అక్టోబర్ 2020 సంచిక**

© Copyright 2020 - Editorial Board Kathamanjari

# పది కథల సమాహారానికి

కథా మంజరి

సుస్వాగతం

# ఇదీ వరస


| సంఖ్య | విషయం | పేజీ సంఖ్య |
|---|---|---|
| 1. | మా జట్టు | i |
| 2. | కృతజ్ఞతలు | ii |
| 3. | దీపావళి ప్రత్యేక సంచిక గురించి | iii & xiv |
| 4. | కథా కీయం | iv |
| 5. | ఈ నెల విశిష్ట అతిథి | vii |
| 6. | కథా మార్గదర్శి | x |
| 7. | వినదగునెవ్వరు చెప్పిన (కథల తరువాత) | xiii |
| 8. | **కథలు** | |

| సంఖ్య | కథ పేరు | రచన | పేజీ సంఖ్య |
|---|---|---|---|
| 1. | అంతర్జాలం – అంతరాయం | వి వి రమణ మూర్తి | 01 |
| 2. | ఇంట్లోనే ఉండండి – క్షేమంగా ఉండండి | పి యల్ ఎన్ మంగా రత్నం | 05 |
| 3. | ఆహార్యం | మద్దూరి బిందు మాధవి | 11 |
| 4. | కన్నుల వెన్నెల | రమేశ్ చెన్నుపాటి | 18 |
| 5. | తాజా తాజా | అవసరాల పద్మజా రాణి | 24 |
| 6. | తిరిగి వచ్చిన వసంతం | కొమ్ముల వెంకట సూర్యనారాయణ | 30 |
| 7. | విశ్వవర్ధనంబు | పారుపూడి శేషా రత్నం | 34 |
| 8. | కొత్త దారి | పక్కి శివ ప్రసాద రావు | 42 |
| 9. | భారతీయం | నిష్టల సుబ్రహ్మణ్యం | 48 |
| 10. | ప్రక్షాళన | జ్యోతి సుంకరణం | 56 |

# ఇంకా మా జట్టు



సాంకేతిక సహకారం

AgradootWeb
Thought. Design. Commitment.

బొమ్మలు

శ్రీ కోయిలాడ రామ్మోహన రావు

# కృతజ్ఞతలు

# SPONSORS

## ఈ సంచిక కు ఆర్థిక సహకారం

## OF THIS ISSUE

శ్రీ వారణాసి మాధవ కృష్ణ

శ్రీమతి వారణాసి వెంకట సత్య గౌరి



## కథా మంజరి

# దీపావళి కథల పోటీ

మీ కథలు పంపడానికి ఆఖరు తేదీ

**25/10/2020**

వివరాలు—ఆఖరు పేజీ లో



# 'కథా'కీయం!

నటుడు, ఆటగాడు, పాటగాడు, చిత్రకారుడు, వాయిద్యకారుడు .. వీళ్ల కోవకి చెందినవాడే రచయిత కూడా అని అనిపిస్తుంది. నిజానికి రచయిత కూడా ఆ కోవకు చెందిన వాడే. కాని, వాళ్లకి ఉన్న గుర్తింపు, గౌరవం రచయితకి దక్కడం లేదు.

పైన చెప్పిన వారంతా వారి వారి పాత్రల్లో ఎలా జీవిస్తారో, రచయిత కూడా రచయిత పాత్రలో కలం పట్టుకుని జీవిస్తాడు. కృషి చెస్తాడు, కష్ట పడతాడు. పైన ఉదహరించిన వారు, ఆ ఒక్క 'పాత్ర' లోనే జీవిస్తారు, కాని రచయిత తన రచనలలో ఉండే అన్ని పాత్రలలో పరకాయ ప్రవేశం చేసి, జీవిస్తూ రాస్తాడు. అందుకే రచయితని బహుముఖ పాత్రధారి అనాలి!

సరే, ఆ విషయాలు పక్కన పెడితే .. అసలు తెలుగు కథ గురించి రాయాలని అనుకున్నప్పుడు, ముందుగా.. మన పెద్దలు, రచయితల గురించి చెప్పిన నాలుగు మాటలు రాయాలనిపించింది!

మన చుట్టూ జరిగే మంచి చెడ్డలకు అందరూ స్పందిస్తారు. కొందరిలో కొద్దిగా ఉంటుంది, మరి కొందరిలో ఎక్కువ ఉంటుంది. వీళ్ళల్లో కొందరు వాటిని అందరితో పంచుకోవాలని అనుకుంటారు. వాళ్లల్లో కొందరు వాటిని అక్షరాలతో పొందు పరచి అందరికి అందించే వరకు మధన పడుతూ ఉంటారు. అది ఓ సంఘటన కావచ్చు, ప్రేమ కావచ్చు, ఓ న్యాయం కావచ్చు, ఓ అన్యాయం కావచ్చు, ఓ మంచి అనుభూతి కావచ్చు, ఓ అపురూపమైన అనుభవం కావచ్చు.. ఏదైనా సరే, అలా స్పందించే హృదయంలోంచే రచనలు వస్తాయి. అలా జరిగిన సంఘటనో, సన్నివేశమో, అనుభవమో ఉన్నదున్నట్లు రాయవచ్చు. లేదా కల్పించి రాయొచ్చు. అయితే కథ రాయడానికి ఆ అంశంలో కథకు ప్రాణంలాంటి సంఘటన ఉన్నాదా లేదా.. ఉంటే ఏది? తేల్చుకుని రచయిత కథ రాస్తాడు.

"కథల అల్లికలో ముఖ్యమైనది 'క్లుప్తత' ఇది కథానిక బిగువుని తెస్తుంది. ఆ బిగువులో ఒక రిథమ్, ఒక ఊపు, ఒక జిగి వస్తాయి. ఉత్కంఠ భరితంగా సాగుతుంది. అలాంటి అల్లికలతో మన తెలుగు కథానిక చరిత్రలో చాలా గొప్ప కథలుగా చెప్పుకోవలసిన ఎన్నో కథానికలు.. క్లుప్తతని శిరోభూషణంగా చేసుకున్నవే చాలా

ఉన్నాయి! ఇప్పుడు కూడా వస్తున్నాయి!" అంటూ కథానిక మీద అద్భుతమైన వ్యాసాలు రాసారు.. ఈనాటి మన విశిష్ట అతిథి శ్రీ విహారి గారు.

అసలు కవిత్వం రాయడానికి  హృదయం ఉంటే చాలని శ్రీశ్రీగారు ఎప్పుడో గొప్పగా చెప్పారు.

"కుక్కపిల్లా, అగ్గిపుల్లా, సబ్బుబిళ్లా-
హీనంగా చూడకు దేన్నీ!
.. .. ..
కాదేదీ కవితకనర్హం!
ఔనౌను శిల్పమనర్ఘం!
ఉండాలోయ్ కవితావేశం!

ఈ కవిత చదివి స్పందించి రావిశాస్త్రి గారు కుక్కపిల్లా, అగ్గిపుల్లా, సబ్బు బిళ్ల .. ల మీదా కథలు రాసారు. అవి నేటికి అజరామరాలే!! కథలు రాయడానికి ఏం వుండాలో ఈ ఒక్క ఉదాహరణ చాలు!!

చుట్టూ ఉన్న సమాజంలో నిత్యం జరిగే న్యాయాన్యాయాలని చూసి, స్పందించి రాసిన మన ఆధునిక తెలుగు కథ వయసు వందేళ్ల పైనే ఉన్నా, ఆనాటి కథలు .. నాటి నుంచి నేటి వరకు చరిత్రలో అజరామరంగా నిలిచాయి. అవి ఇప్పుడు చదివినప్పుడు కూడా నేటి కథే అని అనిపించకమానదు!

అలా.. ఆయా రచయితల రచనలు చిరస్మరణీయంగా నిలవడానికి కారణం.. వారి అనుభవాలు, అనుభూతులు, పరిశోధనలు.. అంతకు మించి, ఎన్నో పుస్తకాలు చదివి సంపాదించిన విజ్ఞానంతో పాటు అదృశ్యంగా లభించిన ఓ రచనా శక్తి..  వీటితో అద్భుతమైన రచనలు చేసారు, చరిత్రలో నిలిచిపోయే రచనలు అందించారు! అలా తెలుగునాట ఎందరో రచయిత(త్రి)లు తెలుగు కథలని, శతవత్సరాలు గడిచినా చిరంజీవులుగా నిలబెట్టారు.

"ప్రస్తుతం చాలామంది రచయితలు పుస్తకాలు చదవడం తగ్గించేసారు, అనుభూతికి తావులేని యాంత్రిక జీవనంలో ఉన్నారు, విషయ పరిశోధన చేయలేని స్థితిలో ఉన్నారు! అందుకే నేటి రచనలలో జీవం కనబడటం లేదు!" అంటూ చాలామంది కథా నిష్ణాతులు వాపోతున్నారు. ఇది నిజం కూడా!

"కథల్లో రచయిత జీవించి కథలు రాయాలి. కథా వాతావరణం అనుభవించి, దాన్ని అక్షరాల్లో బంధించాలి. మన చుట్టూ ఉన్న మనుషులు మాట్లాడుకునే మాటల్ని, చేష్టల్ని, జీవనాన్ని, సంఘటనల్ని కథాంశంగా వాడుకోవాలి. ఊహ కంటే.. అనుభవం గొప్పది, దానికే జీవం ఉంటుంది! రచయిత అంతరంగంలో మధనపడి, రూపు దిద్దుకుని, పురుడు పోసుకునే ఏ కథైనా సరే, చరిత్రలో నిలిచే ఉంటుంది!" అని తెలుగు కథా మార్గదర్శకులు సూచనలు చేస్తూనే ఉన్నారు.

'కథ ఎలా రాస్తారనేది.. ఒకరు చెప్తే తెలిసేది కాదు. ఎవరికి వారు గ్రహింపవలసినదే. అందుకు సంబంధించిన మెళుకువలు గ్రహించాలి. అది ఎక్కువ పుస్తకాలు చదవడం వలననే సాధ్యమవుతుంది!' అంటూ తెలుగుకథకి భాష్యం చెప్పిన విశ్వవిఖ్యాత తెలుగు కథాభీష్ముడు శ్రీ కాళీపట్నం రామారావుగారి 'కథాకథనం' వ్యాసాలు రచయిత అన్నవాడు చదవవలసిందే!!

గతం ఒక వైభవం కావచ్చు! కాని 'నేడు' కూడా రేపటికి వైభవం కావాలి. దానికి నడుం కట్టుకోవలసింది .. నేటి తరం!!

మన పెద్దలు చెప్పినట్టు, ఎక్కువ చదివి, ఎక్కువ అనుభూతితో, ఎక్కువ కృషి చేసి.. నాలుగు కాలాలపాటు నిలిచే కథలు ఈ రోజు రాయాలి, రేపూ రాయాలి. కథాలోకానికి తెలుగు కథ నాయకత్వం వహించాలి. ఆ దిశలో పయనించి, ఆ స్థాయిని చేరుకోడానికి వర్తమాన రచయితలు సమాయత్తం కావాలి, కంకణం కట్టుకోవాలి!!

సూర్యచంద్రులు ఉన్నంత వరకు తెలుగు కథ నిత్యం పుడుతూనే ఉండాలి, పరుగులు తీస్తూనే ఉండాలి!!

**0**

# ఈ నెల విశిష్ట అతిధి



# శ్రీ విహారి

ఎనిమిది పదుల వయసులో కూడా.. పదహారేళ్ళ ప్రాయంతో తెలుగు సాహితీ ప్రపంచాన్ని ఉత్తేజ పరుస్తూన్న విశిష్ట సాహితీ మూర్తి, బహు విధ ప్రక్రియలతో తెలుగు వెలుగులను వెదజల్లుతున్న ప్రభాకరుడు శ్రీ విహారి గారు. ఆరు దశాబ్దాలుగా తన కలం ఝుళిపిస్తూ.. కలం, కాగితం కనుమరుగైనా సరే, అంతర్జాలం, అక్షరజాలాలతో తెలుగు కథని ముందుకు నడుపుతూ, తాను నడుస్తూ, పాఠకుల్ని, రచయితలను నడిపిస్తున్న తెలుగు సాహితీ చక్రవర్తి శ్రీ విహారి గారు. మానవ జీవన శైలిలో అతి కొద్ది కాలంలో అతి పెద్ద మార్పులు చోటు చేసుకున్న నేటి సాంకేతిక మాధ్యమ లోకంలో కూడా, శ్రీ విహారిగారి కొత్త అక్షరం.. సాహితీ గగన వీధుల్లో విహరించని రోజు ఉండదని చెప్పడం అతిశయోక్తి కానేకాదు. రాసిలోను, వాసిలోను ఎత్తైన ఎన్నెన్నో కథలు, నవలలు, కవితలు రాసిన శ్రీ విహారి గారు, తెలుగు సాహితీ ప్రియులకు యుగాల పాటు సరిపోయే 'బీమా'తో పాటు, తెలుగు కథకి ధీమా అందించారు. భారతీయ బీమా సంస్థలో అసిస్టెంట్ గా

అడుగులు వేసి, అంచెలంచెలుగా జనరల్ మేనేజర్ స్థాయికి ఎలా ఎదిగారో.., అదే విధంగా సాహిత్య ప్రపంచంలో కూడా మొట్టమొదట 1960లో రెండు పద్య ఖండికలు ద్వారా అరంగేట్రం చేసి, ఈ రోజు కథా, కవితా, నవలా, వ్యాసాలతో పాటు, ఒక్క తెలుగు భాషకే సొంతమనుకునే పద్య రచనలో కూడా పట్టు సాధించి.. తెలుగు కథా రచయితలకు అగ్రజుడుగా కీర్తికిరీటాలను అందుకున్నారు శ్రీ విహారి గారు! ఆయన్ని వరించని సాహితీ అవార్డులు, రివార్డులు లేవనే చెప్పాలి. ఆయన అక్షరం ముద్రించని పత్రికలు లేవు.. ఆయన రాతలు జొరబడని అంతర్జాల వేదికలు లేవు. ఇవన్నీ ఒక ఎత్తు అయితే, పద్యాల మీద ఉన్న మమకారం, పద్య కవిత్వం మీద ఉన్న 'తీరని దాహం' తోనే ఆరువేల ఐదు వందల పద్యాలతో శ్రీ పదచిత్ర రామాయణం రచించారు. ఇది ఆయన సాహిత్య ప్రక్రియల్లో మహదానందమైన విషయమని అంటారాయన. అన్ని తరాలకు చెందిన ప్రసిద్ధ కథకులు రాసిన మూడు వందల ఏభై కథల యొక్క వస్తువు, శైలీ, శిల్పం.. వంటి కథా మూలాలను విశ్లేషణ మెరుపులతో వ్యాస సంకలనం అందించి ఓ రికార్డ్ సృష్టించిన ఘనాపాఠి శ్రీ విహారి గారు.

'మీకు రచనలు చేయాలనే ఆలోచనలకి నాంది ఏమిటని' అడిగితే.. ' చిన్నప్పుడు పుస్తకాలు చదవడం ఇష్టంగా ఉండేది. ఆ చదువులే తాను రచనలు చేయడానికి ప్రేరణ కలిగించాయి, అవే ఈ బాటలో ఎదుగుదలకు కూడా దోహదపడిందంటూ' గర్వంగా చెప్పుకొస్తారు. 'నాకు పద్యాలు, శతకాలు, శ్లోకాలు చదివే అలవాటుకి బాల్యంలోనే బీజం పడింది. ఇప్పటికీ నేను విద్యార్థినే . . ఓ పాఠకుడ్నే!! ఇప్పటికి రచనలు చేసేటప్పుడు, వాటి ద్వారా పాఠకుడి మనసులో ఉన్న అలోచనా స్థాయిని మరింత ఎత్తుకి తీసుకెళ్లాలనే వాంఛ నాలో ఉంటుందని" ఆనందంగా చెపుతారు.

"శ్రీ విహారిగారి కథలలో గొప్పతనం ఏమిటంటే.. సామాజిక అసమానతలన్నీ, అంతరాల్నీ, అవాంతరాల్నీ కథలలో చిత్రీకరించినప్పుడు.. వ్యవస్థ మీద విరుచుకుపడరు. ఆ వ్యవస్థలో భాగమైన వ్యక్తి బాధ్యతనీ గుర్తు చేస్తారు. భావుకత, సున్నితమైన వ్యంగ్యం కలగలిపిన శైలి వీరి ప్రత్యేకత.." అంటూ కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కార స్వీకర్త శ్రీమతి అబ్బూరి ఛాయాదేవిగారు కితాబు ఇస్తే, "శ్రీ విహారి రచనల్లో అదృశ్యంగా ఒక జిజ్ఞాసువు యొక్క అంతరంగం కనబడుతుంది. ఒక దృశ్యం వెనుక ఒక దర్శనాన్ని వ్యక్తం చేయగల పరిణత, అనుభవాన్ని అనుభూతి శకలంగా పరావర్తనం చేయగల కుశలత, సిద్ధాంతాన్ని సహృదయతతో మేళవించగల చైతన్యం ఆయన కథల్లో కనబడతాయి. మామూలుగా కాదు.. చాలా అద్భుతంగా..!!" అంటూ ఓ అద్భుతమైన

విషయం చెప్పారు.. మరో ప్రముఖ రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత శ్రీ మునిపల్లె రాజు గారు.

శ్రీ విహారిగారి కథల్లో సహజత్వం కొట్టొచ్చినట్లు కనబడుతుంది. కల్పన కనబడదు. భాషలో ఉన్న ఉపమానాలు, సూక్తులు ఆశుగా వీరి కథల్లో అంతర్భాగాలుగా చోటు చేసుకుంటాయి. మనసుని హత్తుకుని ఆలోచనల్లోకి ముంచే సంభాషణలు, ఎత్తుగడలోనే కథని ఆద్యంతం చదివించే ఓ చతురత, సరళమైన భాష, ఓ గాఢమైన మత్తుతో పాఠకుడ్ని కుదిపేసే ముగింపు.. శ్రీ విహారిగారి కథలకి ఆభరణాలు ఇవే. ఆయన రచయితే కాదు, సాహిత్య శాస్త్రజ్ఞుడు, సాహిత్య శిల్పి.. అంటూ తెలుగు ప్రముఖులు వెల్లబుచ్చిన అభిప్రాయాలలో అతిశయోక్తి లేదు! ఇది పచ్చి నిజం.. ఇదే విహారి'ఇజం'! ఇలా.. శ్రీ విహారిగారి గురించి ఎంత రాసిన.. సూర్యుని ముందు దివిటీ చూపెట్టినట్లే ఉంటుంది!!

మరి ఇంత విశిష్ట రచయితకి రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డు 1977 వ సంవత్సరంలోనే వచ్చింది గాని, కేంద్ర సాహిత్య అకాడమీ వారి పురస్కారం ఆలస్యం అయిందనిపిస్తుంది. అది ఇకనైనా రావాలి! వస్తుందనే ఓ గట్టి నమ్మకంతో.. ఈ నాటి 'కథా మంజరి' కి విశిష్ట అతిథిగా విచ్చేసి, మమ్మల్ని ఆశీర్వదించి, ప్రోత్సహించిన 'విహారి' అనబడే శ్రీ జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి గారికి శతవందనాలు సమర్పించుకుంటున్నాం!

తెనాలిలో జన్మించి, మచిలీపట్నంలో ఉద్యోగ పర్వం ప్రారంభించి, వివిధ ప్రాంతాల్లో పనిచేసి.. భాగ్యనగరంలో భార్యా, పిల్లలు, మనుమలు మనవరాళ్లతో నిండైన జీవనం సాగిస్తున్నా శ్రీ విహారిగారి సాహితీ వెలుగులు, వెలుగుబాటలు నిరంతరం మనకు లభించగలవని ఆశిస్తూ.. స్వస్తి!!

***0***



# కథా మార్గదర్శి

ఆదివిష్ణు విఘ్నేశ్వర్రావు! ఇంటి పేరే ఆదివిష్ణు. కలం పేరేమీ కాదు! ఆదివిష్ణు అంటే 1960 ల్లో బందర్లో ప్రవహించే కథా చైతన్యం! 1961 లో నేను బందరు ఎల్ ఐ సి లో చేరాను. అప్పటికే (1960) శాలివాహన అదే ఆఫీస్ లో ఉద్యోగిస్తున్నాడు. సింగరాజు రామచంద్ర మూర్తి మా ఇద్దరికీ ఆఫీసులో సీనియర్ (1957 లో చేరాడు). నేను విహారి పేరుతో, టి. నారాయణమూర్తి – శాలివాహన పేరుతో అప్పటికే పత్రికల్లో రచనలు చేస్తున్నాము. 1962 లో 'చుక్కాని' లో ఇద్దరమూ చెరో కథా విడివిడిగా రాశాము. సింగరాజు చూశాడు. పట్టుకున్నాడు. ఆదివిష్ణుకి కథా 'రచన' లో ఈ సింగరాజు ఆది గురువు! సిం., ఆ., వి&శా – కలిశారు. రోజు సాయంత్రం పార్కులో ఆదివిష్ణు దర్బార్! పెద్ద సాహితీపరులూ, మధ్య (తరగతి) రచయితలూ, పిల్ల కథకులూ – అందరూ కలిసి వేరుశనక్కాయల్ని అరగారగా ఆరగిస్తూ బోలెడు కబుర్లు! కథలు 'చెప్పే' నైపుణ్యం ఆదివిష్ణు 'పేటెంట్'! అది మరొకరు వల్ల కాదు!

కాలేజీ చదువు 'చివరాఖరి' (ఆదివిష్ణు ఊత పదం!) సంవత్సరం అతని 'అగ్గిబరాటా' కథ ఆంధ్ర సచిత్ర వార పత్రికలో సెంటర్ స్ప్రెడ్, బాపు బొమ్మతో 'అదరహో!' ఆదివిష్ణు కాలేజీకే కాదు, కథకులకే కాదు, బందరుకీ, కథాలోకానికీ – 'హీరో' స్టేటస్ వచ్చింది! అది కళ్ళారా చూసి, మనసారా పొంగిపోయి, 'పత్రికలో మా కథ రావాలి గురూ' అంటే, ఏం లేదు ఒక్క మొదటి కథని మాంచి మసాలాతో 'బాయ్ మీట్స్ గాళ్' గా దంచేయండి. అంతటితో మీరు ఆంధ్ర పత్రిక రైటర్ అయిపోతారు' అని 'గీత' నిచ్చాడు. మేము ఆచరించాము. మూడో వారం వి&శా .. డిట్టో డిట్టో .. !

ఆ తర్వాత అతను గానీ, మేం గానీ అలాంటి కథలేమీ వరస పెట్టలేదు. కానీ అతను విజృంభించాడు. మేమూ అదే చేశాము.

ఆదివిష్ణు నాకు ఆరాధ్య కథకుడు అయినాడు! ఎందుకనీ? నేను ప్రాచీన, ఆధునికాంగ్ల సాహిత్యాల్లో బాగా అధ్యయనపరుణ్ణి అప్పటికే. అందుకని, అతని ప్రతి కథనీ, కథనాన్నీ, వాక్యాల్నీ, మాటల్నీ- ఎంతో ఎంతో (ఇంకా ఎన్నో 'ఎంతో' లు మీరు పెట్టుకోండి!) అనలిటికల్ గా చదవసాగేను. వాటన్నిటిలోనూ ఒక విద్యుత్ శకలం ఉంది. అది అతని పలుకుబడి. ఆ మాటల్లో అత్యంత 'సింప్లిసిటీ', అత్యంత చల్లని స్పర్శ! అతని వాక్యాలు – హఠాత్తుగా మన కన్నుని చెమరింప చేయగలవు, గుండె నాడిని వత్తి వదల గలవు.

తెలుగు కథకుల్లో అతని వాక్య సరళిలోని శక్తి గల రచయితలు నా దృష్టిలో ఐదారుగురు మాత్రమే ఉన్నారు! అతను 'మనిషి మిధ్య' నవల రాసి మొదటి బహుమతి పొందాడు. కథలకి లెక్కలేదు. 'భారతి' మాస పత్రికలో అతను రాసిన 'శ్రీమతి రాధమ్మ', 'శ్రేయోభిలాషులు', పత్రికలోని 'ఉద్యోగం', స్వాతి లోని 'ఏలిక', జ్యోతి లోని 'సిద్ధార్ధ'.. వంటివి క్లాసికల్స్!

'పిటీ' ఏమిటంటే, ఆదివిష్ణు పేరు అందరికీ తెలుసు. అతనికి అద్భుతమైన ప్రచారం, పేరూ ప్రతిష్టా వచ్చినై. కానీ, కథకుడిగా ఆదివిష్ణు రచనల్ని ఏ విమర్శకుడూ, సంకలనకర్తా ఉదహరించలేదు, ప్రశంసించ లేదు, కథల్ని తీసుకోలేదు. ఇలాంటి మణిపూసలు మనకి తెలుసు. [నేను వేరే సందర్భంలో వివరాలు రాస్తాను] వారంతా – ఆయా విమర్శకులకూ, సంకలన కర్తలకూ – అంటరానివారు! ఇదొక దయనీయ స్థితి! దీనికి ఒక్క కారణాన్ని మాత్రం – (నా ఊహలో) చెప్పగలను. వారంతా వీరి కథల్ని చదవలేదు; చదవరు; చదివినా తమ భావజాలానికి దగ్గరగా రారు!

అవునూ, ఏమిటీ ఈ ఆదివిష్ణు ప్రత్యేకత? చెబుతాను. అతను తెలుగు కథకు ఒక విలక్షణ రచనా శైలినిచ్చాడు. ఒక Native Style ని ఇచ్చాడు. అది అతని ముద్ర. అలాగే, కథని అతను నిర్మించే విధానంలో ఒక 'ఆర్కెస్ట్రెషన్' ఉన్నది. దాని వలన ఒక 'సింఫోనీ' వస్తుంది కథకి. ఆ అల్లిక, చదివించే గుణం, శృతి సుభగత్వం - ఇవన్నీ అతని సొంతం. అతని కథలు ఎత్తుగడలే 'క్లాసిక్స్'! చూడండి.

'రాధమ్మ అభిమానం పూర్తిగా దెబ్బతిన్నది' – ఇదీ 'శ్రీమతి రాధమ్మ'!

'వేసవి కాలం, తేదీలు వగైరా వద్దు, అంటే. దేశమంతా ఎండలతో మండిపోతోంది' – 'సిద్ధార్ధ' మొదలు!

'ఆయన వెళ్లిపోయారు. నిట్టూర్చాను. హృదయం బరువెక్కింది. నా కళ్ళల్లో నీళ్ళు నిండుకున్నాయి. రాయిలా గుమ్మం దగ్గిరే నించున్నాను. ఆయన వెళ్లిపోతూ అన్న మాటలు చెవుల్లో రింగుమంటున్నాయి..' – 'ఉద్యోగం' కథ మొదలు!

అతని కథా కథనరీతిలో ఈ పొట్టి పొట్టి వాక్యాలే అతి శక్తివంతమయినవి.. .. ఇలా ఎన్నో గుణ విశేషాలు అతని కథల నిండా విస్తృతంగా ఉన్నాయి.

'భారతి' లో 'మంచు తెర', 'అతిథి' వంటి నాటికలు రాసి, అతను నాటకాల్లో పడ్డాడు. అక్కణ్ణుంచి సినిమా రంగాన కాలు పెట్టాడు, 'ఘోస్టు' రచయితగా, తదుపరి రచయితగా కాలూని నిలిచాడు. అద్భుతమైన విజయాలు సాధించాడు.

కథకుడిగా ఆదివిష్ణు కథల సంపుటి తేవాలని నేనూ, కథానికా'జీవి' వేదగిరి రాంబాబు ఆలోచించాము. (రాంబాబు చాలామంది రచయితల కథా సంపుటాలు తెచ్చాడు. చాలామందికి అతని కథానికా సేవ తెలుసు). 'ఆదివిష్ణు కథానికలు' సంపుటి వచ్చింది. 29 కథలున్నాయి దానిలో.

ఆదివిష్ణు మరణం మజిలీని ఎన్నుకుని వెళ్ళిపోయాడు. కానీ, అతని సినిమాలూ, నాటకాలూ వెనక నడుస్తూ వెళుతున్నాయి. అలాగే అతని కథలు నా వంటి వారి ద్వారా ఆ లాంగ్ మార్చ్ కి నేపథ్య గీతాల్ని సమకూరుస్తూనే ఉంటాయి. ఆదివిష్ణు కథల్ని చదవాలి, చదివి తీరాలి. కథకుడు అనేవాడికి అవి పెద్ద బాలశిక్ష పాఠాలు! అతని కథల మీద పి హెచ్ డి పరిశోధనలు జరగాలి.

'కథా మంజరి' పూనిక, క్రమబద్ధంగా ప్రచురించడం – ఈనాటి సాహిత్య పత్రికా సందర్భంలో ఒక అసిధారావ్రతం. అందునా కథలకు బహుమతులు ఇస్తూ. ఇందుకు కథకలోకం దీని నిర్వాహకులకు ఋణపడి ఉండాలి. వారి దీక్షకు 'చే'యూతనీ ఇవ్వాలి. 'కథా మంజరి' టీం కి అభినందనలు – ప్రత్యేకించి జయంతి ప్రకాశ శర్మ గారికీ, అవసరాల వెంకటరావు గారికీ ధన్యవాదములు.

■ విహారి

***

# మొదటి బహుమతి

# అంతర్జాలం – అంతరాయం

వి వి రమణ మూర్తి





# అంతర్జాలం – అంతరాయం

## వి వి రమణ మూర్తి

ఒక ఆదివారం సుప్రభాతాన ఇంకా కళ్ళు తెరిచీ తెరవకుండానే చేయి చాచి, సెల్‌ఫోన్ అందుకని, ఫేస్బుక్కు తెరవబోయిన మూర్తి కెవ్వున కేక పెట్టేడు. వంటింట్లో పని చేసుకుంటున్న అతని భార్య శ్యామల కంగారుగా పరుగెత్తుకు వచ్చి, దిగాలుగా కూర్చున్న మూర్తిని చూసి, ఫోన్లో ఏ దుర్వార్త తెలిసిందో ఏమిటోనని, 'ఏం జరిగిందండి, మనవాళ్ళంతా క్షేమమే కదా' అంటూ ఆత్రుతగా అడిగింది.

“ఇప్పుడు వాళ్ళ గోలెందుకులే, ఫోన్లో నెట్ రావడం లేదు! వైఫై కనెక్షన్ లేదంటోంది. రాత్రి పడిన వానకు ఏ సెల్ టవర్ దెబ్బ తిన్నదో, ఏ వైరు ఎక్కడ ఊడి పడిందో కానీ నెట్ పనిచేయడం లేదు. ఇవాళ అంతా ఎలా గడిపేది, అసలే ఆదివారం ఆయె, ఏం చెయ్యాలో బోధపడడం లేదు!” కాలో, చెయ్యో విరిగినంతలా ఫీలయ్యాడు మూర్తి. ఫోను కొన్న కొత్తలో దానిని సరదాగా వాడినా, తరువాత కాలక్షేపంగా, చివరికి అదొక వ్యసనంలా మారింది.

శ్యామల ఆనందంగా 'ఐతే లేచి త్వరగా తయారవ్వండి, అలా షికారుకో, షాపింగుకో వెళ్ళి రావచ్చు. దారిలో ఓ మంచి హోటల్లో భోజనం కూడా చేసి రావచ్చు' అన్నది. మామూలు రోజుల్లో ఎలాగూ సాయంత్రం ఆఫీసునుంచి వచ్చాక ఆ దిక్కుమాలిన ఫోను పట్టుకు కూర్చునే తన భర్త, కనీసం ఆదివారం శెలవు రోజైనా బయటకు తీసుకువెళతాడనుకుంటే, అదీ ఉండటం లేదు! ఆ రోజు కూడా అదే పని!! కేవలం అవసరాలకు తప్ప, ఇక దేనికీ మంచం దిగడు! అలాంటిది.. ఇవాళ నెట్ పనిచేయక పోవడంతో ఆ రోజంతా అతనితో హాయిగా గడపవచ్చుననే ఆశ ఆమెలో చిగురించింది. ఆ విషయమే అంది.

ఖర్చంటే వెనకాడే మూర్తికి ఆమె మాటలు విని ముచ్చెమటలు పట్టాయి. ముఖానికి నవ్వు పులుముకొని “తప్పకుండా వెళదాము, కాకపోతే ఇలా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, నీకు వంటింట్లో కాస్త చేదోడు వాదోడుగా ఉంటే ఎలా ఉంటుందంటావు?” అని అడిగాడు.

ఏదో వంకతో ఎలాగూ బయటకు తీసుకెళ్ళడు, కనీసం ఈ ముచ్చటైనా ఎందుకు కాదనాలని, "సరే, లేచి ముఖం కడుక్కోండి, కాఫీ తాగి పనిలో పడవచ్చు!" అని చెప్పి వెళ్లింది. బతికానురా దేవుడా అనుకుని లేచి కాలకృత్యాలు తీర్చుకొని ఆ రోజు న్యూస్ పేపరు చేతిలోకి తీసుకున్నాడు మూర్తి.

ప్రతిరోజు మంచం దిగిన దగ్గర నుంచి ఆఫీసుకు వెళ్ళే వరకు ఫోన్లో వాట్సప్పు మెసేజీలో, ఫేస్బుక్కో చూసుకుంటూ, టిఫిన్ దగ్గర కూడా ఫోను వదలని మూర్తి, ఈ రోజు మాత్రం ఒక చేతిలో కాఫీ, ఇంకొక చేతిలో న్యూస్ పేపర్ పట్టుకుని, "ఇలా తీరికగా కూర్చుని పేపర్ చదివి ఎంత కాలం అయిందో కదా" అనుకున్నాడు. ఫోన్లో ఫార్వర్డ్, గాసిప్పు వార్తలకు అలవాటు పడిన అతనికి, పేపరు చదువుతుంటే కొత్తగా, ఓ వింతగా అనిపిస్తూ ఉంది. చిన్నతనంలో వార్తాపత్రిక రాగానే ఇంట్లో తన అన్నదమ్ములందరూ ఆ పేపరులో తలో పేజీ లాక్కుని చదువుకున్న రోజులు గుర్తుకొచ్చాయి!

నేటి సమాజ పరిస్థితులకు అద్దం పట్టే ఈ వార్తాపత్రికలను వదిలేసి, నిజమో కాదో తెలియని ఆ ఫోనులో సమాచారానికి ఎందుకు బానిసలౌతున్నామనే ఆలోచన అతని మదిలో మెదలసాగింది. ఒక గంట పాటు సినిమాలతో సహా అన్ని వార్తలు చదివేసి తృప్తిగా ఒళ్ళు విరుచుకొని వంటింటి వైపు కదిలాడు.

వంటింట్లో వంట చేస్తున్న తన భార్య వైపు చూస్తూ కళ్ళు తిప్పుకోలేక పోయాడు. అప్పుడే తలారా స్నానం చేసి వచ్చిన ఆమె, తలకు టవల్ చుట్టుకుని, నుదుటున కుంకుమ బొట్టుతో, రొంటిన దోపిన చీర కొంగుతో కొత్త అందాలు జిమ్ముతూ ఉంటే, ఇన్నాళ్లూ ఈ అందాలన్నీ ఏమైపోయాయనుకుని అదే మాట అంటూ ఆమెను చుట్టుకోబోయాడు.

"ఏమిటిది పట్టపగలు, పట్టపగ్గాలు లేకుండా!" అని ముద్దుగా విసుక్కుంటూ, "అయినా అందాలు నాలో కొత్తగా రాలేదు. మీ చూపుల్లో వచ్చాయి. ఫోనుకు శెలవు దొరకడం వలన మీరు అన్నీ చూడగలుగుతున్నారు. ఎప్పుడూ నా చుట్టూ తిరిగే మీరు, ఇప్పుడు నా స్థానంలో ఆ ఫోను ప్రవేశించడంతో, కేవలం అవసరాలకు మాత్రం నన్ను వినియోగించుకుంటున్నారు, ఔనా!" అని సూటిగా అడుగుతున్న ఆమెకేసి చూడలేక పోయాడు మూర్తి.

"నన్ను క్షమించు శ్యామల ! ఫోను పిచ్చిలో పడి నిన్ను నిర్లక్ష్యం చేసిన మాట నిజమే, చూడు ఇక రేపట్నుంచి అవసరానికి తప్ప ఫోను ముట్టను!" అని మాటిచ్చి, భార్యకు సాయంగా కూరగాయలు తరగసాగాడు. భార్యను ప్రసన్నం చేసుకుని, వంటల్లో సాయం చేస్తూ, ఆడుతూ పాడుతూ పని ముగించి, స్నానం చేసి తీరికగా కూర్చున్నాడు.

ఆమె కూడ తన పని ముగించుకుని వచ్చి అతని సరసన కూర్చుని కబుర్లు చెప్పసాగింది. చాలాకాలం నుంచి దాచుకున్న సంగతులన్నీ, ఇన్నాళ్ళకు తీరికగా దొరికిన భర్తతో ఆమె అలా కట్ట తెగిన గోదారిలా, అలుపు సొలుపు లేకుండా చెబుతూ ఉంటే అతను అచ్చెరువుగా వినసాగాడు. ఇటువంటి సరదాలకు, సంతోషాలకు తనకు తానుగా దూరమైనందుకు నొచ్చుకున్నాడు.

కాస్సేపటికి భోజనాలు ముగించి చిన్న కునుకు తీద్దామని ప్రయత్నించినా నిద్ర రాలేదు. పక్కనే తన శ్రీమతి మాత్రం ఈ మధ్యకాలంలో తను గమనించని ఆనందంతో ఆదమరచి నిద్రపోతోంది. కాసేపు ఏదైనా పుస్తకం చదువుదామని పుస్తకాల అర దగ్గరకు వెళ్లాడు. ఇన్నాళ్లూ తమను పలకరించలేదని అలిగినట్టుగా చెల్లాచెదురుగా, దుమ్ము పేరుకుని ఉన్న పుస్తకాలను దులిపి సర్దాడు. చిన్నతనం నుండి తనకు తెలుగు సాహిత్యం పట్ల ఆసక్తి ఉండడం వలన వాటిని 'కొని' చదివి భద్రంగా దాచుకునేవాడు. ఈ మధ్యకాలంలో ఫోనుతో అనుబంధం పెరిగి, ఆ పుస్తకాల వంక చూడడం మానేసాడు. దుమ్ము దులిపిన పుస్తకాన్ని చేతిలోకి తీసుకోగానే పాత మిత్రుణ్ని కలుసుకొన్న భావనతో దానిని ఆత్మీయంగా తడిమాడు. చదివిన పుస్తకమే అయినా మరొకసారి ఇష్టంగా చదివాడు. మనసంతా ఆనందంతో నిండిపోయింది.

కళ్ళు మూసుకుని పొద్దున నుండి జరిగినదంతా నెమరువేసుకుంటే, మనసుకు సంతృప్తిని, హాయిని కలుగచేసే ఇటువంటి చిన్న చిన్న ఆనందాలకు తను ఇంతకాలం ఎంత దూరమయ్యాడో తెలిసింది. అనుకోకుండా అంతర్జాలానికి ఒకరోజు అప్రకటిత శెలవు కావడం వలన తన కళ్ళు తెరుచుకున్నాయి. అలాగని ఫోను వినియోగం పూర్తిగా మానలేడు. దైనందిన జీవితంలో భాగమైన ఫోనును అవసరార్థం మాత్రమే ఉపయోగించుకోవాలని, భార్యతోనే ఎక్కువ సమయం గడపాలని నిశ్చయించుకుని, పడుకుని ఉన్న భార్య వైపు అభిమానంగా చూసాడు. మధ్యాహ్నం పూట నిద్ర అలవాటులేని మూర్తికి, సాయంత్రం ఏంచేయాలో ఆలోచిస్తూ ఉంటే నిద్ర పట్టేసింది.

నాలుగు గంటలకు నిద్ర లేచి, వంటింట్లోకి వెళ్లి, కాఫీ కలిపి, ఆ కప్పులతో గదిలోకి అడుగు పెట్టిన శ్యామల భర్తను చూస్తూనే నిర్ఘాంతపోయింది. ఎప్పుడూ లేచాడోగాని, దీర్ఘకాల ఎడబాటు తర్వాత ప్రియురాలిని కలిసినంత పారవశ్యంలో మునిగి ఉన్నాడు. అతని చేతి వేళ్లు లయబద్ధంగా ఫోన్ ని తాకుతున్నాయి! శ్యామలకు వార్డ్రోబ్ లో అందంగా ఉన్న కుక్క బొమ్మ, దాని తోక కనబడ్డాయి!

***0***

# రెండవ బహుమతి

# ఇంట్లోనే ఉండండి - క్షేమంగా ఉండండి

పి ఎల్ ఎన్ మంగా రత్నం





# ఇంట్లోనే ఉండండి .. క్షేమంగా ఉండండి!!

**పి ఎల్ ఎస్ మంగా రత్నం**

ముఖం కనబడకుండా సగం వరకూ కప్పేసిన మాస్క్, కూరగాయల మార్కెట్టుకి మంచి బట్టలెందుకన్నట్లు, పాతదైన టీ షర్టూ .. మోకాళ్ళు దిగిన హాఫ్ ఫాంటూ, కాళ్ళకి నిండుగా సాక్సూ, వాకింగ్ బూట్లూ, రెండు చేతుల్లోనూ బరువులు. ఓ చేతిలో పెద్దదైన గుడ్డ సంచీ, దాని నిండా కూరగాయలు. మునగకాయలూ, ఆకుకూరలు, చివరిగా ఓ పెద్ద కరివేపాకు కొమ్మతో సంచి నిండిపోయి బరువుగా వేళ్ళాడుతుంటే .. మరో చేతిలో నాలుగు రోజులకు సరిపడా పాల పేకెట్లూ ఇంకా ఇంటికి కావలసిన వెచ్చాలతో అంతే బరువుతో పాలిథిన్ బ్యాగ్. రైతుబజారు ఎంత రద్దీగా ఉందో గాని, అన్నీ సాధించుకుని వచ్చినట్లు విజయగర్వంతో బ్రతుకు పోరులో గెలిచి వచ్చిన యుద్ధ వీరుడిలా కనిపించాడు మోహన్.

బరువులేవీ నేల మీద దింపకుండా "ఉమా" అంటూ పిలిచాడు భార్యని.

ఉమ వచ్చి తలుపు తీసి, కర్టెను పైకి వేసి భర్తకు దారి ఇస్తూనే ఫోన్లో మాటాడుతుంది.

"అలాగే, అన్నయ్యా! జాగ్రత్తగానే ఉంటున్నాం. ఎంతో అవసరం అయితే, తప్ప ఎక్కడికీ వెళ్ళడం లేదు. ఇప్పుడే ఈయన పాలూ, కూరగాయలూ పట్టుకు వచ్చారు. ఇంక నాలుగు రోజుల వరకూ బయటకు వెళ్ళాల్సిన పని లేదు .. ఇంట్లోనే ఉంటున్నాం. మీరూ ముంబాయిలో అలాగే ఉండండి మరి!!" అంటూ జాగ్రత్తలు చెప్పింది దూరంగా ఉన్న అన్నగారికి.

మోహన్ తెచ్చిన బ్యాగులు చూస్తూ "ఏమిటీ? ఈ కూరగాయలూ .. పిచ్చి పట్టిందా ఏమిటి? నేను పంపింది వంకాయల కోసమే కదా! ఉండేదే ఇద్దరం. ఏం చేసుకుంటాం ఇన్నీ. ఇంత తోటకూరా, రెండు కట్టల గోంగూరా ఎందుకు? ఇంట్లో కొత్తిమీర ఉండనే ఉంది మళ్ళీ కొత్తిమీర ఎందుకు?" విస్మయంగా అంది.

అయినా ఏం మాట్లాడలేదు మోహన్. వెంటనే సమాధానం చెబితే, భార్య మరోటి అందుకుంటుంది. మాట్లాడకుండా స్నానానికి బయలుదేరాడు.

'ఈయనకి అంతే! మార్కెట్టుని చూస్తే పిచ్చి పడుతుంది. కనిపించినవి అన్నీ కొనేస్తారు' అనుకుంటూ పని ప్రారంభించి .. తోటకూరని చేతిలోకి తీసుకుని వేర్లనీ, పాడైన ఆకుల్నీ వేరుచేస్తుంది.

పది నిముషాల్లో స్నానం చేసి వచ్చాడు మోహన్.

"ఎంతేమిటి ఈ తోటకూర, చేస్తుంటే ఎంతకీ తరగడం లేదు!" అడిగింది విసుగ్గా.

"ఏదైనా పది రూపాయలే! టమాటాలూ కేజీ ఆరు రూపాయలే!" చెప్పాడు తల దువ్వుకుంటూ.

"అయితే మాత్రం.. ఒక్కసారిగా ఇన్ని ఏం చేసుకుంటాం? ఈరోజు తిన్న కూరగాయ మరో రెండు రోజులకు గాని ముట్టం. తీరా వండుకునే సరికి చాలా వరకూ పాడై పోతాయి. ఆ పాడైనవి కనీసం 'కిచెన్ వేస్టు' గా వేసుకోవడానికి అయినా పూల కుండీల్లో ఖాళీ ఉందా.. అంటే అదీలేదు! అన్నీ నిండిపోయాయి!!" కోపంగా అంది.

మళ్ళీ మౌనం. అంతకు మించి రెట్టించితే గొడవ.

ఈయన్ని 'కెనడా' లో ఉండే పెద్దకొడుకూ .. మామిడికుదురు అవతల ఉన్న 'మానేపల్లి' లో అత్తారింటిలో 'లాక్ డౌన్' పేరుతో చిక్కుకుపోయిన చిన్నకొడుకూ ఊదరగొట్టేస్తున్నారు.

"పరిస్థితి ఏం బాగాలేదు నాన్నా. ముందు ముందు ఈ లాక్డౌన్ ఇంకా పెంచే అవకాశం ఉందని వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ చెబుతుంది. అందుకని రెండు నెలలకు సరిపడా వంట సామాన్లు కొని ఉంచుకోండి. అలాగే కూరగాయలూ ఏం కావలిస్తే అవి ముందుగా కొని పెట్టుకోండి!" అని పెద్దవాడు అంటే ..

"ఇంకా ఉండే కొద్దీ ఏ.టీ.ఎం లు పని చెయ్యకపోవచ్చుట, డబ్బు కూడా బ్యాంకు నుంచి ముందుగా డ్రా చేసి పెట్టుకోండి!" అని చిన్నవాడు.

ఇంట్లో ఉండి కట్టడి చేసే పెళ్ళాం కన్నా .. దూరంగా ఉన్న కొడుకుల హితబోధే ఎక్కువ వంటబట్టించుకున్నాడు మోహన్.

***

"ఎలా ఉన్నారు అమ్మా? లాక్డౌన్ ఎలా ఉంది?" అంటూ స్కైప్లోకి వచ్చాడు పెద్దకొడుకు, కోడలితో సహా.

"ఫర్వాలేదురా. లాక్డౌన్ ఉంటే ఏమిటీ? లేకపోతే ఏమిటీ? ఇద్దరం రిటైరు అయిపోయి ఉన్నందుకు, ఇంట్లో కూర్చుని వండుకుని తినడం తప్ప వేరే పనేం ఉంది గనుక. బయటకు వెళుతున్నది లేదులే!" చెప్పింది ఉమ అనబడే ఉమామహేశ్వరి.

"అందుకే జాగ్రత్తగా ఉండమనేది. సీనియర్ సిటిజన్స్ కే ఇమ్యూనిటీ పవర్ తక్కువ అని, ఇంకా రోగానికి మందు కనిపెట్టలేదు కాబట్టి, ముందు జాగ్రత్తగా ఇంట్లోనే ఉండండి అని చెప్పడం"

"సరే! మా గురించి ఎందుకులే గానీ, ఏదైనా కష్టం వచ్చిందన్నా.. మీరు పరిగెత్తుకుని రాగలరా? మీ గురించి చెప్పండి. మీ చుట్టుప్రక్కల ఎలా ఉంది? 'రెడ్ జోన్స్' కి దగ్గరలో లేరు కదా!" అడిగింది.

"లేము అత్తయ్యా! సేఫ్ జోన్ లోనే ఉన్నాం. చాలా రోజులుగా 'వర్క్ ఫ్రం హోం' చేస్తూ ఇంట్లోనే ఉండిపోయాం. మేము కొత్తగా తీసుకున్న అపార్టుమెంటు ఇరవై మూడు అంతస్తులది. మేముండేది ఇరవై

మూడో అంతస్తులో. చాలా రోజులుగా డోర్స్ కూడా తెరవకుండా ఉండిపోయాం. ఇందాకే కాస్త గాలి కోసం ఓ పది నిముషాలు తెరిచాం. ఏదైనా కావలసినా 'ఆన్ లైన్' షాపింగులో వచ్చేస్తున్నాయి. మేమూ ఇంట్లో, సేఫ్ గానే ఉన్నాం!" చెప్పింది కోడలు.

"మాకూ ఇక్కడా ఇబ్బంది ఏమీలేదురా! ఉదయం 6 గంటల నుండి 10 గంటల వరకూ బయటకు వెళ్లి కావలసిన వస్తువులు తెచ్చుకోవచ్చు. కూరగాయలు అయినా, వేరే సరకులు అయినా అన్నీ దొరుకుతున్నాయి. ఇలాంటి సమయంలో అన్నిటికీ రేట్లు పెరిగిపోతాయని అందరూ అనుకున్నారు గానీ .. అలాంటిది ఏమీ లేదు. ఎక్కడికక్కడ వాలంటీర్లు ఉండి అన్నీ చూస్తున్నారు!" చెప్పాడు మోహన్ అనబడే మోహనరావు.

"అవును. కరోనా అనేది ఒకటి వస్తుందని ప్రకృతికి ముందుగా తెలీదు కదా! కాలానుగుణంగా పండిన పంటలు ఎక్కడికి పోతాయి? దేనికీ కంగారు పడిపోవలసిన పనిలేదు. అక్కడుండి మీరు భయపెట్టేయ్యడం .. మీ నాన్న భయపడిపోవడం. ఇంటికి అక్కరలేని వస్తువులు పట్టుకోచ్చేయ్యడం, ఫ్రిజ్లో మగ్గించి, రుచీ పచీ లేని కూరలు వండుకోవడం... ఇదే వరుస! తాజా కూరగాయలు వండుకుని తిని ఎన్ని రోజులయ్యిందో!" చెప్పింది ఉమామహేశ్వరి భర్తకు అర్థం అవ్వాలి అన్నట్లు.

***

ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా, వైరస్ అదుపులోకి రాకపోవడంతో లాక్డౌన్ పొడిగిస్తున్నారు. ఉన్నవాళ్లకు ఇబ్బంది లేదు కాబట్టి, ఉన్నదేదో వండుకుని తిని హాయిగా ఇంట్లోనే ఉంటున్నారు. చెయ్యడానికి పనులేం లేవు కాబట్టి, ఫోన్లలో అయిన వాళ్ళ యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటున్నారు. ఎక్కడెక్కడో ఉన్న స్నేహితులు ఖాళీ సమయంలో అయినా కలవలేక పోతున్నందుకు బాధపడుతున్నారు.

అలాంటి, పలకరింపుల్లోనే ..

మోహనరావుకు మేనకోడలు రాణి దగ్గర నుంచి "మామయ్యా! ఎలా ఉన్నావు?" అంటూ ఫోన్ వచ్చింది.

"నాకేమే. బాగానే ఉన్నాను. ఇంట్లో నుంచి బయటకి వెళ్ళకుండా. బాగానే ఉన్నాను. నువ్వెలా ఉన్నావు? మీ అమ్మాయి ఏమంటుంది?" అంటూ అడిగాడు.

"ఆ అమ్మాయి గురించే ఫోన్ చేస్తున్నా. మా అమ్మాయికి పెళ్ళి పెట్టుకున్నాను. ఎల్లుండే పెళ్ళి. రేపు పెళ్ళికూతుర్ని చెయ్యడం. అది నీకు చెబుదాం అని"

ఒక్కసారిగా అదిరిపడ్డాడు మోహనరావు.

"హా .. అదేమిటే? కరువులో అధిక మాసం అన్నట్లు, ఇప్పుడు నీ కూతురి పెళ్ళేమిటీ ? ఓ ప్రక్క రైళ్ళు తిరగడం లేదు. బస్సులు తిరగడం లేదు. ఇలాంటి సమయంలో నీ ఇంట్లో పెళ్ళా? అసలు మీ పిల్లకి పదహారేళ్ళు ఉన్నాయా? చేసినా.. మరో ముహూర్తమే లేదన్నట్లు, ఇప్పుడేమిటీ? నీకు మతేమన్నా పోయిందా?" ప్రశ్న మీద ప్రశ్నలు వేస్తున్నాడు మోహనరావు.

"మొన్ననే పద్దెనిమిది వచ్చింది మామయ్యా! అదేమో! ప్రేమా .. పెళ్ళీ అంటుంది. అందుకని పెళ్ళి చెయ్యడానికి ఇదే సరి అయిన సమయం అనిపించింది!"

"అంటే"

"అంటేనా? నేనా వంటరిదాన్ని. నాకు అమ్మా నాన్నా లేరు. చేసుకున్న వాడూ, చిన్న వయసులోనే పోయాడు. మనిషి ఆసరా లేని పరిస్థితి. ఇంట్లో ఉన్న అత్తగారూ అంతే! పోనీ తోటికోడలి భర్త అయినా ఇంట్లో ఉంటాడు, మగవాళ్ళు చేసే పనులు చక్కబెట్టుకుని వస్తాడూ అంటే, అదీ లేదు. ఆయనకి మిలటరీలో ఉద్యోగం. దేశం బోర్డర్లలోనే ఉంటాడు. ఎప్పుడో గాని ఇంటికి రాలేడు. అందుకే, ఇంటికో 'మగదిక్కు' ఉండాలని దానికి పెళ్ళి పెట్టుకున్నాను!"

" అయితే, మాత్రం ఇలాంటి సమయంలో ఎవరు వస్తారే? ఎవ్వరూ కదలడానికి లేదు. బయటకు వస్తే పోలీసులు ఊరుకోరు. మీ 'దొంతుకూరా' అమలాపురం దగ్గర .. బాగా లోపలి ఉన్న పల్లెటూరు. కారులో రావాలన్నా ఇబ్బందే!"

"అవును మామయ్యా! కరోనా భయం చాలానాళ్ళు ఉంటుంది. అప్పటివరకూ నా కూతురు ఆగేలా లేదు. దానికి చిన్నప్పటి నుంచీ తెలిసిన అబ్బాయే, 'హై స్కూలు' ప్రేమలు. వాళ్ళకో ఎకరం పొలం ఉంది. అదే జీవనాధారం. అందుకే, అందరి నుంచీ అభ్యంతరాలు రాక ముందే, నా కూతురి పెళ్ళి చెయ్యాలనుకున్నాను, దానికి నచ్చిన వాడితో! ఇంకా చెప్పాలంటే .. ఇలాంటి సమయంలో అయితేనే, నేను చెయ్యగలుగుతాను. అందరూ వస్తే ఆ ఖర్చు నేను తట్టుకోలేను!" ఉన్న విషయం కుండా బద్దలుకొట్టినట్లు చెప్పింది .

'నీకు అంత కష్టం ఏమి వచ్చిందే, మేమందరం లేమా? అవసరానికి సాయం పట్టలేమా!' అందాం అనిపించింది మోహనరావుకి. అందరం అంటే, తనూ మిగిలిన ఇద్దరు చెల్లెళ్ళని దృష్టిలో ఉంచుకుని. ఇప్పటివరకూ అలాగే చూసారు అక్క కూతుర్ని.

ఊపిరి బిగబట్టి, వింటున్నాడు మోహనరావు.

"అందరికీ ఫోన్లు చేసి చెబుతున్నాను కదా! అని, మీరెవ్వరూ బయలుదేరి రావాల్సిన పని లేదు. విషయం చెప్పకపోతే, చెప్పలేదని అనుకుంటారని చెప్పడం. పోలీసులు పదిహేను మందికే పర్మిషను ఇచ్చారు. ఇంట్లో వాళ్ళం ఎలాగూ ఇంట్లోనే ఉంటాం. బయట నుంచి వచ్చే పెళ్ళికొడుకు వాళ్ళకే ఆ లెక్క. అదీ మాస్కులతో చేసుకోవాలని నిబంధన "

“హా”

“అంతే, మామయ్యా విషయం!! ఇంట్లోనే ఉండండి. హాయిగా ఉండండి. నెమ్మదిగా వీడియో పంపిస్తాను చూద్దురు గాని!” ముగించింది రాణి.

ఆ అమ్మాయి మాటలకు .. మాటరాని వాడిలా ఉండిపోయాడు మోహనరావు.

విషయం తెలుసుకున్న ఉమ “అంత ఆశ్చర్యపోకండి. మొన్న పేపర్లో చదివాను. ఎవరిదో! దశదినకర్మ. అవతల వాళ్ళు పోయినందుకు విచారం వ్యక్తం చేస్తూ, వాళ్ళ స్వగృహంలోనే కర్మకాండలు జరుగుతాయని తెలియ చేస్తూ .. చివ్వరిగా ‘ఇంట్లోనే ఉండండి. క్షేమంగా ఉండండి’ అని కూడా వ్రాసారు. అవతలి వాళ్ళు, మనల్ని వాళ్ళ ఇంటికి ఆహ్వానిస్తున్నారో! లేక విషయమే తెలియచేస్తున్నారో తెలియడం లేదు. అంతా కరోనా కాలం మహిమ” చెప్పింది ఉమామహేశ్వరి.

***0***

కథా మారుతి

## మూడవ బహుమతి

# ఆహార్యం

మద్దూరి బిందు మాధవి



# ఆహార్యం



**మద్దూరి బిందు మాధవి**

స్నేహితురాలు మైత్రేయి మనవడి బారసాలకి భర్త విజయ్ తో కలిసి వచ్చింది సుభద్ర. మంత్ర ఘోషతో ఇల్లంతా కోలాహలంగా ఉంది. ఓ బ్యాచ్ సూర్య నమస్కారాలు చేస్తుంటే, ఇంకో బ్యాచ్ ఆయుష్య హోమం చేస్తున్నారు. హాల్లో ఓ పక్కగా ఇద్దరు యువకులు రుద్రాభిషేకం చేస్తున్నారు. రుద్రం, నమకం, చమకం చదువుతున్న వారి స్వరం, ఉచ్చారణ వినేవారికి శివ సాక్షాత్కారం జరిపిస్తున్నట్టుంది.

"నమస్తే అస్తుభగవన్విశ్వేశ్వరాయ

మహా దేవాయత్ర్యంబకాయత్రిపురాంతకాయ

త్రికాగ్నికాలాయకాలాగ్నిరుద్రాయ

నీలకంఠాయమృత్యుంజయాయ"....

కంచు కంఠంతో మంత్రం సాగుతోంది. వారిద్దరూ ఉదాత్త అనుదాత్తాలతో మంత్రం చదువుతుంటే శ్రవణపేయంగా ఉన్నది.

"సుభద్రా రావే! మీవారొచ్చారా? కాఫీ టిఫిన్లు తీసుకోండి!" అన్నది మైత్రేయి.

"కాఫీ తీసుకున్నాంలే! రుద్రాభిషేకం చూస్తున్నాను. అబ్బా ఎవరే ఆ బ్రహ్మ గార్లు? ముఖాల్లో బ్రహ్మ వర్చస్సు తాండవిస్తోంది. కంఠం ఎంత శ్రావ్యంగా ఉందో! వారు తమ మంత్రంతో శివుడిని ఆహ్వానిస్తే ఆయన ప్రత్యక్షంగా వచ్చి కూర్చుని అభిషేకం చేయించుకున్నట్టుందే!" అన్నది సుభద్ర.

ఆ రోజు కార్యక్రమం జరిగిన తీరు సుభద్రకి ఎంతో నచ్చింది. వెళ్ళేటప్పుడు, రామశాస్త్రిగారి ఫోన్ నంబర్ అడిగి పుచ్చుకుంది. వేసవి సెలవుల్లో కొడుకు-కోడలు, పిల్లలు వస్తున్నారు. వారి చేత సత్యనారాయణ వ్రతం చేయించాలనుకుంది సుభద్ర.

రామశాస్త్రిగారికి ముందుగానే ఫోన్ చేసి తన అభిలాష చెప్పి, పూజ ఆయనే స్వయంగా చేయించాలని కోరింది. "జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి" బాగానే ఉంటుందమ్మా! పిల్లలు రాగానే ఒకసారి ఫోన్ చెయ్యండి. ఆ రోజుకి నేను వేరే పనులేమీ పెట్టుకోనులెండి. ఇప్పుడే డైరీ లో నోట్ చేసుకుంటున్నా!" అన్నారాయన.

ఇంటికి మంత్రం తాలూకు ధ్వని తరంగాలు మంచివని... అలా సంవత్సరంలో రెండు-మూడు సార్లు సత్యనారాయణ వ్రతం, రుద్రాభిషేకం, దసరాల్లో కుంకుమ పూజ రామశాస్త్రిగారితో చేయిస్తూ ఉంటుంది.

"శాస్త్రి గారూ ఈ ఏడు శ్రావణ మాసంలో మీరు, మీ భార్య ఇద్దరూ.. ముత్తైదువు, బ్రాహ్మణుడుగా వస్తే బాగుంటుంది. నా పూజ సఫలం అయిందనుకుంటాను!" అన్నది.

"నాకు ఇంకా పెళ్ళి కాలేదండి!"  అన్నారు తలవంచుకుని శాస్త్రి గారు.

"అదేం!" అని ఆశ్చర్య పోయింది.

"నా వృత్తి నచ్చక ఎవరూ పిల్లనివ్వట్లేదండి. మాది ఆఫీస్ ఉద్యోగం కాదు కదండి. పంచె కట్టుకుని.. పిలక పెట్టుకోవటం మా వృత్తి ధర్మం! కొందరికి అది అభ్యంతరకరం. మాది నికరమైన, క్రమబద్ధమైన ఆదాయం కాదని కొంతమందికి నచ్చట్లేదు. వృత్తిలో భాగంగా మంటపంగా వాడిన తువ్వాళ్ళు, కలశం, చిల్లర డబ్బులు, బియ్యం, ఇతర సామగ్రి తీసుకుంటాం కదండి! అవన్నీ చిన్నతనంగా తోస్తున్నది కొంతమందికి!" అన్నారు.

"మీరేమాత్రం సంపాదిస్తారు?" అనడిగింది.

"షుమారుగా డెబ్బై, ఎనభైవేలు సంపాదిస్తామండి. సంవత్సరంలో అన్ని నెలలు ఒకే లాగా రాకపోయినా ఏభై వేలకి తక్కువ రాదండి!" అన్నారు శాస్త్రి గారు.

"మిగిలిన వృత్తులకి పెళ్ళిళ్ళ విషయంలో ఇచ్చిన గౌరవం మాకెందుకు ఇవ్వలేరండి? మనిషి పుడితే శాంతులు, బాలసారెలు చెయ్యటానికి మేము కావాలి. ఇంట్లో చికాకులుగా ఉంటే నవగ్రహ హోమాలు, శాంతులు, అభిషేకాలు, చండి యాగాలు మేమే చెయ్యాలి. గ్రహ స్థితులు సరిగా లేకపోతే జపాలు చేయించాలన్నా,  దానాలు పుచ్చుకోవాలన్నా మేమే గతి!  ఇక ఉపనయనాలు, పెళ్ళిళ్ళు సరేసరి!

చివరికి మనిషి చనిపోతే అంతిమయాత్రకీ మేమే రావాలి. మనిషి దైనందిన జీవితంలో మా ప్రమేయం లేకుండా ఒక్క అడుగు కూడా ముందుకి జరగదు. కానీ మేము పిల్లలనివ్వటానికి పనికిరాము. ఏమిటండీ మన ఆలోచనా విధానం?" అని ఒకింత ఆవేశంగా మాట్లాడి మళ్ళీ తలొంచుకుని... "మీరడిగారని ఇవన్నీ

చెప్పానండి. నా వృత్తి పట్ల నాకేమీ చులకన అభిప్రాయం కానీ అగౌరవం కానీ లేవండి. నేను స్మార్తం చదువుకున్నానని ధీమాగా చెప్పుకుంటానండి!" అన్నారు.

శాస్త్రి గారు వెళ్ళటానికి లేచారు. అప్పటికి ఆ సంభాషణ అలా అర్ధంతరంగా ముగిసినా సుభద్ర దాని గురించే ఆలోచిస్తోంది.

***

ఒకప్పుడు ఎవరికి నచ్చిన చదువు, వారు చదువుకునేవారు. ఎవరికి వీలుగా ఉన్న వృత్తి వారు స్వీకరించేవారు. అందులో ఆక్షేపణ ఉండేది కాదు. కులవృత్తులు చేసుకుంటూ గౌరవంగా బ్రతికేవారు. సమాజంలో ఒక విధమైన సమతుల్యత ఉండేది.

కుటుంబ ఖర్చులకి వ్యవసాయాధారిత ఆదాయం ముఖ్య వనరుగా ఉండేది. అందుచేత సమాజంలో మధ్య తరగతి, ఉన్నత మధ్య తరగతి కుటుంబాలు అటు పల్లెల్లోను, ఇటు టౌనుల్లోను కూడా జీవించేవారు. స్కూల్ టీచర్లు, జిల్లా పరిషత్ లో ఉద్యోగాలు, ఆరెంపి డాక్టర్స్, కాంపౌండర్లు, గ్రామీణ బ్యాంకుల్లో ఉద్యోగాలు... ఇలాంటి వృత్తి వ్యాపకాలతో ఉంటూ పిల్లల్ని దగ్గర ఉన్న టౌనుల్లో చదివించుకునేవారు. ఈ నేపధ్యంలో పౌరోహిత్యం చేసుకునేవారు దగ్గరలో ఉన్న వేద, స్మార్త పాఠశాలల్లో చదువుకుని, ఆ ప్రాంతపు అవసరాలు తీరుస్తూ ఉండేవారు.

ప్రస్తుత కాలంలో అనేక కారణాల వల్ల అందరూ నగరాలకి వలస వెళ్ళిపోతూ ఉండటం వల్ల, వారి ఆధ్యాత్మిక, మతపరమైన అవసరాలు తీర్చటానికి స్మార్తం చదువుకున్న ఈ పండితులు కూడా నగరాలకి వెళ్ళి అక్కడే స్థిరపడాల్సి వస్తున్నది.

నగరీకరణ వల్ల ఉమ్మడి కుటుంబ వ్యవస్థ మారి చిన్న కుటుంబాలుగా విడిపోవటం, వ్యక్తిగత కుటుంబంలో కూడా పిల్లలు తగ్గటం., ఆదాయ మార్గాలు పెరగటం, అలా జీవన విధానంలో వచ్చిన అనేక మార్పులవల్ల సమాజంలో కులవృత్తుల ప్రాధాన్యత తగ్గి, అందరూ డిగ్రీలు, ఇంజనీరింగులు చదవాలని కోరుకుంటున్నారు. ఉన్నంతలో తల తాకట్టు పెట్టి తల్లిదండ్రులు కూడా ఆ కోర్సులే చదివించాలనుకుంటున్నారు.

అలా ఇంజనీరింగ్ అంటే కేవలం కంప్యూటర్స్, ఐటి, సాఫ్ట్ వేర్ కోర్సులు చదివితేనే గొప్ప అనే మరొక భావన కూడా బయలుదేరి, ఇది ఒక ప్రభంజనంగా మారి సమాజాన్ని శాసిస్తున్నది. పై చదువులని, ఉద్యోగాలని అందరి దృష్టి అమెరికా వైపే! అది తరువాతి స్థాయిలో ఫలానా కోర్స్ చదివితే అమెరికా అవకాశాలు బాగుంటాయి, మంచి సంబంధం కుదురుతుంది అని వివాహ వ్యవస్థని కూడా నిర్దేశించి శాసించే స్థితికొచ్చింది.

ఈ విపరీత మార్పులకి పౌరోహిత్యం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవారు కూడా మినహాయింపు కాకుండా పోయేటంతగా వ్యవస్థ మారింది.

ఆ పర్యవసానమే ఇప్పుడు రామశాస్త్రిగారు చెప్పిన పరిస్థితి!

***

వెంకట్రావు గారు పదవీ విరమణ సందర్భంలో షష్ఠి పూర్తి వేడుక, సత్యనారాయణ వ్రతం చేయ సంకల్పించి మిత్రులు, బంధువులు అందరిని పిలిచారు. తలపెట్టిన రెండు కార్యక్రమాలు యధావిధిగా పూర్తయి.. భోజనాలు ఆలస్యం కాకుండా ఉండాలంటే, ఉదయం పెందరాళే పీటలమీద కూర్చోవాలని ప్లాన్ చేశారు.

బాగా దగ్గర వాళ్ళని, బ్రేక్ ఫాస్ట్ కి ఉదయం ఏడింటికి ఉండేట్లు రమ్మని ఆహ్వానించారు.

పని సహాయం చెయ్యటానికని ఫణీంద్ర, వంశీధర్, శశి కుమార్ కుటుంబాలు ముందే అనుకుని.. ఆరున్నర ఆయేసరికి వచ్చేశారు.

క్రతువు నిర్వహించే బ్రహ్మగారు కూడా తన ముగ్గురు అసిస్టెంట్స్ తో తెల్లారేసరికి వచ్చేశారు.

అనుకున్న ప్రకారం షష్ఠిపూర్తయి, సత్యనారాయణ వ్రతం పూజ జరుగుతూ ఉండగా.. బంధువులు ఒక్కొక్కరుగా అంతా వేంచేశారు. ఇంకొక ఇద్దరు వ్యక్తులు వచ్చారు. వారెవరో తమకి తెలియదన్నట్టు చూశారు వెంకట్రావుగారి బంధువులు. తమకి తెలియదన్నట్టు మొహం పెట్టారు కొలీగ్స్.

వారిని వెంకట్రావు గారు కూడా ఇంతకు ముందు చూడలేదు. పాంట్-టీ షర్ట్, భుజానికి లాప్టాప్ బ్యాగులతో వచ్చారు. కూర్చోమని చెప్పి మంచినీళ్ళిచ్చి అతిధి మర్యాద చేసి, లోపలికి వెళ్ళారు వెంకట్రావుగారి వదినగారైన వసుమతిగారు.

హాల్లో కూర్చున్న మగవాళ్ళందరూ మాటల్లో పడ్డారు. పూజ ముగిసింది, మంత్రపుష్పానికి రమ్మని బ్రహ్మగారు పిలిచేసరికి అందరితోపాటు, చివరగా వచ్చిన అతిధులు కూడా టీ షర్ట్స్, పాంట్స్ విప్పి శాస్త్రోక్తంగా పంచెలు కట్టుకుని పైన ఉత్తరీయాలు కప్పుకుని పూజా ప్రదేశానికి వచ్చారు.

"సహస్ర శీర్షం దేవం విశ్వాక్షం విశ్వ శంభువం....." చివరికి వచ్చిన బ్రహ్మ గార్లు శ్రావ్యంగా మంత్ర పుష్పం చదువుతుంటే అందరు కళ్ళు మూసుకుని తన్మయులై వింటున్నారు. మంత్రపుష్పమయ్యాక, వెంకట్రావు దంపతులకి వేద ఆశీర్వచనం చేశారు.

పూజ సఫలమయిందని అందరూ ఆనందించారు. వారి ఇంటి బ్రహ్మ ప్రభాకరశర్మ గారు, వేదాశీర్వచనం చెయ్యటానికి తను ఆహ్వానించిన రామశాస్త్రిగారిని, శ్యామ శాస్త్రి గారిని వెంకట్రావు గారికి పరిచయం చేశారు.

భోజనాలయ్యాక, తాంబూలం వేసుకుంటూ రామశాస్త్రిగారిని చూసి, "శాస్త్రిగారు మీ ఆహార్యాన్నిబట్టి మీరు వేదపండితులని అనుకోలేదు. సాధారణంగా ఇలాంటి చోట్లకి వచ్చేటప్పుడు మీబోటి వేద పండితులు పంచె కట్టుకునే వస్తారు కదా! ఎంత పొరబాటుపడ్డానండి! మంత్రపుష్పం ఎంత బాగా చదివారండి. ఈ ఆశ్వయుజ మాసంలో మా కాలనీ వాళ్ళు చండీయాగం చేయించాలనుకుంటున్నారు. మీకు అభ్యంతరం లేకపోతే వచ్చి చేయించగలరా?" అనడిగాడు ఫణీంద్ర.

"అలాగే వస్తానండి!  ఇందాక మీరన్నట్లు మా ఆహార్యాన్ని బట్టి కొంతమంది పొరబాటు పడుతూ ఉంటారు. దానికొక నేపథ్యం ఉన్నది... కొన్ని సంవత్సరాల క్రితం సుభద్రగారింటికి తరచూ కార్యక్రమాలకి వెళ్ళుతూ ఉండే వాడిని. మాటల్లో తన వివాహం ఆలశ్యం అవుతున్నదని, దానికి తన వృత్తి- ఆహార్యం కారణమని చెబితే ఆవిడ తనతో మాట్లాడిన విధానం తనని ఆలోచింపచేసిందని!" చెప్పారు.

"ఆవిడేం చెప్పారో మేము తెలుసుకోవచ్చా?"  అనడిగారు ఫణీంద్ర.

"యూనిఫార్మ్ లేని మిలిటరీ వాళ్ళని, పోలీస్ వాళ్ళని ఊహించగలమా? సాఫ్ట్ వేర్ ఆఫీసుల్లో పని చేసే వారికి, యూనివర్సిటీ ప్రొఫెసర్స్ కి, డాక్టర్స్, నర్సులు... ఇలా అందరికీ ఒక యూనిఫార్మ్, డ్రెస్ కోడూ ఉండగాలేని చిన్నతనం, అవమానం మీ వేషధారణకే వచ్చిందాండి! సంగీతం పాడేవారి ఆహార్యం ఒక పద్ధతిలో ఉంటుంది. వారెప్పుడైనా పాంట్-షర్ట్ టక్ చేసుకుని పాడటానికి వచ్చి కూర్చుంటారా? పంచె కట్టుకుని ఆఫీస్ మీటింగ్స్ కి వచ్చే బ్యూరోక్రాట్స్ ని చూస్తామా?  సూట్ వేసుకుని హోటల్ సర్వర్ వడ్డన చేస్తే మనం వింతగా చూడమా? పాశ్చాత్య సమాజంలో ఇన్ని రకాల వైవిధ్యమైన వృత్తులు, వ్యాపకాలు లేవు. అందుకే మనకున్నన్ని భిన్నమైన సంప్రదాయ వస్త్రధారణ పద్ధతులు వారికి లేవు. అదీ కాక వారికున్న విపరీత వాతావరణ పరిస్థితులవల్ల వారు పాంట్-షర్ట్ మాత్రమే ధరించగలరు.  ఈ రోజుల్లో ఎక్కువగా అందరూ విదేశాలకి వెళ్ళొస్తూ ఉండటం వల్ల, అదే నాగరికత అని.. మనది వెనకబాటుతనం అని భావించి వారిని గుడ్డిగా అనుకరిస్తున్నారు. అది మన వృత్తులపట్ల లోకువ భావం, మన పద్ధతులపట్ల చిన్న చూపుని, మన వస్త్ర ధారణ పట్ల అయిష్టతని పెంచింది!" అని విశ్లేషణాత్మకంగా చెప్పారండి ఆవిడ.

"ఆ తరువాత నేను పెళ్ళి సంబంధాలకి వెళ్ళేటప్పుడు ఇలా డ్రెస్ వేసుకోవటం అలవాటు చేసుకున్నాను. ఎవరైనా మన సంప్రదాయ వస్త్రధారణని ఎగతాళి చేస్తే ఆవిడ చెప్పిన లాజిక్కే మాట్లాడతాను. ఇంటినుంచి బయలుదేరేటప్పుడు సౌకర్యంగా ఉంటుందని ఇలా తయారయి, కార్యక్రమం చేయించేటప్పుడు నా సంప్రదాయ వస్త్రధారణలోకి వెళతాను. కాలానుగుణంగా ఇలా చిన్న చిన్న మార్పులు చేసుకోవటంలో తప్పు లేదనుకుంటా!" అని ముగించారు.

వెళ్ళటానికి ఉద్యుక్తులౌతూ, మళ్ళీ పాంట్-టీషర్ట్ లోకి మారి తన లాప్టాప్ బ్యాగ్, నిస్సాన్మైక్రా కార్ కీస్ తీసుకుని అందరి దగ్గరా సెలవు తీసుకుని బయలుదేరారు.

ఆయన మాటల్లో ఆత్మ విశ్వాసం, తన వృత్తిపట్ల నిబద్ధత, గౌరవం, శాస్త్రంలో ఆయనకున్న పట్టు చూసి అందరూ లేచి నిలబడి నమస్కరించారు.

***0***

కథా మార్గం

# కన్నుల వెన్నెల



## రమేశ్ చెన్నుపాటి

ఓ చల్లని సాయంత్రం .. గోవులన్నీ పొద్దునెప్పుడో .. ఇళ్ళ దగ్గర వదిలొచ్చిన లేగదూడల కోసం ఉత్సాహంగా వెను తిరిగే వేళ! కొంటె పక్షులన్నీ తమ జంట పక్షికి మాపటేల ముద్దులకై రహస్య సందేశమిస్తూ బుజ్జి పిట్టల కడుపు నింపే వేళ, కారులో గారాల సరాగాలలో తేలియాడుతూ ఓ నడివయస్సు పతీ పత్ని! ఆవిడేదో పాడుతోంది.

స్టీరింగ్ మీద ఆయనేదో తాళమేస్తున్నాడు. ఆవిడ పాటలో శృతి లేదు, ఆయన తాళంలో లయ లేదు. వాళ్ళిద్దరికీ వాటి స్పృహ లేదు, ఇప్పుడప్పుడే రానూ రాదు! అంతలా లీనమైపోయారు ఒకరిలో ఒకరు.

ఇంతలో ఆవిడ తెగ తొడ చరుచుకుంటూ గొంతెత్తి గాత్రం పై స్థాయిలోకి తీసుకెళ్తోంది .. ఓ ఊపులో! ఆ ఊపుకి ఆవిడ సీటూ, కారూ ఆగకుండా తెగ ఊగుతున్నాయి. అయినా ఆవిడ ఎక్కడా తగ్గట్లేదు. ఆయన ఓ చేత్తో గేర్ రాడ్ నీ, మరో దాన్తో స్టీరింగ్ నీ, భయంతో వచ్చే ముందు జాగ్రత్త వల్ల .. ఆధారం కోసమన్నట్టు, గట్టిగా బిగదీసి పట్టుకున్నాడు. బిగువు మట్టుకూ నవ్వుతో కప్పెట్టేశాడు.

ఆ సంకేతం అస్సలు అర్థం కాక.. అదేదో ప్రోత్సాహమనుకుని, ఆవిడ ఎక్కడా తగ్గటం లేదు. కారు టాపు లేచిపోయేలా, ఈయన చెవులు వాచిపోయెలా.. గాత్రం పై..పై పై.. ఆపై స్థాయికి తీసుకుపోతుంది.

ఎందుకైనా మంచిదని కారు పక్కకి తీసి ఆపాడు. ఆవిడ మటుకూ పాడటం ఆపలేదు. మరోటి అందుకుంది. వంక పెట్టలేం కానీ... ఏదో జీర స్వరంలో.

ఆ కారు ఆగిన దగ్గర ఓ ఏటవాలు కొండ పైనో గుడీ, కింద నుంచీ సన్నని కాలి బాటా .. బాట పక్కనే ఓ చిన్న నాలుగు స్తంభాల మండపం ఉన్నాయి. అక్కడ అయిదారుగురు ఆడపిల్లలు ఏదో ఆడుకుంటూ ఉంటే, ఒకరిద్దరు అబ్బాయిలు బండరాళ్ళ మీద వాలి ఓరకంట వీళ్ళని చూస్తూ ఉన్నారు. వాళ్ళు చూస్తున్నారని వీళ్ళకీ తెలుసు! అదో వయసు మాయ గలాటా, రేపటి జ్ఞాపకాల చిట్టా! ఇదంతా చూస్తూ అతను ఆలోచనల్లో పడ్డాడు..

ఈయన పెదాల మీదో చిరునవ్వు.. అంతే ఆవిడలా మరో పాటందుకుంది.

నిజానికి ఆవిడ చాలా బాగా పాడగలరు. ఈయన ఇంకా శ్రద్ధగా విననూగలడు! ఓ రకంగా ఈ పాటే వారిద్దరినీ ముడేసింది. ఓ సంక్రాంతికి అతను తన పిన్నిగారింటికి వెళ్ళాడు. భోగి పండగ ముందు రోజు...

చెరువులో బాల్య మిత్రులుతో జలకాలాడుతూ మన హీరో, యమ బిజీగా ఉన్నాడు. ఇంతలో ఏటిగట్టు మీద నుంచీ విన సొంపైన పాట...

“కన్నుల వెన్నెల రూపమా.. నిన్నటి మొన్నటి స్వప్నమా..

రేపటి మాపటి సత్యమా.. నా కన్నుల వెన్నెల .. ఓహోహో..

నా కన్నుల.. నా కన్నుల వెన్నెల స్వప్నమా .. సత్యమా ... స్వప్నమా..”

ఆ గొంతులో అదోలాంటి గమ్మత్తు, అక్కడ అంతమంది అబ్బాయిలు వున్నా, వారంతా రోజు వింటున్నా, వారెవ్వరినీ తాకని పాట ఇతని మనస్సు లాగేసింది. ఏదో కట్టి పడేసింది. వంటి మీద సరిగ్గా ఉన్నవేంటివో లేనివేంటివో చూసుకోకుండా, ఏటి గట్టు మీద కొచ్చి పాట వినవొచ్చిన వైపు ఆదరా బాదరాగా పరుగు పెట్టాడు.

జీవితంలో ఇంత ఆత్రుత, తత్తర ఎప్పుడూ పడలేదు. ఇతని గుండె వేగం పెరిగే కొద్దీ ఆ పాట అలికిడి దూరం పెరుగుతోంది. ఇంతలో ఏటి పక్క రావి చెట్టు గట్టు మీద ఎవరో కూర్చుని ఉన్నారు. ఎవరా అని చూస్తే.. మెల్లగా ఏదో లొల్లాయి పాట పాడుకుంటూ ఓ పెద్దావిడ. మనవాడు ఏదో వెతుక్కుంటుంటే.

."ఏం మనవడా ఏంటీ విషయం".. అని అడిగింది.

"ఆ పాట.. ఆ అమ్మాయి ఎవరూ!” అడిగాడు.

"నేనే మనవడా నేనే!" అంటూ మళ్ళీ ఆ లొల్లాయి పాట అందుకుంది.

“నువ్వు కాదు, ఆ పాటా ఇది కాదు, అది నా పాట.. నేన్రాసిన పాట'...

"ఆ పాటా .. ఆ అమ్మాయా" అంటూ ఆ పాట అందుకుంది ఆ పెద్దావిడ. .'కన్నుల వెన్నెల..' పాట పాడింది ఆవిడా?! మన వాడు ఎక్కడలేని నీరసంతో అక్కడే కూలి పోయాడు.

"అయినా ఈ పాట మీకెక్కడిదీ .. అది నాది, నేను రాసింది .. నేను తియ్యబోయే సినిమా కోసం!" అన్నాడు.

"నీ పాటా... అయితే నువ్వే ఉంచుకో!" అంటూ గాల్లో చేతులూపి విసిరేసినట్టూ మెటికలు విరిచింది. ఇంతలో ఏటి గట్టు పక్క, తోటల్లోంచీ మసక చీకట్లోంచీ బిల బిల మంటూ పది మంది పైగా ఆడపిల్లలు పట్టు లంగాల్లో బిరబిర మంటూ ఏటి గట్టు మీదకొచ్చారు. వాళ్ళు బిగ గట్టిన లంగా ఒడిలోంచి రాలి పడుతూ ముద్ద బంతి పూలూ, గండు మల్లెలూ, మామిడి పిందెలూ ఇంకేవో, ఆ తోటల్లోంచీ దొంగతనంగా కోసుకొచ్చినట్టున్నారు. గాబరాగా గట్టు పక్కన స్టాండేసున్న సైకిళ్ళు తీసి, ఒకరు తొక్కుతుంటే, మరొకరు వెనక్కూచుని పారిపోబోయారు. మనవాడు అడ్డు నిలిచాడు. ఆ మసక చీకట్లో మనుషులు పూర్తిగా అంతుచిక్కట్లేదు. ఈ బామ్మని తన సైకిలు వెనక ఎక్కించుకున్న అమ్మాయి కాస్త వణికింది. బామ్మ బెదర్లేదు. చటుక్కున సైకిలు దిగి, తను కట్టుకున్న చీర విప్పి లోపలున్న పట్టు లంగా బిగించి.. 'నువ్వు దిగవే' అని ఆ సైకిలు తానెక్కి..

"ఏంటి మనవడా పాట నీదన్నావ్ తీసుకుపో అన్నా.. తోట నీదంటున్నావ్.. పళ్ళూ పూలూ ఇచ్చేస్తారేటీ.. ఉంచుకో నీ తోట నువ్వు .. అదిగో" అంటూ చెయ్యటు చూపించి, తుర్రుమని సైకిలు మీద నేస్తాలతో ఉడాయిస్తూ అరిచింది.

"ముందు వంటి నిండా బట్టలేసుకో, అసలే గుడి బజార్లో అయ్యోర్లు కాపలా!" అంటూ.

అప్పుడు గుర్తొచ్చింది .. మనాడికి చెరువులోంచి సగం నిక్కరూ బనీనుతో పరిగెట్టుకొచ్చిన విషయం. వెనక్కి తిరిగి అడుగేస్తున్నా ఆ బామ్మ .. ఛా..ఛా ఆ అమ్మాయే గుర్తొచ్చింది. ఇంతలో మిత్రులు ఎదురు నడిచొచ్చారు.

"ఏంట్రా ఆ హడావుడి, ఎందుకలా ఒక్క ధాటున ఏటి గట్టెక్కావ్.. బట్టలు వేసుకోకుండా పరిగెత్తావ్.. ఇదిగో తల తుడుచుకో" అని తుండిచ్చారు. మనాడు తన పాట, ఆ అమ్మాయి గురించీ చెప్తే వాళ్ళు విని నవ్వేసి ..

"వాళ్ళంతా మీ చెల్లెలి గ్యాంగేరా.. నిన్నాట పట్టించిన బామ్మ వేషధారి కీర్తనరా. మీ పిన్నాళ్ళ ఇంటి పక్కనే ఉంటుంది. వాళ్ళంతా సంక్రాంతికి ఏదో నాటకం రిహార్సల్స్ చేసుకుంటున్నారు. చిన్నప్పుడు తనని చూసుంటావు. నువ్వు సెలవలికి మీ పిన్నింటికి వస్తావు. ఆ అమ్మాయి వాళ్ళ పెద్దమ్మ ఊరెళ్తుంటుందిలే.. మంచి గడుగ్గాయి, అమాయకుడు ఎవడు చేసుకుంటాడో కానీ... ఏరా నువ్వు గానీ చేసుకుంటావేటీ?" అని నవ్వేశారు వాళ్ళు.

వాళ్ళు నవ్వులాటకి అన్నా, తను నిజంగానే తనదయ్యింది. పాట కలిపింది ఇద్దర్నీ! ఇదిగో ఆ పాట తన నోట ఈ పూటా.. పాతికేళ్ల తరువాత. గొంతులో జీర మారి చిన్న చిన్న అనారోగ్యాలు స్వరాన్ని ఇబ్బంది పెట్టినా, తన కళ్ళల్లోకి చూస్తూ వింటూంటే అదే మైమరపు. తన ఆలోచనలలో తనున్నాడు. ఇంతలో గట్టిగా హారన్ మోగింది.

"ఏంటీ ఏదో దీర్ఘాలోచనలో ఉన్నారు. నా పాట విందామని కారాపి ఏ స్వప్న లోకాల్లో విహరిస్తున్నారు?" అంటూ అతన్ని గట్టిగా తట్టింది.

ఊహల్లోంచి పూర్తిగా బైటకొచ్చిన అతను "ఈవేళ మన సిల్వర్ జూబిలీ కదా నీకేమి కొందామా అని" అన్నాడు.

"నాకేమీ కొనిపెట్టక్కర్లేదు, కనిపెట్టుకునుంటే చాలు!" అందావిడ.

“అంటే ఏమిటీ నిన్ను పట్టించుకోవట్లేదని అనుమానమా?”

"అనుమానం కాదు అభద్రత! మీ ప్రవర్తనలో ఇటీవల వచ్చిన తేడా చూసి.." అంది.

"అది నీ అపోహేమో!" అన్నాడు.

"అపోహకీ, అనుమానానికీ తేడా ఏంటో" అంది.

అంటూ తనే అంది "రెంటికీ తేడా అబద్దం చెప్పడానికీ, నిజం చెప్పకపోవడానికీ ఉన్నంతేమో"..

"అంతా సినిమా డ్రామా డైలాగులు!" అన్నాడు

"అవీ జీవితాలేగా!" అందామే..

"నేను దొరకటం నీ అదృష్టం కాదా?"  అన్నాడు

"ఆ మరే..  ఎన్ని పూజలో, నోములో, వ్రతాలో, వైరాగ్యాలో చేస్తే దొరికుంటారు. నా మానాన నేను ఏటి గట్టున పాట పాడుకుంటుంటే వెంటపడి వచ్చి మరీ చేసుకున్నారుగా!" అంది.

"అదే చెప్తున్నా, నీకేమో కానీ నాకైతే ఘోర తపస్సు చేస్తే దొరికావు!"

"అంత ఘోరంగా అఘోరించారా.. ఆ తపస్సూ! మీరేం చేసినా ఇంతే!  సెల్ ఫోన్‌కి స్క్రీన్ గార్డు వెయ్యమంటే స్టీలుతోనా, సిమెంటుతోనా అంటారు. అంతా తలా తోకా లేని యవ్వారం. వాయమ్మో నవ్వుతున్నారే విసుగూ కోపం జంటగా రావాలిగా .. మా అత్త అదే మీ అమ్మకొచ్చినట్టు" అంది.

"నువ్వూ మారావుగా, అది అనుమానమో అపోహో తీరేదాకా నిగ్గదీసి సతాయించేదానివి. ఇప్పుడెలా మారావు?"

"అప్పుడంటే చిన్నపిల్లని. కాలం ఎన్నో నేర్పుతుంది. చీర కొనే దాకా వంద చూసి ఎంచినదాన్ని. వంద సార్లు, అటూ ఇటూ .. కొలతా రంగూ, రేటూ, నాణ్యం, రూపూ, ఆ పక్కింటావిడా ఈ పక్కింటావిడా కట్టనివీ.. నే కట్టినవీ.. మీకు ఎదురింటా, వెనకింటా కళ్ళబడనివీ కుళ్ళబొడిచి కుళ్ళబొడిచి బేరమాడి కొంటా! కొనేటప్పుడింత తతంగం ఉండబట్టే ఆ తర్వాత వాటి గురించి పెద్దగా ఆలోచించను. పెట్టెలో పెట్టిన మడతల్లోనే

పాతబడేవి ఎన్నో.. అయినా ప్రతిదాని వెనకా ఓ పరిశీలన. మిమ్మల్నీ మీ ఆలోచనల్నీ పట్టాక, ఇక నాకు దిగులేంటీ. మిమ్మల్ని బాగా చదివేశావే!" అంది.

"నువ్వు చదవంది మరింత చెప్పనా .. మగాడికి ఆత్రం, ఇప్పటికిప్పుడు కాకపోతే ఇక దొరకదన్నట్టూ చూపుల ఆకలి ఆపుకోలేనంత. అది అమ్మాయి అయినా, తుండు గుడ్డయినా .. గుడ్డిగా వెంటపడ్డం .. కొనటమే .. నచ్చితే చాలంతే!" అన్నాడు.

"ఓహో అన్నీ మీరే చెప్తున్నారు కదా! ఇన్ని తెల్సినవాళ్ళు, మీరు ఈ మధ్య ఊసులాడుకునే సరోజ విషయం ఏంటీ నన్ను పట్టించుకోకపోవడం ఏమిటీ? ప్రేమించా అన్నారు. అందరాని జాబిల్లి అందనంత వరకే ఆతృత ఆరాటం .. ప్రేమ అందివచ్చాక, అంతా అలుసే అక్కరకురానంత!" ఆమె ఒక్కో వాక్యం ఒత్తి ఒత్తి అడుగుతోంది. కానీ, ఎక్కడా ఒత్తిడి లేదు .. అతడ్నుంచీ వినాలన్న కోరికే!

ఆమె తన నుంచీ వినాలని అనుకుంటున్న విషయం అర్ధమై అతను చెప్పటం మొదలెట్టాడు.

"ప్రేమా, ప్రేమించిన వ్యక్తీ ఒంటరిగా ఉన్నంత వరకూ అందరిదీ. అన్సెర్టెనిటీ .. కాంపిటీషన్, అసందిగ్ధం. ఒక్కసారి నాదీ అనిపించికున్నాక, కట్టి పడేసినట్టే కదా! నిజమే .. నీలో ఎన్ని టాలెంట్లూ .. ఒకటా రెండా ఒక్కొక్కటీ అన్నీ అణిచేశాకదా! వాడు ఆ ధనుష్‌ని .. నీ పిన్ని గారి పక్కింటోడు .. వాడ్ని చేసుకోవాల్సింది నువ్వు. వాడైతే బాగుండేదేమో .. నీకు సరిజోడు! కాలికేంటీ .. చేతి వేలిక్కూడా మట్టంటకుండా చూసుకునే వాడేమో కదా!!" అన్నాడు.

"ఆ వాడికప్పుడు అన్ని ఆలోచనలు ఉన్నాయో లేదో! నిన్నో మొన్నో కాల్ చేశా .. వాడంటాడు కదా ఏదో వేవ్ లెంత్ ఉందట మా ఇద్దరి మధ్య! వాడి పెళ్ళై ఇరవై ఐదేళ్ళై పిల్లలూ పెళ్ళీడుకొచ్చాక .. ఇప్పుడు తెలిసొచ్చింది వెధవకి!" అంది.

"ఇంతకీ ఏమంటున్నాడేంటీ .. మీ ధనుష్?" అన్నాడతను ఒత్తిపట్టి.

"మిమ్మల్నడిగి వచ్చేయమంటున్నాడు.. ఎక్కడికా.. అమెరికా.. చలి మంచు పూలల్లో పెట్టుకు చూసుకుంటాడట" అందామె.

"నువ్వేమన్నావ్?" అన్నాడతను.

"తననే అడగమన్నా.." అందామె.

"నాకు ఫోసేం రాలేదే.." అన్నాడు

."అడగమంది మిమ్మల్ని కాదు .. వాళ్ళావిడ్ని.." అంది.

"మరీ .. ఆవిడేమందో.." అన్నాడు

"వీడడగాలి కదా .. కల్లబొల్లి కబుర్లు మగాళ్ళు .. ఒకేసారి ఇద్దరిద్దర్నో ముగ్గుర్నో మభ్యపెట్టేయగలరు! ఇంతకీ మీ సరోజేమంటోంది .. టాపిక్కంతా డైవర్ట్ చేశారూ!" అంది.

"అదీ మరీ .. సరోజ, మేమిద్దరం బాగా సీనియర్ సిటిజన్లయ్యాక ..ఆవిడవీ, నావీ బాధ్యతలన్నీ తీరాక .. నీకు తెలియందేముందీ ఓ వృద్ధాశ్రమంలో కలిసుంటాం!!" అన్నాడు నవ్వుతూ.

పెద్ద పెట్టున నవ్వింది, తను మనస్సులో అనుమానాలన్నీ పటాపంచలయ్యేలా.

మలివలపు ప్రేమ మళ్ళీ చిగురించింది వారిద్దరి మధ్య .. తొలి వలపును మించి.

దూరంగా కొండ మీద యువ జంట .. ఒకరి వెంట ఒకరు కంగారుగా నడుస్తూ .. వారి వెనుకే చెట్టా పట్టాలేసుకుని ఈ పాతిక వసంతాల పెళ్ళి రోజు జంట .. ఏభై వసంతాల పరవశం వైపు .. తొలి అడుగులేస్తూ .. నింపాదిగా!!

***0***



# తాజా..తాజా..!

అవసరాల పద్మజా రాణి

"పత్తిలోని నలక వజ్రపునలక, పత్తిలోని నలక బంగారపు నలక" అంటూ అమ్మ వేకువ జామునే దీపం వెలిగించే మంత్రానికి మెలుకువ వచ్చేసింది.

"అబ్బా. అమ్మా అప్పుడే నిద్ర లేచి దేవుడికి మేలుకొలుపు మొదలుపెట్టేసావా? ఆదివారం అయినా దేవుడికి విశ్రాంతి ఇవ్వొచ్చు కదే!" అంటూ విసుక్కుంటూనే నిద్రలేచాను.

"అయ్యో తల్లి అలవాటయిపోయిందే, అప్పుడు, ఇప్పుడు మీ కోసమే తాపత్రయం! చంటిది లేచిందా ఏంటి?" అని స్వరం తగ్గించి, "అయినా మా కాలంలో అయితే అమ్మ వెనకే అందరం లేచి ఐదు లోపలే మా పిల్లల స్నానాలు కూడా అయిపోయేవి. లేలే!! మీ నాన్నగారు లేచి, కాఫీ తాగి, అప్పుడే కూరలు తీసుకు రావడానికి వెళ్లారు. తిరిగి వచ్చేసరికి నువ్వు కనిపిస్తే .. 'చూశావా నా కూతురు, నా పెంపకం' అని నా దగ్గర కాస్త ఎక్కువగానే చెప్పి సంతోషిస్తారు!" అంటూ అమ్మ నాకూ మేలుకొలుపు రాగం పాడింది.

'ఇక తప్పదురా బాబు!' అనుకుంటూ, దుప్పటిని సర్ది, పక్కలు సరిచేసి, ఫోన్లో భజ గోవిందం పెట్టాను. ఉదయాన్నే సుబ్బలక్ష్మిగారి గొంతు వింటూ ఉంటే కలిగే ప్రశాంతతే వేరు.

ఈలోపు నాన్నగారు వచ్చారు. చేతిలో ఉన్న కూరల సంచి అందుకుంటూ "ఏమిటి నాన్నగారు అంత ఆదుర్దాగా ఉన్నారు?" అని అడిగాను.

"ముందు కొంచెం మంచినీళ్లు తీసుకురా తల్లీ, అలాగే ఒకసారి అమ్మని రమ్మని చెప్పు!" అంటూ కుర్చీలో కూర్చున్నారు. నాన్న ఎప్పుడూ లేనంత విచిత్రంగా ఉన్నారు అని అమ్మకి చెప్పి, మంచినీళ్లు తెచ్చి నాన్నకి ఇచ్చాను. ఇంతలో అమ్మ 'ఏమైందండీ' అంటూ వచ్చింది.

"మన మాస్టారుగారి అబ్బాయి ఉన్నాడుగా, నిన్న రాత్రి ఆత్మహత్య చేసుకుని చనిపోయాడుట!! ఊరంతా అదే విషయం మాట్లాడుకుంటున్నారు. నిన్న రాత్రి పది తర్వాత వార్తల్లో చెప్పారట! రాత్రినుంచి అదే వార్త అన్ని చానల్స్ లో తిప్పి తిప్పి చూపిస్తున్నారట. మనం ప్రసార భారతి వార్తలతో ఆపేస్తాం కాబట్టి, మనకి తెలియలేదు!" అని ఆగారు నాన్న.

“అయ్యో మన చంటి ఇలా ఎందుకు చేశాడండి. మంచి ఉద్యోగం వదిలేసి సినిమాల్లో వేషాలు అంటూ, వద్దన్నా వెళ్లాడని మాస్టారు చాలా బాధపడేవారు. ఈ మధ్యనే కాస్త నిలదొక్కుకున్నాడు, వేషాలు వస్తున్నాయి అన్నారు. ఇంతలో వాళ్ళ కుటుంబానికి ఏంటండీ ఇలా జరిగింది? పదండి మాస్టరు దంపతులను కలిసి వద్దాం!” అని అమ్మ లేచింది. ఇద్దరు మాస్టరు గారి ఇంటికి వెళ్లారు.

మాస్టర్ ఇంటి ముందు చాలా చానల్స్ వాళ్ళు ఉన్నారు.

“అవకాశాలు రాక ఆర్థిక ఇబ్బందులతో చనిపోయాడా? ప్రేమ వ్యవహారం ఉందని, మీరు వాళ్ళ పెళ్లికి అంగీకరించలేదని, మిమ్మల్ని కాదని పెళ్లి చేసుకుంటే చనిపోతామని బెదిరించారని నిజమేనా? అందుకే ఆత్మహత్య చేసుకున్నాడా?” ఇలా మాస్టర్ని రకరకాల ప్రశ్నలతో తూట్లు పొడిచిన్నట్లుగా చేస్తున్నారు. మాస్టర్నుంచి మౌనమే సమాధానమైంది.

కొడుకు చనిపోతే ఓదార్చడానికి వచ్చే వాళ్ళని రాకుండా చేసి, వచ్చిన వీళ్ళు చేసే పని ఇది. సాటి మనిషి కష్టం అంటే అంత తేలిక అయిపోయిందా?!

చాలాసేపు ఒకే వార్తని ఏ చానల్స్ వాళ్ళు ఆ ఛానల్‌కి అనుగుణంగా వాళ్లకి నోటికి వచ్చిన మాటలతో చెపుతారు. గీతా సారాన్ని అయినా ఆకళింపు చేసుకోవచ్చు కానీ, వాక్యనిర్మాణం సరిగా లేనివాళ్ల మాటల సారాంశం మాత్రం అర్థం కాదు.

మరో ఛానల్లో మరి కొంత ముందుకు వెళ్లి, ఇదే విషయం మీద చర్చా కార్యక్రమం. అంతకు ముందు ఇలాగే జరిగిన మరికొన్ని ఆత్మహత్య సంఘటనలను తీసుకొని ఇప్పటి దానికి కారణం ఏమిటనే దిశగా ఎవరికి తోచినట్లుగా వారు వాదనలు. అదే ఛానల్లో కొద్ది నిమిషాల్లో మా ఛానల్‌కి ప్రత్యేకం.. తన చావుకి ముందు తీసుకున్న సెల్ఫీ వీడియో అంటూ ప్రతి రెండు సెకనులకు తాజా.. తాజా.. స్క్రోలింగ్. ఇక అతని చిట్టచివరి సెల్ఫీ వీడియో నుంచి చిన్నప్పటి ఉగ్గుపాల వరకు చర్చే. చర్చలో ఉండేవాళ్ళు కూడా ఒకరితో ఒకరు గొడవ పడడం చూస్తుంటే ఆ వ్యక్తి చేసిన పని మన చావుకొచ్చిందే అన్నట్లుగా ఉంటుంది వ్యవహారం.

మొత్తానికి మాస్టారుగారి అబ్బాయి శవం రాత్రికి ఊరికి చేరుతుందని తాజా..తాజా.. మొదలయింది.

ఇక మాస్టారుగారి అబ్బాయిని స్మశానానికి సాగనంపే వరకూ అలా ఏదో ఒక తాజా.. తాజా.. సంచలన వార్త వస్తూనే ఉంటుంది, పక్కింట్లో ప్రళయం వచ్చినా గుమ్మం దాటని మనం ఆ కడసారి చూపుకి మాత్రం కట్టు బానిసలై పోతున్నాము. జ్ఞానేంద్రియాలని ఎలా ఉపయోగించుకోవాలో తెలుసుకోలేని కర్మ జీవులుగా మారిపోతున్నాం. ‘టీవీ కట్టేయ్ తల్లి’ అన్నారు నాన్న ఇంటి లోపలికి వస్తూ. ఆ పని చేసి నాన్న దగ్గర కూర్చున్నా.

"ఎంత కష్టం తల్లి ఈ వయసులో. ఎంతో కష్టపడి పిల్లాడిని ప్రయోజకుడు చేశారు అనుకునే సమయంలో గట్టి ఎదురుదెబ్బ. నువ్వు పుట్టక ముందు నుంచే, వారి ఇంట్లోనే అద్దెకు ఉండేవాళ్ళం. వాళ్లకి కొంత ఆలస్యంగా

సంతానం కలగడం వల్ల నిన్ను చాలా ముద్దుగా చూసేవారు. అలా అమ్మకి, నాకు ఒక పెద్ద దిక్కులా ఉండేది ఆ కుటుంబం. నీ చిన్నతనపు ఆనందాలు అన్నీ మాస్టారి కుటుంబం మధ్యలో చాలా సరదాగా సాగేవి. తర్వాత వారికి సంతానం కలగడం జరిగింది. మనకీ కలిసొచ్చి సొంతింటికి మారడం జరిగింది. అయినా పండగలకి, పేరంటాలకి కలుస్తూనే ఉన్నాం!" అంటూ మాస్టర్ని తలచుకుని నాన్న చాలా బాధపడ్డారు.

నాన్న, అమ్మ, నేను మాస్టర్ ఇంటికి వెళ్తూనే ఉన్నాం. నాకు సెలవులు అయిపోవడంతో వచ్చేసాను. నాన్న, అమ్మ ప్రతిరోజు వెళ్లి వస్తున్నాం అని చెప్పారు. ఇంతలో ఒక రోజు మాస్టర్‌గారి నుంచి ఉత్తరం వచ్చింది. ఒకసారి ఊరికి రాగలవు అని దాని సారాంశం. మాస్టారు ఎలా ఉన్నారో అనుకుంటూ వెంటనే ఊరికి బయలుదేరాను. నాన్నగారు, నేను కలిసి మాస్టర్ ఇంటికి వెళ్ళాం.

నన్ను చూడగానే అమ్మ వస్తున్న దుఃఖాన్ని ఆపే ప్రయత్నం చేశారు. ఇంతలో మాస్టరు మాట్లాడటం మొదలు పెట్టారు! "తమ్ముడు పరిస్థితి నువ్వే చూసావుగా!! డ్రగ్స్ కి అలవాటు పడిపోయి, ఆ మత్తులోనే ఆత్మహత్య చేసుకున్నాడు. తను ఇంకా ఆర్థికంగా నిలదొక్కుకోక పోవడం, ప్రేమ విఫలం కావడం లాంటి కారణాలు చెప్పాడు. ఇవేనా మీ సమస్యలు అని నిలదీయాలని ఉంది. ఇది జరిగిన వెంటనే మేమిద్దరం కూడా శివైక్యం అయిపోదామని నిర్ణయించుకున్నాం! కానీ, దాని ద్వారా మేము ప్రపంచానికి ఇచ్చే సందేశం ఏంటి? మా విచక్షణ మమ్మల్ని ఆ పని చేయనియ్యకుండా ఆపింది!"

"ఈ వయసులో మీకు ఇంతటి ఎదురు దెబ్బ... ఎందుకూ? ఏంటీ?? అని అందరిలా గుచ్చి గుచ్చి అడగలేక పోయాం. మీరు ఇంత తొందరగా తేరుకోవడం చూశాక ప్రశాంతత కలుగుతోంది మాస్టారు!" అంటూ ఆగాను.

"ఆలస్యంగా పిల్లలిద్దరూ పుట్టడం, మీరు సొంతింటికి వెళ్లడం ఇక వారిని చాలా అపురూపంగా పెంచాం. కొన్నిసార్లు మా తాహతును దాటి వెళ్ళి, అడగకుండానే అన్ని అందించాం. బాగా పెంచుతున్నాం అనుకున్నాం! కానీ విలాసాలకు బానిసలను చేస్తున్నామని అనుకోలేదు. దూరంగా వెళితే ఎలా ఉండగలం అనే భయంతో అనుక్షణం పక్కనే ఉండేటట్లుగా చూసుకునే వాళ్ళం, కానీ మా ప్రేమతో వారిని బందీలు చేస్తున్నాం అనుకోలేదు! పిల్లలు ఇద్దరు బాగా కష్టపడి చదివి, ప్రయోజకులు అయ్యారు అనుకునే సమయానికి ఇద్దరు ఇలా అవడం చూస్తుంటే వ్యక్తిత్వాన్ని నిర్మించలేని మా పెంపకాన్ని నిందించుకోవాలో, జీవనవిధానాన్ని నేర్పలేని మన విద్యావిధానాన్ని అనాలో, అరచేతిలో స్వర్గం' చూపించే ఆధునిక సాంకేతిక విజ్ఞానాన్ని తప్పుపట్టాలో మాకు తెలియటంలేదు! ఎన్నింటినో వదులుకొని పిల్లలే సర్వస్వం అనుకున్నందుకు ఇప్పుడు జరిగిన నష్టానికి అంతకు మించిన బాధ కలుగుతోంది. ఏదీ శాశ్వతం కాదు అని తెలిసినా సరే, మనిషి ఎందుకు అలా వెంపర్లాడుతూనే ఉంటాడు అని ఈ మధ్య మమ్మల్ని మేమే ఎన్నిసార్లు ప్రశ్న వేసుకున్నామో!! నిరంతర సృష్టి క్రమంలో మనిషి ఉన్నంత కాలం మనుగడ కోసం ఈ పాట్లు తప్పవు అని మాకు మేమే సర్ది చెప్పుకుంటున్నాం. మనిషి ఆశాజీవి కదా!!"

“అదేంటి మాస్టారు చెల్లికి ఏమైంది? మొన్ననే విదేశాలలో మంచి ఉద్యోగం వచ్చింది. ఇక సంబంధాలు చూడాలి అని మీరే అన్నారుగా!”

“లేదమ్మా, తను మొదటి నుంచి స్వేచ్ఛ, సమానత్వం అంటూ ఉండేది తెలుసుగా. అక్కడే ఎవరినో ఇష్టపడి వాడితో కలిసి ఉంటున్నా. నచ్చితే పెళ్లి చేసుకుంటాను అని మొన్ననే ఫోన్లో చెప్పింది. స్వేచ్ఛ, సమానత్వం అనే ముసుగులో మీరు సాధిస్తున్నది ఏమిటి?? పోగొట్టుకున్నది ఏమిటో తెలిసే సరికి జీవితం కళ్ళ ముందు నుంచి వెళ్ళిపోతుంది అని చెప్పినా అర్థం చేసుకునే స్థితి ఇప్పుడు లేదు! చిన్నప్పుడు మా నాన్నగారు నా పదమూడవ యేట పోతే, వారాలు చేసి చదువు కొన్నాను. ఆ వారానికి వెళ్ళిన రోజు, వారి ఇంట్లో ఏదైనా ఇబ్బంది ఎదురైతే ఆ పూటకి పంపు నీరే గతి. నా కంటే పెద్దవాళ్ళకి కూడా బోధిస్తూ ఆ డబ్బులతో నా పరీక్ష ఫీజులు కట్టుకుంటూ ఇదిగో ఈ స్థాయికి వచ్చాను! ఇక అమ్మ గురించి నీకు తెలుసు. ఇరవై ఏళ్ళ వయసులో వచ్చి నన్ను, నా కుటుంబాన్ని తన అణకువతో ఆకట్టుకుని, దక్షతతో ఒక్క తాటి మీద నడిపించింది. ఎప్పుడు లేచేదో, ఎప్పుడు పడుకునేదో కూడా తెలిసేది కాదు. కానీ ఏనాడు స్వేచ్ఛ, సమానత్వం వంటి పోరాటాలు చేయలేదు. ఇద్దరం కలిస్తేనే జీవితం అనేది మా తరం. ఇద్దరు కలవడం అంటే రెండు కుటుంబాలు హాయిగా ఉండాలి. ఒక్కొక్కసారి ఒక్కొక్కరిది పై చేయిగా, ఒక్కొక్కసారి ఇద్దరం సమానంగా అని మేము అనుకునే వాళ్ళం. దానిలో ఏం లోపం ఉందో మాకు తెలియటంలేదు. ఇప్పటి తరానికి ఉమ్మడి కుటుంబమే పెద్ద గుదిబండ. ప్రతి దానికి మేమే ఎందుకు చేయాలి అనే ప్రశ్న. ఇదిగో ఇక్కడే నేనున్నా అంటూ వచ్చి పడే ఇగోలు. ఇక కలిసి ఉండడంలో ఉన్న మాధుర్యం ఎలా తెలుస్తుంది?? సర్దుకుపోవడం గురించి అసలు తెలిసే అవకాశమే లేదు. ఎవరికి వాళ్ళే హీరో కానీ వాళ్ళు చేసే ఆత్మహత్యలు వాళ్ళని చరిత్ర పుటల్లో జీరోని చేసేస్తాయి!! " అని నిట్టూర్పు విడిచారు.

“అవునమ్మా గీతా.. ‘అసలు సమస్య అంటే ఏమిటి??” అని మాస్టారి భార్య నా వైపు చూస్తూ అడిగారు. ఎవరికీ ఏం చెప్పాలో అర్థం కాలేదు.

"చిన్నపిల్లలకి అమ్మ చెయ్యి మారితే సమస్య, బడికి యూనిఫాంలో వెళ్లలేకపోతే సమస్య స్నేహితులలా బొమ్మలు, చరవాణి కొనలేకపోవడం సమస్య. కొందరికి చదువు సమస్య. తిండి తినడం సమస్య.. తిన్నది అరగకపోతే సమస్య... కొందరికి తినాలని అనిపించక పోవడం సమస్య, అందంగా ఉంటే సమస్య.. అందంగా లేకపోతే సమస్య.. ప్రేమిస్తే సమస్య.. ప్రేమించకపోతే సమస్య, పెళ్ళి సమస్య.. అసలు పెళ్ళే సమస్య!! కీర్తి, గుర్తింపు, ఆరోగ్యం .. అన్నీ సమస్యలే. అసలు ఏ సమస్య లేకపోతే ఆ మనిషే మన సమాజానికి పెద్ద సమస్య! సమస్యలు లేకపోతే మనిషి మనుగడే లేదు. ఈ సమస్యలన్నీ మనలోనే, మనతోనే ఉంటాయి.

గెలుపు వెనుక జీవితం, ఓటమి ముందు గెలుపు ఎప్పుడూ ఉంటాయి!" ఒక్క నిముషం ఆగి, మళ్ళీ ఆవిడే అంది.

"ఆ.. నలుగురితో చర్చించి మార్చుకోవాల్సిన విషయాలను కూడా సమస్యలుగా అనుకుని చివరికి చావుగా మార్చుకుంటున్నారు ఈతరం! ఇదివరకు అత్యవసరమైన విషయాలకి వాడే చరవాణి, ఇప్పుడు చావుకి రుజువులు మిగిల్చే సాధనంగా మార్చేశారు. 'అరచేతిలో స్వర్గం' అనే మాటకి ఈ తరం పూర్తిగా అర్థమే మార్చేసింది!" అంటున్న ఆవిడని ఆశ్చర్యంతో చూస్తూ "అవునమ్మా, ఆధునిక సాంకేతిక విజ్ఞానంతో చేరువలో ఉంటూ మానసికంగా దూరమవుతున్నాం. గుర్తింపు, కీర్తి, డబ్బు, పదవి ఇలా నానా రకాలుగా పాకులాడడంలో మమ్మల్ని మేం పూర్తిగా కోల్పోతున్నాం. అతి ఎప్పుడూ ప్రమాదమే! కానీ అసలే ప్రమాదంగా మారుతోంది!" అంటూ ఏకీభవించాను నేను.

ఇంతలో నాన్నగారు "అవునమ్మా, ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేయగలిగే శక్తి వార్తా ప్రసారసాధనాలకు ఉంది. ఒక ప్రాంతంలోని పలు సమస్యలను వార్తా ప్రసారసాధనాలు ప్రసారం చేయడం ద్వారా వెంటనే సంబంధిత శాఖ వారు, ఆ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తారు. కానీ వార్త తొందరగా ప్రసారం చేయాలనుకునే వేగవంతమైన సాధనాలూ, ఇలాంటి వార్త కథనాలు చేసే చెడు ముందు, ఆ మంచి మచ్చుకి కూడా కనిపించడం లేదు. ఒకప్పుడు రోజు దినపత్రిక చదవండిరా అనేవారు. ఇప్పుడు దాని నిండా హత్యలు, అత్యాచారాలు, ఆస్తి గొడవలు, అవసరం లేని సంబంధాల విషయాలు తప్ప ఏమీ ఉండటం లేదు!

చిన్నప్పుడు వేసవి శలవలకి కాకినాడ బాబాయ్ వాళ్ళ ఇంటికి వెళ్తే అక్కడ తలుపులు టి.వి. ఉండేది – కెల్ట్రాన్ వాళ్లది. అదో అద్భుతం మీకు!! రోజూ ఒకే సమయానికి వచ్చే వార్తలు తప్ప పెద్దగా ఏమీ ఉండేవి కాదు. వి.సి.పి. ను అద్దెకు తెచ్చుకుని అందరం కలిసి పాత సినిమాలు చూసేవాళ్ళం. మన సాంప్రదాయాలు, కట్టు బొట్టు ముఖ్యంగా మన అజంతా భాషకు పెద్దపీట వేసిన దూరదర్శిని ఇప్పుడు రకరకాల చానల్స్ లో తన స్వరూపాన్నిపూర్తిగా మార్చుకొని, కొన్ని ఉపయోగించ వలసిన పదాలు కనుమరుగైపోతే.. చాలా అక్కరకు రాని, అర్థం లేని, వెగటు పుట్టించే పదాలు మనకి ఊత పదాలుగా మారి పోయాయి. మన మాతృభాషకే విలువ ఇవ్వలేని వాళ్లు సమాజానికి ఇచ్చే సందేశమేమిటి? భాషకందని భావాలను గుండెల్లో పదిలంగా దాచుకునే బాల్యానికి కూడా మరకలే. చిన్నపిల్లల మీద జరిగే కొన్ని ఘోరాలు వింటున్నప్పుడు, చూస్తున్నప్పుడు వేరే ప్రపంచానికి వెళ్ళిపోతే బాగుండును అనిపిస్తుంది! మరకలు చేసుకోకు అనే సమాజం నుంచి మరక మంచిదే అనే సమాజానికి మనం మారుతున్నాము! గురు శిష్యుల మీద కొన్ని వార్తలు చాలా వెగటుగా ఉంటున్నాయి. తన కన్న బిడ్డలను చంపినా, గురువుగారి బిడ్డను చంపకూడదనే ద్రౌపదిని కన్న భారతదేశంలో, గురువుకే విలువ ఇవ్వలేని పిల్లలను తయారు చేస్తున్నాం. తన చదువుకు, జ్ఞాన సముపార్జనకు అన్ని విధాలా సహకరించిన గురువుగారి పేరునే తన ఇంటి పేరుగా మార్చుకున్న వ్యక్తి మన

రాజ్యాంగ రూపకర్త డాక్టర్.బి.ఆర్.అంబేద్కర్! అలాంటి ఉదాత్తమైన వ్యక్తులు మన భారతావనిలో ఎందరో ఉన్నారు. ఇంతటి ఘన చరిత్ర ఉన్న మన సమాజానికి మానవ సంబంధాలను దెబ్బతీసే వార్తలను పదేపదే చూపించడం వల్ల వారు ఇచ్చే సందేశం ఏమిటో??? 1930 ఏప్రిల్ 18న బీబీసీ ఛానల్ ఈరోజు వార్త ఏమీ లేదు అని చెప్పి వార్తలు వచ్చే సమయమంతా సంగీతం పెట్టిందిట. ఈ మధ్య ముఖ పుస్తకంలో చదివాను. మళ్లీ ఆ రోజులు వస్తాయా అనిపిస్తోంది. హత్య, ఆత్మహత్యలు క్షణికావేశాలే.. ఐదు నిమిషాలు ఆలోచిస్తే ఆ ఆలోచనని మానుకుంటారట; కానీ ఏడు నుంచి పది నిమిషాల నిడివి ఉండే చావుకి సంబంధించిన సెల్ఫీ వీడియోలు ఎలా తీస్తున్నారు? ఆ సెల్ఫీ వీడియో మా ఛానల్‌కి మాత్రమే ప్రత్యేకం అని తాజా... తాజా... చూస్తుంటే మనం ఎటు వెళ్తున్నామో కూడా తెలియని అగమ్యగోచర పరిస్థితి! 4G, 5G అని వేగానికి కొత్త కొత్త హంగులు... కానీ మన ఇంట్లో ఉండే మన ముందు తరం మాటేమిటి? మన చరవాణి ఎంత స్మార్ట్ అవుతుంటే మనం అంత హార్డ్ గా అవుతున్నాం. నవీన పోకడలకు నడుం వంచి మన బుర్ర ఎత్తలేని స్థితికి చేరుకున్నాం. కొంతకాలం పోతే నీకు చరవాణి ఉందా? లేక బాగున్నావా? అని అడుగుతారేమో!!!" అన్నారు.

"ఈ పరిస్థితిని మార్చడానికి అవుతుందా మాస్టారు?" నా ప్రశ్నకి మాస్టారు బాధగా నిట్టూర్చారు.

"మనిషి తలుచుకుంటే సాధ్యం కానిది ఏదీ లేదండి. విజ్ఞతతో ఆలోచించండి. దూరదర్శిని, చరవాణి, పత్రికలు పూర్తిగా హాని అని నేను అనడం లేదు. ప్రతిదాని లోనూ మంచి ఉంది. చెడు ఉంది. రాబోయే తరాలకి ఏమి ఇవ్వాలో మనకి మనమే నిర్ణయించుకోవాలి. మన నేటి సమాజానికి విదురుడు లాంటి విజ్ఞుడు అవసరం ఉంది. పాఠశాల స్థాయి నుంచే విదుర నీతి సరళంగా పసి మనసులకు హత్తుకునేలా చెప్పగలిగే స్థాయిలో మన పెంపకం, విద్యావిధానం ఉండాలి. భావ ప్రకటనా విధానాన్ని పూర్తిగా మార్చాలి. పండగలకి, వేడుకలకు పరిమితమైన మన సంప్రదాయాలు పిల్లలకి అలవాటుగా చేయాలి. రేపటి తరానికి మన ఆస్తిగా మన పురాణేతిహాసాలను అందించగలగాలి. ఇది ఒక రోజులో సాధ్యం కాదు, కానీ అలా మారిన రోజున కొన్ని తరాలకు జీవించడం నేర్పిస్తుంది. మన తరానికి మనః శాంతినిస్తుంది! గీతా, జరిగిన పరిస్థితుల దృష్ట్యా మేము ఇక్కడ వుండలేము. కాశీ వెళ్లి మా శేష జీవితాన్ని గడపాలని అనుకుంటున్నాము. నిన్ను చూడాలనిపించినప్పుడల్లా మేమే వచ్చి చూసి వెళ్తుంటాం. మేము ఇద్దరం ఒక నిర్ణయానికి వచ్చాము. మా ఆస్తిని నీ పేర వీలునామా రాస్తున్నాం. మేము కోరుకున్నట్లుగా కొత్త తరాన్ని తయారుచేయడానికి ఇవి ఉపయోగపడాలని మా ఉద్దేశ్యం. గురువుగా పిల్లలను తీర్చిదిద్దుతూ, గృహిణిగా, తల్లిగా, నీ కుటుంబానికి ఆలంబనగా మారి మన్ననలను పొందుతున్న నువ్వే దానికి అర్హురాలివి! మా కోరికను మన్నిస్తావా తల్లీ!" అన్న మాస్టారు మాట పూర్తి కాకుండానే వాళ్ళ పాదాలకు నమస్కరించి మీరు కోరుకున్న నవ తరం కోసం నా శాయశక్తులా ప్రయత్నిస్తాను మాస్టారు!" అంటూ వాళ్ళని దగ్గరికి తీసుకున్నాను.

***0***



# తిరిగి వచ్చిన వసంతం

కొమ్ముల వెంకట సూర్యనారాయణ

కమలమ్మ చాలా కాలంగా తను వండే కూరల్లోకి ఉప్పు కొనుక్కోవలసిన పనే ఉండటం లేదు. ఎందుకంటే తన కూరల్లోకి సరిపడేంతగా కష్టాల కన్నీళ్ళున్నాయి. ఈ కష్టాలకి ప్రస్తుతానికైతే విష్ణుమూర్తే కారణం. విష్ణుమూర్తి ఎవరో కాదు కమలమ్మకి భర్తే. అలనాడు పాల కడలిపై శేషపాన్పుపై పవళించిన శ్రీమహావిష్ణువు అయితే శరణాగతుల గురించి ఆలోచించేవాడు, కానీ ఈ విష్ణుమూర్తి మాత్రం మందు కడలిలో నిత్యం మునిగి తేలుతూ, తేలినప్పుడల్లా మరల మందుకి డబ్బులు వెతకడం గురించే ఆలోచిస్తుంటాడు. అలా మునకలో ఉన్న సందర్భంలో అతని నాలికపై మరి ఏ మందుమాత మందాక్షరాలు లిఖించిందో గానీ, ఈ మహానుభావుని నోటినుంచి బండ బూతుల ప్రవాహం వినిపిస్తుంది. పైగా ఆ మాటల ప్రవాహానికి శబ్ద సౌందర్యాన్ని జోడిస్తే, సూపర్ సానిక్ విమానం ఎగురుతున్నపుడు, దగ్గరగా ఉండి వింటే కలిగించే శబ్దంలా ఉంటుంది! దానితోపాటు రిక్టర్‌స్కేల్ పై 5.0 నమోదైన భూకంపం వచ్చినపుడు వస్తువులు కింద పడి చేసే శబ్దాలలాంటి శబ్దాలూ వినిపిస్తాయి. విష్ణుమూర్తి ఇంట్లో మందు మీదున్నంతసేపూ కమలమ్మ పరిస్థితి, పాత కాలంలో కిరసనాయిలు సీసాబుడ్డిలో ఒత్తి వేసి వెలిగించి చిరుగాలిలో పెట్టిన దీపంలా, ప్రస్తుత కాలంలో లో-వోల్టేజితో మిణుకు మిణుకు మంటూ వెలుగుతున్న జీరో వాట్ బల్బులా ఉంటుంది. పైగా ఆ మందులో ఉన్నంతసేపూ విష్ణుమూర్తి మాటల్లో ఎంత దిట్టంటే, కత్తికి రెండు వైపులా పదునున్నట్లు, "అతడు" లో బ్రహ్మానందంలా, కమలమ్మ ఎలా మాట్లాడినా తప్పేనంటూ తగిలిస్తూనే ఉంటాడు. పాపం ఏమాట కి ఆమాటే చెప్పుకోవాలి, మత్తు దిగి ఇహ లోకంలోకి వచ్చిన తరువాత అతని లోని అపరిచితుణ్ణి చూసి కమలమ్మే ఆశ్చర్య పోతుంటుంది. కమలమ్మేకాదు, అతని లోని జాలి, దయ, మెతకదనాన్ని చూసి వెన్నే తన మెత్తదనం ఒకింత తక్కువని సిగ్గుపడుతుంది. కానీ ఆ జాలి, దయ, మెతకదనంతో విష్ణుమూర్తి ఉండేది ఎంత సమయం అంటే, చేతులకు రాసుకున్న హేండ్ సానిటైజర్ ఆవిరయ్యేంత సమయం మాత్రమే! ఎందుకంటే మందు లేకుండా అంత కంటే ఎక్కువ సమయం ఉండలేడు కనుక.

***

కమలమ్మ స్వతహాగా చాలా ఓర్పు, సహనం గలదే. ఎంతగా అంటే సీతమ్మ తల్లి అంత. కమలమ్మకి భర్తగా విష్ణుమూర్తి దొరకడం, కుంతి తలుచుకున్నంతనే భర్తగా సూర్య భగవానుడు వచ్చినంత వేగంగా దొరకలేదు. కారణం విష్ణుమూర్తి అప్పుడు ఏదో కూలీనాలీ చేసుకుంటూ చాలా పద్ధతిగానే ఉండేవాడు. ఉన్నకాడికి ఏదో ఇచ్చి విష్ణుమూర్తిని అల్లుడుగా చేసుకున్నాడు కమల తండ్రి. కమలంటే విష్ణుమూర్తికి వల్లమాలిన ప్రేమే అప్పుడు. అందుకే కమలమ్మకి కొడుకు, కుంతికి కర్ణుడు పుట్టినంత వేగంగా పుట్టాడు! అలా అని అపార్థం చేసుకోవద్దు, ఎంత వేగంగా పుట్టాలో అంతే వేగంగా పుట్టాడు. అంటే సరిగ్గా పెళ్ళై తొమ్మిది నెలలు నిండేసరికే! అలా జీవితం ప్రశాంతంగా గడిచిపోతుంటే, విష్ణుమూర్తికి ఎలా అలవాటు అయ్యిందో మందు అలవాటు అయింది, అలా అని దానికి కారణం మాత్రం కమలమ్మ కానేకాదు. విష్ణుమూర్తికి ఈ మందు అలవాటు అయిన దగ్గర నుండి కమలమ్మ జీవితం అస్తవ్యస్తమైపోయింది. ఇటువంటి జీవితం కమలమ్మకి, మందు తాగడం విష్ణుమూర్తికి నిత్యకృత్యమై పోయాయి. ఏదో కాస్త ప్రశాంతత కమలమ్మకి ఉంటుందంటే అది రోజుకి రెండే సందర్భాల్లో, ఒకటి తన భర్త ఇహ లోకంలో విహరించే ఆ కాసేపు, రెండవది తన కొడుకు బడిలో కాకుండా ఇంటి దగ్గర గడిపే ఆ కాసేపు. విష్ణుమూర్తి పెట్టే టార్చర్ తో, కమలమ్మని దూరం నుంచి చూసే వాళ్ళకు ఎండిన మోడులా కనిపిస్తూ వంట చెరుకుకు ఉపయోగపడుతుంది అనుకుని, తీరా దగ్గరకొచ్చి చూస్తేనే కానీ జీవం ఉన్న కట్టె అని తెలియదు. అయినా కమలమ్మ ఇంకా ఎందుకు భూమి మీద ఉందంటే.. తన కొడుకుని చూసుకునే! ఎందుకంటే వాడు హిరణ్యకశిపుని కడుపున పుట్టిన ప్రహ్లాదుడు లాంటి వాడు కాబట్టి . అందుకే వాడికి ప్రహ్లాద్ అనే పేరే పెట్టింది. ఇది ప్రస్తుతానికి అయితే , కమలమ్మ గతం లోకి వెళితే.....

***

కమలమ్మ గతాన్ని ప్రస్తుతంతో పోలిస్తే షార్ట్ సర్క్యూట్ వల్ల అంటుకున్న మంటలను నీటితో ఆర్పడంతో పోల్చవచ్చు, అంటే కాస్తోకూస్తో ఇప్పటి పరిస్థితి కన్నా అప్పటి పరిస్థితే కొంత మెరుగని. అలాగని చెప్పి ఉత్తానపాదుడిని తన తొడ మీద పెట్టుకుని పెంచిన తండ్రిలాంటి తండ్రి కాదు కమల తండ్రి. అలాగే ధ్రువుడు ని దూరంగా నెట్టేసినంత దుర్మార్గుడూ కాదు. రోజు కాకుండా ఏ రోజైతే తన ఆటో రిక్షాలో జనాల బరువు ఎక్కువయ్యారో, ఆ రోజు ఆ ఋణాన్ని మందు దుకాణంలో తీర్చేసుకుని తేలికై వస్తాడు! ఆ రోజు మాత్రం ఇంట్లో పెళ్ళాం, కూతురు రాక్షసుల్లా కనిపించి వాళ్ళ మీద అప్పటికప్పుడు ఏర్పడిన పగను తీర్చుకుంటాడు. మిగతా రోజుల్లో మాత్రం ఒకో ఏరియాకు ఒక్కో నిర్దిష్ట సమయంలో మాత్రమే కరెంట్ ఎంత పద్ధతిగా తీస్తారో అంతే పద్ధతిగా వ్యవహరిస్తాడు. కమల తల్లి, కమల చిన్నప్పుడే అనారోగ్యానికి గురి

కావడంతో వంట పని, ఇంటిపనీ కమలదే. పెళ్ళయిన తర్వాత తీసుకోవలసిన బాధ్యతను కమల చిన్నప్పుడే తీసుకుంది.

***

కాలం నల్లేరు మీద నడకలా కాదు, ఏకంగా కరోనా వైరస్ ఎంత వేగంగా విస్తరించిందో అంతకన్నా వేగంగా కమలమ్మ, విష్ణుమూర్తి, ప్రహ్లాద్ విషయాలలో పరుగెట్టింది. దాని పర్యవసానమే ప్రహ్లాద్ పెరిగి పెద్దవాడయ్యాడు, స్వతహాగా తెలివైన వాడు కావడం, ఎప్పటికప్పుడు స్కాలరుషిప్పు రావడంతో బాగానే చదువుకుని మంచి ఉద్యోగాన్నే సంపాదించుకున్నాడు. ఉద్యోగం వచ్చిన తరువాత ఇంట్లో టీవి, ఫ్రిజ్, వాషింగ్ మెషీన్, స్మార్ట్ ఫోన్, మరీ అవసరమైతే తండ్రికి తెలియకుండా తల్లికి ఆర్ధికంగా సహాయం చేయడం లాంటి మార్పులొచ్చాయి. మినహా కమలమ్మ, విష్ణుమూర్తి దినచర్యలో ఏమీ మార్పులు రాలేదు. ఇప్పుడేదో తన బతుకు, భర్త తలరాత తిరగబడిపోతుందేమో అని భ్రమించిన కమలమ్మకి, ప్రహ్లాద్ చదువుతున్నపుడు ప్రేమించిన ప్రణీత, సైంధవుడిలా అడ్డుపడింది. ఆమెని పెళ్ళి చేసుకుని ఇంటికి తీసుకొచ్చాడు. ఇక్కడి పరిస్థితులు చూసిన ప్రణీత, తన భర్తని లేటెస్ట్ 139.7 సెంటీమీటర్ల ఎల్ ఇ డి స్మార్ట్ టీవి గా మార్చి, దానికి రిమోట్ తను అయ్యింది. ప్రహ్లాద్ దానిలో భాగంగా వేరే కాపురం పెట్టాడు. మా దగ్గరే ఉంటారు కొడుకు,కోడలు అనుకునే ఆశలే కాదు, కోడలు వేరే కాపురం పెట్టించి, వాళ్ళు కొడుకు దగ్గర ఉండే ఆశల మీద కూడా నీళ్ళు జల్లింది. అంతేకాదు, వరదకు తుఫాను తోడయినట్టు, ఒక ఐడియా ఇంక పూర్తిగా తమ నుంచి వాళ్ళని శాశ్వతంగా దూరంగా పెట్టేయవచ్చు అనే ఆలోచనతో ప్రణీత, విష్ణుమూర్తి మంచి మందులో ఉన్నప్పుడు వేసిన వేషాలన్నీ, ఆ సమయంలో కమలమ్మ సిగ్గుతో తనలో తనే కుంచించుకుపోతుండడాన్ని, చుట్టుపక్కల వాళ్ళు విష్ణుమూర్తిని చూసే అసహ్యపు చూపులను, తనూ, తన భర్త ఛీత్కార చూపులను 50.6 మెగాపిక్సెల్ లో రహస్యంగా చిత్రీకరింపచేయించి, ఆ వీడియోను పంపించింది విష్ణుమూర్తికి. ఆ ఐడియా ఒక జీవితాన్ని కాదు రెండు జీవితాలను పూర్తిగా మార్చివేసింది. అదెలాగంటే ఆ వీడియోను విష్ణుమూర్తి అదృష్టవశాత్తూ తను సంపూర్ణ స్పృహలో ఉన్నప్పుడు చూడటం తటస్థించింది. అతనిలో మనిషి మేల్కొన్నాడు, ముందే చెప్పినట్టు స్వతహాగా మంచి మనిషి, మానవత్వం ఉన్నవాడే కాకుండా తన వాళ్ళే తనని మందులో ఉండగా ఎలా చీదరించుకుంటున్నారో, ఎంత అసహ్యంగా చూస్తున్నారో, మందులో తన ప్రవర్తన ఎంత దారుణంగా ఉందో, అలాగే తన భార్య సిగ్గుతో కుంచించుకుపోతుండడాన్ని చూసి తట్టుకోలేక పోయాడు. తక్షణం మందు మానివేయాలని నిర్ణయించుకోవటమే కాక, ఆ మాటను నిలబెట్టుకుని కమలమ్మతో చెప్పాడు మందు మానివేస్తానని. ఇంతకన్నా మంచి అవకాశం దొరకదని, మందు మాన్పించే సెంటర్ లు ఏవో ఉంటాయంట కదా అందులో చేర్పించమని కొడుకుకు కబురు చేసింది కమలమ్మ. వెను

వెంటనే కొడుకు, తండ్రిని "డ్రగ్ ఎడిక్షన్ అండ్ రిహేబిలిటేషన్ సెంటర్" లో చేర్పించాడు. కొద్దికాలం లోనే విష్ణుమూర్తి మందు వ్యసనం నుంచి పూర్తిగా బయటపడ్డాడు. ఇప్పుడు కమలమ్మ, విష్ణుమూర్తిలకి పెళ్ళైన కొత్త రోజులలో జీవితం తిరిగొచ్చింది. అంతే కాదు వాళ్ళను తమ దగ్గరకు తెచ్చుకున్నారు ప్రణీత, ప్రహ్లాద్ దంపతులు. అదేంటి ప్రణీత శాశ్వతంగా తమ నుండి అత్తమామలను దూరం చేయటానికి కదా ప్లాన్ చేసింది అనుకుంటున్నారు కదూ, కానీ అసలు నిజమేమిటంటే ప్రహ్లాద్ ద్వారా తన అత్త స్వభావం, మందులో లేనప్పుడు మావగారి స్వభావం తెలుసుకుని స్వతహాగా సైకాలజిస్ట్ కావడంతో భర్త సహాయంతో ఈ నాటకానికి తెరలేపి తిరిగి వారి జీవితాలలో వసంతాన్ని రప్పించింది..

***0***

కథా మార్గం

# విశ్వ వర్ధనంబు విద్యాధనమ్మురా!



**పారుపూడి శేషా రత్నం**

ఇంటికెళ్లగానే తాతయ్య సుబ్బారావుగారిని చుట్టేసారు పిల్లలిద్దరూ.

'తాతయ్యా...అత్తా వాళ్ల టీచరు గారింటికి వెళ్లామా...అక్కడ పిల్లలు ఎంత బాగా వీణ వాయిస్తున్నారో తెలుసా?'

'ఓ...కళ్యాణి పేరుకి తగ్గట్టే కల్యాణీ స్వరూపమర్రా...ఎంత బాగా వీణ వాయిస్తుందనుకున్నారు...చూడ్డానికి రెండు కళ్లు చాలు.' అంది సుందరమ్మగారు.

'బామ్మా...అత్త ఆవిడ కాళ్లకి దణ్ణం పెట్టింది తెలుసా?'

'గురువు దయ ఉంటే పది కాలాలు చల్లగా ఉంటారురా చిన్నా... అసలు గురువంటే తల్లి...తండ్రి, దైవంతో సమానం. అందుకే మన భారతీయ సంస్కృతి గురు దేవోభవ...అంటే గురువును దైవంగా భావించమంది. పూర్వం మీ కంటే చిన్నవయసులో పిల్లల్ని గురువు దగ్గర వదిలేసేవారు. వాళ్లు కూడా గురువుగారికి సేవ చేస్తూ మెప్పించి విద్యలు నేర్చుకునేవారు.' అన్నారు సుబ్బారావుగారు.

' గురుకులాలే కదూ తాతయ్యా ...ఓ సారి మా డాడీ చెప్పారులే.'

'అవునురా చిన్నా... అసలు ఏ విద్య అయినా గురుముఖత: అభ్యసించాలి తెలుసా? అప్పుడే అందులోని లోతు అర్ధమవుతుంది.'

'మరి ఏకలవ్యుడు అనే వాడు గురువు దగ్గర నేర్చుకోకపోయినా అర్జునుడి కంటె ఎక్కువని చెప్పిందే బామ్మ మొన్ననోసారి.'

'అవునండీ...నేర్చుకోవాలన్న తపన ఉంటే ఏదీ అసాధ్యం కాదు అని వీళ్లకి ఏకలవ్యుడు కథ చెప్పాను' అంది సుందరమ్మగారు.

‘బంగారూ… ఏకలవ్యుడు  విలు విద్యలో ఘటికుడే కాని గురుముఖతా నేర్చుకోకపోవడం వల్ల అందులోని రహస్యాలు  కొన్ని తెలియక …కుక్క ముఖంమీద ఏడు బాణాలతో …గంధర్వాస్త్రాన్ని  ప్రయోగించి పాండవులతో సహా ద్రోణాచార్యుని  ఆశ్చర్యపరిచాడు. కాని గంధర్వాస్త్రాన్ని కుక్కమీద ప్రయోగించకూడదనే నియమముంది. అందుకే అతడు శిక్షింపబడ్డాడని పెద్దలు చెబుతుంటారు. అదీగాక గురువు దగ్గర ఏది నేర్చుకున్నా  అందులోని అంతరార్ధాన్ని కూడా తీసుకోవాలి.’

‘అయితే గురువుకు సంబంధించిన ఓ మంచి కథ చెప్పు తాతయ్యా!’ పిల్లలిద్దరూ తాతయ్య దగ్గరకి చేరిపోయారు.

‘సరే మీరు చదువుకుంటున్న పిల్లలు  కనుక గురుశిష్యుల  కథే చెప్తాను వినండి’ అంటూ వాళ్ల సందేహాల మధ్య కథని కొనసాగించారు సుబ్బారావుగారు.

‘పవిత్ర గంగా నదీతీరంలో నిత్యానంద స్వామి అనే గురువుగారు ఒక గురుకులాన్ని నడుపుతూ ఉండేవారు. పూర్వకాలంలో ఇప్పటి లాగా వీధి వీధికీ స్కూళ్లు ఉండేవి కాదర్రా … చదువుకోవాలనుకుంటే ఎంతో దూరంలో ఉండే గురువుగారి ఇంట్లోనే చదువు అయిపోయేదాకా ఉండిపోవాల్సి వచ్చేది.  గురువుగారికి సేవ  చేస్తూ ఆయనను ప్రసన్నం చేసుకుని విద్య నేర్చుకునేవారు.  మళ్లీ చదువు అయిపోయాకే ఇంటికి రావడం. అర్ధమయిందా?’

‘మరి అమ్మా నాన్న మీద బెంగ ఉండేది కాదా?’ కమల్ జాలిగా అడిగాడు.

సుబ్బారావుగారికి నవ్వొచ్చింది. ‘అప్పట్లో గురువు కూడా ఎంతో సజ్జను చిన్నా… విద్యాభ్యాసానికి వచ్చే పిల్లల్ని  ఎంతో ప్రేమగా చూసుకునేవారు. మన కథలో నిత్యానంద స్వామి కూడా  తన పదిమంది శిష్యులనూ  కన్నబిడ్డల్లా చూసుకునేవారు. వారు కూడా  గురువుగారికి సేవ  చేస్తూ ఎంతో శ్రద్ధగా విద్యను నేర్చుకుంటూ  ఉండేవారు.  అయితే ఎవరికివారు తమకే ఎక్కువ గురుభక్తి ఉందని పోట్లాడుకుంటూ ఉండేవారు.’

‘అంటే పోట్లాటలు  అప్పుడూ ఉండేవన్నమాట’ తల  పంకించాడు కమల్.

‘స్నేహం, అసూయ, ద్వేషం ఇవన్నీ మానవ లక్షణాలే కదా …ఏ కాలంలో అయినా అవి తప్పలేదర్రా…’

'సరే కథలోకి వస్తే...కొన్నాళ్లకు శిష్యులందరికీ దాదాపు విద్యాభ్యాసమంతా పూర్తయి మరి కొద్ది రోజుల్లో వారంతా గురుకులాన్ని వదలి తమ తమ ఇళ్లకు వెళ్లవలసి వుంది' సుందరమ్మగారు కూడా కథని సాయం పట్టడం ప్రారంభించింది.

'మరి వాళ్లకి పరీక్షలు లేవా బామ్మా?'

'ఎందుకు లేవు ... ఆ పరీక్షలన్నీ గురువు గారే పెట్టేవారు. వాటిలో కృతార్థులయ్యాకే వాళ్లను ఇళ్లకు వెళ్లేందుకు అనుమతి ఇచ్చేవారు. సరే మన నిత్యానందులవారికి శిష్యులు గురుభక్తి లోని నిజాయితీని పరీక్షించాలనిపించింది. ఎందుకంటే శిష్యులలోని ప్రతి ఒక్కడూ ఆయన పట్ల ఎంతో భక్తి ప్రదర్శించేవారు. అందుకని వారి నిజాయితీకి ఒక పరీక్ష పెట్టాలనుకున్నారాయన. ఒకనాటి రాత్రి, నిత్యానందులవారు శిష్యులందరికీ బోధిస్తూ ఉన్నట్టుండి క్రింద పడి గిల గిలా కొట్టుకోసాగారు. అది చూసి శిష్యులంతా కన్నీరు పెట్టుకుని ఏడవడం మొదలుపెట్టారు.'

'అయ్యయ్యో... గురువుగారికి జబ్బు చేసిందన్నమాట' ప్రియాంక విలవిల్లాడింది.

'అవును. అప్పుడు నిత్యానంద స్వామి ఆయాసపడుతూ "నాయనలారా! నాకు అవసాన దశ సమీపించింది. ఈ జబ్బు వచ్చినవారు బ్రతకడం అంటూ ఉండదు. ఈ జబ్బుకు మందు లేదు. అయితే నిజానికి నా బాధ అదికాదు!" ఆ పైన నోట మాట రాక ఆయన గుడ్లు అప్పగించి చూస్తూ ఉండిపోయారు. ఆయన పరిస్థితిని చూసి శిష్యులంతా అన్నారు కదా! "గురువర్యా! మీ చివరి కోరిక ఏమిటో సెలవియ్యండి. దానిని తీర్చేందుకు మేము శాయశక్తులా ప్రయత్నిస్తాము." కొంతసేపటికి నిత్యానంద స్వామి అతి కష్టంమీద నోరు తెరచి "మీకు నేనింకా అతి ముఖ్యమైన ఒక విద్య నేర్పవలసి ఉంది. ఆ విద్య నేర్చుకున్నవాడు జీవితమంతా సకల సంపదలతో మహారాజు లాగా జీవించగులుగుతాడు. ఒకవేళ మహారాజే అయిపోయినా ఆశ్చర్యపోనవసరం లేదు. కాని అది నేర్పితే నాకు ఉత్తర గతులుండవు. మోక్షం లభించదు. మళ్లీ నేను ఏ జంతువుగానో పుట్టవలసి వస్తుంది. అయినా మీ పట్ల గల వాత్సల్యంతో ఒక్కరికి మాత్రమే ... అదికూడా ... మీలో నిజమైన గురుభక్తి గల వాడికి నేర్పాలనుకుంటున్నాను' అన్నారు.'

'అయితే అంతా పోటీపడి ఉంటారు అవునా?' కమల్ శ్రద్ధగా వింటున్నాడు కథని.

'అవును ... అయితే గురువుగారు అలా నేర్పాలంటే ఒక షరతు పెట్టారు. 'శిష్యులారా ... ఇక్కడకు దక్షిణాన ఐదు మైళ్ల దూరంలో ఒక ఊడల మర్రి ఉంది. ఆ చెట్టుకు ఒక ఉట్టి వేలాడుతూ ఉంటుంది. ఆ ఉట్టిలో ఒక తాళపత్ర గ్రంథం ఉంది. నేను కొన్ని గంటల్లోనే మరణిస్తాను. నేను కన్నుమూసేలోగా దానిని

తెగలిగిన ఒక్కరికి మాత్రం ఆ విద్య నేర్పించగలను' అన్నారు. 'ఆయన మాటలు పూర్తి అయ్యాయో లేదో ఒక్క ఉత్తరుడు అనేవాడు తప్ప తక్కిన తొమ్మిదిమంది శిష్యులు ఎంతో వేగంగా ఆ గ్రంథం తేవడానికి పోటీపడుతూ చీకట్లో వేగంగా పరుగులు తీసారు.'

'ఉత్తరుడు ఎందుకు వెళ్లలేదు?' ప్రియాంకకి సందేహమొచ్చింది.

'నీలాగే గురువుకీ సందేహమొచ్చిందిరా బంగారూ!' ఉత్తరుడు కన్నీరు పెట్టుకుంటూ తనకు పరిచర్యలు చేస్తూ ఉండిపోవడం చూసి నిత్యానందులవారు బాధపడుతూ అడిగారు. "ఏం ఉత్తరా! నువ్వు వెళ్లలేదేం? నీకు ఆ మహత్తర విద్య నేర్చుకోవాలని లేదా? లేక చీకటిగా ఉంది అని భయపడి ఉండిపోయావా?' ఉత్తరుడు ఉత్తరీయంతో ఆయన ముఖానికి పట్టిన చెమటను తుడుస్తూ "గురువర్యా! ఆ విద్య ఎంత మహత్తరమైనదైనా, అది నేర్పితే మీకు అరిష్టం కలుగుతుంది. జంతువు జన్మ వస్తుంది అన్నారు కదా! మీకు పాపం చేకూర్చే విద్య ఎంత భాగ్యానిచ్చేదయినా నాకు అవసరం లేదు. అదీగాక చావు బ్రతుకుల మధ్య ఊగిసలాడుతున్న మీకు పరిచర్యలు చేయకుండా మిమ్మల్ని దిక్కులేని వారిలా వదలి వెళ్లిపోవడం నాకు భావ్యంగా అనిపించలేదు. ఇన్నాళ్లూ మమ్మల్ని కన్న తండ్రిలా చూసుకున్న మీకు చివరి క్షణాల్లో సేవ చేయడం కన్న బిడ్డలాంటి ఈ శిష్యుడి బాధ్యతగా భావిస్తున్నాను. అందుకే మీ చివరి క్షణం వరకు మీకు ఉపశమనం కలిగించే పరిచర్యలు చేసుకుంటాను. అదే నా నిర్ణయం."

'ఎంత బాగా చెప్పాడో కదా తాతయ్యా ... నిజమైన గురుభక్తి అంటే అదే కదా!' కమల్ చప్పట్లు కొట్టాడు.

'అవునురా చిన్నా .. నిత్యానంద స్వామి వెంటనే లేచి ఉత్తరుడిని కౌగలించుకుని ఆనంద బాష్పాలు రాల్చారు. 'ఉత్తరా! నీ గురుభక్తిలో నిజాయితీ ఉంది. నువ్వే ఉత్తముడవైన శిష్యుడవు. నీకే ఆ విద్య నేర్పుతాను. మరణ వేదన పడుతున్న నన్ను మానవత్వం కూడా లేకుండా వదలి సంపదలందించే విద్య కోసం వెళ్లిపోయిన ఆ స్వార్థపరులకు ఆ విద్య తెలియడం కూడా మంచిది కాదు' అంటూ అతడికి ఆ విద్యను ఉపదేశించసాగాడు' బామ్మగారు అందుకుంది కథ.

'మరి మిగతా శిష్యులేమయ్యారు బామ్మా?'

'ఇంతలో తెల్లవారింది. తొమ్మిదిమంది శిష్యులలో మైత్రేయుడనేవాడు మాత్రం తాళపత్ర గ్రంథంతో ముందుగా గురుకులానికి తిరిగి వచ్చాడు. అతని శరీరం నిండా గాయాలు. "ఏమైంది మైత్రేయా? ఆ గాయాలు ఏమిటి? తక్కినవారు ఏమయ్యారు?' అన్నారు నిత్యానందుల వారు. అంతలో రొప్పుతూ తక్కిన

శిష్యులు కూడా అక్కడకు వచ్చారు. వారి శరీరం మీదా గాయాలున్నాయి. వాళ్లంతా తమ దెబ్బను గురువుగారికి చూపిస్తూ, 'గురువుగారూ! మైత్రేయుడు మమ్మల్ని అందరినీ చావగొట్టి ఆ గ్రంథం లాక్కుని ముందుగా మీ దగ్గరకి వచ్చాడు. కానీ నిజానికి అది మాకు…" అని ఆగిపోయారు. కమల్ ప్రియాంక ఆశ్చర్యంగా వింటున్నారు.

'మైత్రేయుడు తోటి శిష్యులమీద మండిపడి "మీరు మాత్రం ఈ గ్రంథం దక్కించుకోవాలని నన్ను కొట్టలేదా?" అని పోట్లాటకు దిగాడు. నిత్యానందులవారు "మంచిది. ఇంతకీ మీరంతా కలహించుకుని, ఒకరినొకరు హింసించుకుని, సంపాదించిన ఆ తాళపత్ర గ్రంథంలో ఏమని వ్రాసి ఉందో ఎవరైనా చదివారా?" అంటూ తాళపత్ర గ్రంథం విప్పి వారి ముందు పరిచారు. అందులోని ప్రతి పత్రం మీద "గురుబ్రహ్మ గుర్విష్ణుః గురు దేవో మహేశ్వరః గురుస్సాక్షాత్ పరబ్రహ్మ: …." అంటూ ఒకే శ్లోకం వ్రాయబడి ఉండడం చూసి అందరూ తెల్లబోయారు.

'అంటే గురువుగారు వాళ్ల గురు భక్తికి పెట్టిన పరీక్ష అన్నమాట అది' కమల్ మురిసిపోయాడు.

'అవును. ఆయనేమన్నారంటే …"ఇప్పటికైనా తెలుసుకోండి. ఏపని చేసినా అందులో నిజాయితీ ముఖ్యం. చివరికి గురు శుశ్రూష అయినా సరే…అసలు దానికి మించిన విద్య లేదు. ఈ నిజాన్ని తెలుసుకున్న ఈ ఉత్తరుడే అందరిలోకి ఉత్తముడని నిర్ణయించి అతడికి ఈ విద్యను బోధించాను. దానితో నా హృదయం తేలికపడింది. మీ గురుభక్తి లోని నిజాయితీని కనుగొనేందుకే నేను ఈ వ్యాధి నాటకం ఆడవలసి వచ్చింది. అంతే!" అనేసరికి గురువుగారి మాటలకు మిగతా శిష్యులంతా సిగ్గుతో తల వంచుకున్నారు. ఆ పైన క్షమించమని గురువుగారి కాళ్లు పట్టుకున్నారు.' పిల్లలిద్దరూ అంతవరకు ఊపిరి బిగబట్టి వింటున్న వాళ్లల్లా తేలికగా నిట్టూర్చారు.

'హమ్మయ్య…అయితే గురువుగారికి నిజంగా ఏ జబ్బూ లేదన్నమాట …'

'అవును! అదంతా గురువుగారి పరీక్ష. అర్థమయిందిగా … ఆయన అన్నట్టు మనం చేసే ఏ పనిలో అయినా సరే … అంటే చదువులో…ఆటల్లో…ఉద్యోగంలో…చేసే ప్రతి పనిలో నిజాయితీ అనేది ఎంత ముఖ్యమో తెలిసిందిగా. చదువుతో బాటు లోకాన్ని చూసి లోకజ్ఞానం పెంచుకోవాలి. గురువు చెప్పింది సవ్యంగా అర్థం చేసుకోవాలి.'

'ఇంకో విషయం చెప్పనా … గురుకులాల్లో విద్య నేర్చుకున్న తర్వాత కృతజ్ఞతగా గురుదక్షిణ కూడా సమర్పించేవారు శిష్యులు.'

‘మరి గురువుగారి బొమ్మ పెట్టుకుని నేర్చుకున్న ఏకలవ్యుడిని బొటన వేలు అడిగాడు కదా తాతయ్యా ద్రోణుడు’.

‘అవున్నాయనా … దానికి ‘విలు విద్యలో నిన్ను మించిన మరే వీరుడినీ నేను తయారుచెయ్యను’ అని అతను అర్జునునికిచ్చిన మాట కారణమయింది. అంతెందుకు? తన స్వంత కొడుకయిన అశ్వత్థామ కంటె కూడా శిష్యుడయిన అర్జునుడంటేనే ద్రోణుడికి ప్రీతి. అదీగాక అర్హతను బట్టి కూడా విద్యలు నేర్పేవారు గురువు. అందుకే కొడుక్కి కూడా నేర్పకుండా బ్రహ్మశిరోనామాస్త్రాన్ని అర్జునుడికి నేర్పించాడు ద్రోణాచార్యులవారు.’

‘ఎందుకు తాతయ్యా?’

‘అశ్వత్థామకి కోపం వల్ల విచక్షణా జ్ఞానం నశిస్తుందనే సంగతి తండ్రి అయిన అతని కంటె ఎవరికి తెలుస్తుంది చెప్పు. అదీగాక అర్జునుడు కూడా గురువుగారికి అందరికీ మించిన గురు దక్షిణ ఇచ్చాడు తెలుసా?’

‘ఏమిటది తాతయ్యా?’

‘భారతంలో ద్రౌపది పేరు విన్నారు కదా … ఆ ద్రౌపది తండ్రి ద్రుపదుడు … ద్రోణుడు చిన్నప్పుడు ఒకే గురువు శిష్యులు. పెద్దయ్యాక రాజయిన ద్రుపదుడి వద్దకు పేదరికంతో బాధపడుతున్న ద్రోణుడు వెళ్లి తన పిల్లవాడి కోసం ఒక గోవును దానమియ్యమని అడిగితే అతడు తీవ్రంగా అవమానించాడు. మన అర్జునుడు గురువుగారి మనసులోని అవమానాన్ని అర్ధం చేసుకుని … ఏం చేసాడో తెలుసా? ఆ ద్రుపదుడి మీదకెళ్లి ఓడించి గొలుసుతో కట్టేసి … ద్రోణుడికి కానుకగా సమర్పించాడు. తర్వాత ద్రోణుడు అతన్ని క్షమించి వదిలేసాడనుకోండి. అంతెందుకు బంగారూ … మన మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్‌గారు ఒకప్పుడు టీచరుగా పనిచేసినవారే … మద్రాసు విశ్వ విద్యాలయంలో ప్రొఫెసరుగా కూడా పనిచేసిన ఆయనంటే అక్కడి విద్యార్థులకు ఎంత అభిమానమంటే … ఓ సందర్భంలో ఆయనెక్కిన గుర్రపు బగ్గీకున్న గుర్రాలను తప్పించేసి, విద్యార్థులే ఆ బగ్గీని లాక్కుంటూ వెళ్లారట. అంతటి గౌరవం లభించింది ఆయనకు … తెలుసా? అంత గొప్పది మన గురు సంప్రదాయం’ సుందరమ్మగారు ముగించింది.

‘ఇప్పుడవన్నీ ఏమయ్యాయి తాతయ్యా?’

‘ఇంకా ఇలాంటి చిన్న ఊళ్లల్లోనూ, పల్లె జీవితంలోను మిగిలే ఉన్నాయమ్మా. మనం ఆశ్వీయుజ మాసంలో చేసుకునే దసరా పండగల్లో ఇక్కడ ఏం చేస్తారనుకున్నావు? దసరా సమయంలో టీచర్లు బాణాలు

పట్టుకున్న పిల్లను వెంట వేసుకుని ప్రతి ఇంటికి వస్తారు. అయ్యవారికి చాలు అయిదు వరహాలు... పిల్ల వాళ్లకు చాలు పప్పు బెల్లాలు...విచ్చు రూపాయయితే పుచ్చుకుంటాము... దసరాకు వస్తిమని విసవిసలు పడక చేతిలో లేదనక అప్పివ్వరనక... అంటూ పాడుతోంటే ఎంత ముచ్చటగా ఉంటుందో? మీనాన్నా, బాబాయి, అత్త....ఊళ్లో పిల్లలు ... మా చిన్నప్పుడు మేమూ... కూడా అలా బాణాలు పట్టుకుని తిరిగిన వాళ్లమే...ఎంత సరదాగా ఉంటుందో దసరా వస్తే...ఈసారి మీరు దసరా సెలవుకి ఇక్కడికి వస్తే చూద్దురుగాని.'

'ఏవండోయ్...మనవలకి కబుర్లతోనే కడుపు నింపేస్తారా భోజనం చెయ్యనివ్వరా' ముసిముసినవ్వు నవ్వింది సుందరమ్మ.

'ఉరుమురిమి మంగలం మీద పడిందని...నువ్వు కథలు చెబుతూ కాలక్షేపం చేసి నన్నంటావేమిటి? ఏమర్రా...కడుపులో ఎలకలు పరుగెడుతున్నాయా? లేదా?'

'అబ్బే...నిజంగానే కబుర్లతో కడుపు నిండిపోయింది తాతయ్యా!'

'నీ మనమలు నీ మీద ఈగని కూడ వాలనియ్యరు సుమా?'

'ఈ శుభ సమయంలో ఓ మంచి పద్యమందుకో తాతయ్యా' కమల్ అడిగాడు. సుబ్బారావుగారికి ఎక్కడలేని హుషారు వచ్చేసి రాగయుక్తంగా పద్యమందుకున్నారు.

'దొరలు దోచలేరు, దొంగలెత్తుకపోరు,

భ్రాతృ జనము వచ్చి పంచుకోరు

విశ్వ వర్ధనంబు విద్యాధనమ్మురా

లలిత సుగుణజాల! తెలుగుబాల!

ఆయన పద్యం వింటూంటే సుందరమ్మగారికి నాటకం విషయం గుర్తొచ్చింది.

'అన్నట్టు ఇవాళ మనం భోజనాలు చేసాక గుడి దగ్గరకి వెళ్దాం. అమలాపురం గోరక్షణ నాటక సమాజం వారు నాటకం వేస్తున్నారు.'

'అవునర్రోయ్ మీ బామ్మ చెప్పే దాకా నేనూ మర్చేపోయాను సుమీ! గురుభక్తి, సేవానిరతి, దృఢ సంకల్పం గల వారికి గోసేవ ద్వారా బ్రహ్మజ్ఞానం ప్రాప్తిస్తుంది అని చెప్పే సామవేదాంతమైన ఛాందోగ్యోపనిషత్ లోని సత్యకాముని కథ నాటకంలా వేస్తున్నారు..'

'అయితే బామ్మా తొందరగా తినేద్దాం. పెట్టెయ్' పిల్లలిద్దరి ఉత్సాహం చూసి పొంగిపోయింది సుందరమ్మ.

'లేడికి లేచిందే పరుగన్నట్టు, ఇందాకేమో కబుర్లతోనే కడుపు నిండిపోయిందన్నారు. ఇప్పుడేమో పెట్టెయ్ తినేద్దాం అంటున్నారు.'

'నువ్వే చెప్పావుగా బామ్మా నాటకం చూద్దామని...'

మర్నాడు ఉదయమే పోటీ పడుతూ తల్లికి ఫోన్ చేసారు కమల్, ప్రియాంక.

'అమ్మా! విహారయాత్ర బదులు ఈ శలవుల్లో తాతా బామ్మ దగ్గరకి రావడం ఎంత మంచిదయిందో! ఇపుడు అన్నయ్య నన్నసలు కొట్టడమే లేదు' సంతోషంతో అంది ప్రియాంక.

'ఇకమీదట సెలవుంటే మన పల్లెటూరికి రావడమే. మాతో బాటు నువ్వూ రావాలి. నీకు ఎంత జ్ఞానమొస్తుందో తెలుసా అమ్మా?'

కొడుకు కమల్ మాటకు డిల్లీ లో ఫోన్ దగ్గర నిలుచుండిపోయిన మందాకిని మనసులోనే దీర్ఘంగా నిట్టూర్చింది.

తల్లితో మనవడంటున్న మాటను వింటున్న సుందరమ్మ, సుబ్బారావుగారు పొంగిపోయారు.

'వీళ్లు వచ్చిన దగ్గర నుంచీ వాళ్లకిష్టమైనవి చేసిపెట్టడం, పల్లె అంతా తిప్పి, అన్నీ వివరించడం అసలు సమయమే తెలియడం లేదు. ఇకమీదట ఒంటరితనం బాధించదు. సెలవుల్లో మనమలుంటారు. మళ్లీ సెలవులు వచ్చేదాకా వాళ్ల మధుర స్మృతులు తోడుగా ఉంటాయి.'

∗∗∗0∗∗∗



# కొత్త దారి

## పక్కి శివ ప్రసాద రావు

"మమ్మీ! క్యాంపస్ సెలక్షన్ వచ్చింది" సెల్ ఫోన్లో సాయి గొంతు వినగానే ఎంతో చెప్పలేనంత ఆనందంతో పొంగిపోతూ, "ఎంతరా ప్యాకేజి?" ఆత్రంగా అడిగింది సుధామయి.

"మూడు లక్షల అరవై వేలు!" చెప్పాడు సాయి.

“అంటే నెలకు ముప్పయి వేలు అంతేనా?" నీరసంగా పలికింది సుధామయి గొంతు.

"అందరికీ అంతే మమ్మీ ... రెండేళ్లలో మరో కంపెనీ మారితే, ఇంకా ఎక్కువ వస్తుందిలే"

"అది కాదురా ... భావేశ్ కి పది లక్షలట కదా..."

"సరే మమ్మీ...." సెల్ ఫోన్ కట్ చేసాడు సాయి.

సుధామయి మళ్లీ వెంటనే రింగ్ చేసింది.

"ఎప్పుడొస్తున్నావ్ రా?" అడిగింది.

సాయి చెన్నైలో బీ టెక్ చదువుతున్నాడు.

"రేపు బయలుదేరుతున్నాను!" చెప్పాడు.

"ఏ ట్రైన్ కి?"

"ఇంకా తెలీదు మమ్మీ... నేను ముందు వైజాగ్ వెళ్లి, తరువాత హైదరాబాద్ వస్తాను"

"వైజాగ్ ఎందుకురా...?" గాభరాగా, సీరియస్ గా అడిగింది.

"ఎందుకేమిటి? తాతగారికి, నానమ్మకి చెప్పాలి!"

"ఏం అక్కరలేదు.... ఫోన్లో చెబితే చాలు!" కోపంగా అంది సుధామయి.

"స్వయంగా చెప్పాలి... నేను వెళ్తున్నాను!" అంటూ ఫోన్ కట్ చేసాడు.

పెదవి కొరుక్కుంది సుధామయి. ఓ పది నిముషాల తరువాత ఆలోచనల నుండి తేరుకుని భర్త భానోజీకి ఫోన్ చేసింది.

"సాయి కి క్యాంపస్ వచ్చిందండీ!"

"ఏ కంపెనీ...?" అడిగాడు భానోజీ.

"అవేమీ చెప్పలేదండీ... కనీసం క్యాంపస్ వచ్చింది అని అయినా చెప్పాడు. ఇప్పుడు వైజాగ్ వెళ్తున్నాడు.. తాతకి చెప్పడానికి.... !" చివరి మాటల్లోని వెటకారం గమనించి భార్య సోది మరి వినలేనట్లు,

"సరే...నేను కొంచెం బిజీగా వున్నాను!" అన్నాడు.

"ఎప్పుడు ఉండదు మీకు బిజీ... ఈ రోజైన తొందరగా రండి.. గుడికి వెళదాం!"

"సరే..." ఫోన్ పెట్టేసాడు.

ఇంట్లో అటూ, ఇటూ కాలు కాలిన పిల్లిలా తిరిగింది. కొడుక్కి క్యాంపస్ వచ్చిందనే ఆనందం కన్నా, వాడు తాత దగ్గరకు వెళ్లడమే ఎంతో చేదుగా తోచింది! ఎన్ని ఆశలు పెట్టుకుంది కొడుకు మీద... వాడు పుట్టగానే అత్తా, మామలతో ఇక కలిసి ఉండకూడదని నిర్ణయించుకుని, వైజాగ్ నుండి హైదరాబాద్ ట్రాన్స్ఫర్ అయ్యేవరకు భర్తను నిద్ర పోనివ్వలేదు.

ఇక వైజాగ్ విడిచిపెట్టేసాక ... నెమ్మదిగా అత్తా, మామల రాకపోకలను అంచెలంచెలుగా నిషేధించింది! కొడుకు చదువు పాడవుతుందనీ, పరీక్షలనీ అలా అలా వాళ్ళను రాకుండా చేసింది. పదవ తరగతి వరకు ఖరీదైన కాన్వెంట్ లో చదివించినా, అంతో, ఇంతో మంచి మార్కులు వచ్చినా... ఇంటర్ లో ఐ. ఐ. టి, ఎంసెట్ కోచింగులూ ఆశించినంత మంచి ఫలితాన్ని ఇవ్వక పోవడంతో, ఆఖరుకు డొనేషన్ కట్టి మద్రాస్ లో జాయిన్ చేశారు. బీ టెక్ కి సంవత్సరానికి ఐదు లక్షలంటే మాటలు కాదు. మనవడి చదువుకు ఎటువంటి సాయం చేయలేని ఆ ముసలాళ్ల దగ్గరకు సాయి వెళ్లడం సుధామయికి అసలేం నచ్చలేదు! కొడుక్కి మళ్ళీ ఫోన్ చేసింది.

"సాయీ... డాడీ నీ కోసం ఎదురు చూస్తున్నారు. ముందు నువ్వు ఇక్కడికి వచ్చేసెయ్"

"నేను వైజాగ్ ట్రైన్ లో వున్నాను ... మూడు రోజుల తరువాత వస్తాను!" చెప్పాడు.

కొడుకు సమాధానానికి సుధామయి మొహం వాడిపోయింది. నాలుగేళ్ళ ప్రాయం నుండి తన కొడుకుని ఆ ముసలాళ్ళకి దూరంగా ఉంచినా, వాడికి మాత్రం ఎందుకంత అభిమానమో? అర్థం కాదు! ఒక్కసారి ఆమెకు దుఖం ముంచు కొచ్చింది.

***

భానోజీ అతని తల్లి తండ్రులకు ఒక్కడే కొడుకు. సత్యనారాయణ ఎలిమెంటరీ స్కూల్ టీచర్. భానోజీని బాగానే చదివించారు. డిగ్రీ అయ్యాక బ్యాంకులో ఉద్యోగం వచ్చింది. ఆ రోజుల్లో బ్యాంక్ ఉద్యోగమంటే మంచి గ్లామర్. భానోజీకి పెళ్లి సంబంధాలు బాగా రాసాగాయి. సత్యనారాయణ పెద్దగా కట్న, కానుకలను ఆశించకుండా

మంచి సంప్రదాయం ఉంటే చాలు అని, వచ్చిన సంబంధాలలో అమ్మాయి రూపం, నెమ్మదితనం చూసి సుధామయిని కోడలిగా ఎంచుకున్నారు.

సత్యనారాయణకు మద్దిలపాలెంలో సొంత ఇల్లు ఉంది. కొడుకూ, కోడలితో హాయిగానే ఉండేవాళ్ళు. సుధామయి డెలివరీకి కన్నవారింటికి వెళ్లి, కొడుకు పుట్టాక అత్తవారింటికి వచ్చాక ఆమె అసలు గుణం బైటపడింది. చక్కని రూపం వెనుక సంకుచితమైన ఆమె మనసు, బైటకి కనబడే నెమ్మదితనం మాటున దాగిన స్వార్థం తెలిసాక.. శాంతమ్మ, సత్యనారాయణ కుమిలిపోయారు.

ఇంట్లో ప్రతీ చిన్న విషయానికి జరిగే రాద్ధాంతం కన్నా, అటూ, ఇటూ చెప్పలేక నలిగి పోతున్న కొడుకుని చూసాక.. సత్యనారాయణ కాస్తంత దూరదృష్టితో ఆలోచించి, కొడుకు హైదరాబాద్ బదిలీ విషయాన్ని తానే బలపరిచాడు. కొడుకుని వదిలి ఉండలేని శాంతమ్మ కూడా భర్త ఆలోచనని కాదనలేక పోయింది!

భానోజీ హైదరాబాద్ వెళ్లిపోయాక కొడుకుని, మనవడిని చూడాలని ఆరు మాసాలకోసారైనా వెళ్ళేవాళ్ళు. కొడుకుకి, మనవడికి ఇష్టమని శాంతమ్మ కష్టపడి ఇంట్లో జంతికలు, సున్నుండలు లాంటి ఎన్నో రకాలు చేసి తీసుకువెళ్ళేది. కోడలి ఇంటిలో గెస్టులా ఉండకుండా తనకు తోచిన సాయం చేసేది. ఓ నాలుగు రోజులు గడిచాక సుదామయి ఇక భరించలేకపోయేది. పిల్లాడి చదువు సరిగ్గా సాగడం లేదని, ఖర్చులు పెరిగాయనీ, గొణుగుతూ ఉండేది.

అప్పటికీ సత్యనారాయణ సాయంకాలం బైటికి వెళ్లేటప్పుడు 'ఏం కావాలో' అడిగి మరీ తెచ్చేవాడు. భానోజీ మాత్రం అభిమానంగానే ఉండేవాడు. సెలవురోజు తల్లితండ్రులకు మంచి ప్రదేశానికో, గుడికో తీసుకు వెళ్ళేవాడు. కానీ, భానోజీ బాంక్ కి వెళ్ళాక సుధామయి నరకం చూపించేది. చదువు సాగలేదనే వంక పెట్టి తాత, నాన్నమ్మల దగ్గర వుండే సాయిని చితకబాది, తన గదిలోకి తీసుకుపోయి తలుపులు మూసేది. డైనింగ్ టేబుల్ మీద భోజనానికి అన్నీ విసురుగా పడేసి "పీకలదాకా తినండి" అని అరిచేది.

అప్పటికీ "ఏంటమ్మా సుధా... మా రాక నీకు ఏమైనా ఇబ్బందిగా వుంటోందా?" అని అడిగిన మామగారికి "ఇంతమంది పోషణ మా వల్ల కాదు!" అంది.

"అదేంటమ్మా...అలాగంటావ్, ఎప్పుడో ఆరు మాసాలకోసారి ఒక్కగానొక్క కొడుకు ఇంటికి వచ్చి, వారం రోజులు వుండే భాగ్యం కూడా మాకు లేదా?" అని శాంతమ్మ కళ్ళ నీళ్లతో అడిగితే ,

"మా బ్రతుకు మమ్మల్ని ఎందుకు బతకనివ్వరు?" అంటూ అరిచేది.

రాత్రి పూట భోజనానికి తనకూ, భర్తకూ వేరుగా వేడి వేడిగా వండుకుని, మధ్యాన్నం మిగిలిన అన్నం, ఫ్రిడ్జ్ లోని కూరలు మామగారికి వడ్డించేది.

"మీ మామగారికి చల్లటి పదార్థాలు పడదమ్మా... కావాలంటే నాకు పెట్టు!" అని శాంతమ్మ అన్నందుకు పెద్ద రాద్ధాంతం చేసింది.

వారం, పది రోజులు వుందామనుకున్న వాళ్ళు.. నాలుగు రోజులకే తిరుగు ముఖం పట్టేవాళ్లు!

ఎప్పటికప్పుడు జరుగుతున్నది కొడుక్కి చెబుదామని అనిపించినా, ఎలా చెప్పాలో తెలిసేది కాదు. అప్పటికీ శాంతమ్మ ఓ సారి కొడుకుతో "భానూ...మేమంటే సుధకు పడటం లేదురా..." అని చెబితే "అదేం లేదు... సర్దుకుపోవాలి!" అని అనడంతో ఇంకేం మాట్లాడలేకపోయింది.

భానోజీ హోసింగ్ లోన్ కీ, కార్ లోన్ కీ అత్తా, మామా ఎంతో కొంత సాయం చేసేవాళ్ళు. ఆ సమయంలో "మీ నాన్న ఏమిచ్చాడు?" అని భర్తను దెప్పి పొడుస్తూ ఉండేది. నిజానికి మామగారు ఎలిమెంటరీ స్కూల్ టీచర్ అనీ, ఏదో చిన్న ఇల్లు సంపాదించుకుని, చాలీ చాలని పెన్షన్ తో తమ బ్రతుకేదో తాము గడుపుతున్నారనీ తెలిసికూడా తెలియనట్టు ఉంటూ, ఏదో అనడం ఆమెకే చెల్లింది. ఇవన్నీ చూస్తూ, గమనిస్తూ పెరిగిన సాయికి కొంచెం పెద్దవాడు కాగానే, తన మమ్మీకి ఎందుకో తాత, నానమ్మ అంటే ఇష్టం లేదు అనే విషయం అర్థం అయ్యింది. సెలవులకు వైజాగ్ వచ్చినప్పుడు, నామ మాత్రంగా అత్తా మామ గారింట్లో ఓ రెండు రోజులుండి తన కన్నవారింటికి వెళ్లిపోయేది.

కళ్ళ నీళ్ళు పెట్టుకునే నానమ్మ, దిగాలుగా చిన్నబోయిన తాతగారి మొహాలు చిన్నప్పటి నుండి గమనిస్తూ వుండే సాయికి.. ఒక్కొక్కటీ అర్థం కాసాగాయి. తాతయ్య, నానమ్మ అంటే మమ్మీకి ఇష్టం లేదు, పైగా అసహ్యం కూడా! డాడీకి మనసులో అభిమానం వున్నా, బైటికి వ్యక్తం చేయలేడని తెలుసుకున్న సాయికి తాతయ్య, నానమ్మ అంటే ఎంతో ఇష్టం. పసితనంలో ఒళ్ళో కూర్చుండబెట్టుకుని నానమ్మ చెప్పే పురాణ కథలు ఇప్పటికీ గుర్తున్నాయి. తాత గారు కొన్న కథల పుస్తకాలు ఇప్పటికీ అపురూపంగా దాచుకున్నాడు. తాతగారి పక్కన పడుకుని విన్న.. ఎన్నో అద్భుతమైన, వింతలూ, విశేషాలూ ఈ రోజుకీ మనసుని కదిలిస్తూనే ఉన్నాయి.

ఇన్నాళ్లకు ఉద్యోగం వచ్చిన శుభవార్తతో నానమ్మ, తాతగారింటికి బయలుదేరాడు సాయి.

"నానమ్మా...!" అంటూ చేతిలో బాగ్ విసిరేసి పరుగెత్తి వెళ్లి వాటేసుకున్న మనవడ్ని చూసి ఉక్కిరి బిక్కిరి అయ్యింది శాంతమ్మ.

పేపర్ చదువుకుంటున్న తాతగారి పక్కకి వెళ్లి భుజాలు కుదిపేస్తూ, "తాతా... నాకు జాబ్ వచ్చేసింది" ఇంచుమించు అరుస్తున్నట్టు చెప్పాడు.

అక్కడ ఆనందం ఆకాశమంత ఎత్తు ఎగిసింది.

***

మరుసటి రోజు ఉదయం, సీతమ్మధార లోని శ్రీ వేంకటేశ్వరుని ఆలయానికి వెళ్లి తాత, నానమ్మలతో అభిషేకంలో పాల్గొన్నాడు.

పూజ అంతా అయ్యాక, తీర్ధం తీసుకుంటున్నప్పుడు పంతులు గారితో గర్వంగా "నా మనవడికి ఉద్యోగం వచ్చింది" చెప్పాడు సత్యనారాయణ.

"శ్రీనివాసు అనుగ్రహ ప్రాప్తిరస్తు!" ఆశీర్వదించారు ఆయన.

గుడి నుండి బయటకు రాగానే ఇంటికి వెళ్ళడానికి శాంతమ్మ కొంచెం తొందరపడసాగింది.

"ఏంటి? నానమ్మా.... కంగారు?" అడిగాడు సాయి.

"నీకు టిఫిన్ తయారుచెయ్యాలిరా... అప్పుడే ఎనిమిది అవుతోంది!" అంది.

"ఇదిగో.. టిఫిన్ రెడీ!" అంటూ సాయి ఆటో పిలిచాడు.

ముగ్గురూ ఆటోలో కూర్చున్నారు. ఆటో టైకూన్ హోటల్ ముందు ఆగింది.

"హోటల్ కి ఎందుకు రా...." అని తాత, నానమ్మ వారిస్తున్నా, వాళ్ళను లోపలికి తీసుకెళ్లి, వాళ్ళకిష్టమైన టిఫిన్ ఆర్డర్ చేసాడు. ఎంతో సంతోష పడిపోయారు.

మధ్యాహ్నం భోజనం మనవడికి ఇష్టమైన కూర తయారు చేస్తున్న నానమ్మకి, వంటింట్లో సాయం చేసాడు.

సుమారు డబ్బయ్ ప్రాయంలో ఉన్న తాత, నానమ్మలు ఇంట్లో, బైట వంట పనులూ, బజారు పనులు చేసుకుంటూ ఇలా ఇంకా ఇబ్బంది పడటం ఏ మాత్రం నచ్చలేదు సాయికి.

ఆ సాయంకాలం బీచ్ కి వెళ్లారు ముగ్గురూ.

"తాతగారూ... నాకు పోస్టింగ్ బెంగళూరు రావచ్చు. అప్పుడు మీ ఇద్దరినీ నాతో తీసుకు వెళ్లిపోతాను" చెప్పాడు సాయి.

మనవడి భుజం మీద ఆప్యాయంగా చేయి వేస్తూ "అలాగే వస్తాం లేరా!" అన్నాడు సత్యనారాయణ.

"ఈ వయసులో ఇంకెక్కడికి వస్తాం? ఏదో ఇక్కడే అలవాటైన బంధు, మిత్రుల మధ్య అలా... అలా... కడతేరిపోతే, అదే చాలు! కాకపోతే చివరి రోజుల్లో అయినా కొడుకూ, కోడలు దగ్గరుంటే అంతకు మించిన అదృష్టం, భాగ్యం ఇంకేముంటాయి?" కొంగుతో ఉబికి వస్తున్న కన్నీళ్లను వత్తుకుంటూ అంది శాంతమ్మ.

"ఎందుకు నానమ్మా... నేను లేనూ!" ఆప్యాయంగా భుజం మీద తల వాల్చాడు.

సాయి అభిమానానికి ఎంతో మురిసిపోయారా వృద్ధ దంపతులు.

***

సాయికి బెంగళూర్ పోస్టింగ్ రాగానే మమ్మీ, డాడీ లకు తన మనసులోని మాట స్పష్టంగా చెప్పాడు.

భానోజీ కి షాక్ తగిలినట్లు అయ్యింది.  సుధామయికి హిస్టీరియా వచ్చేసింది.  ఎంత రాద్ధాంతం చేయాలో అంత చేసింది. కానీ, సాయి చలించలేదు!

"తాత, నానమ్మ ఇంక ఒంటరిగా అలా ఉండటానికి వీలులేదు. మీరు మీ బాధ్యత మరిచిపోతే అది మీ ఖర్మ. నా నిర్ణయం ఫైనల్!" స్పష్టంగా చెప్పాడు.

సాయి బెంగళూర్ వెళ్లిన నాలుగు రోజులకు భానోజీ ఫోన్ చేసి "సాయీ...నేను వైజాగ్ రిక్వెస్ట్ ట్రాన్సఫర్ అడిగాను.  ఒకటి రెండు నెలల్లో రావొచ్చు.  తాతయ్య, నాన్నమ్మల  గురించి నువ్వింక వర్రీ అవ్వకు. వాళ్ళను నేను చూసుకుంటాను!" చెప్పాడు.

"డాడీ ... మమ్మీకి ఇష్టం లేనిది మీరు మాత్రం ఏం చేయగలరు? వద్దులెండి!" అన్నాడు.

"అది కాదురా....." భానోజీ ఏదో చెప్పబోయాడు.

"డాడీ...తాతయ్య, నానమ్మ నా దగ్గర ఉంటే వాళ్ళకీ, నాకూ ఎంతో బావుంటుంది!"  చెప్పాడు  సాయి.

తొలిసారిగా తన కొడుకు గొంతులో చెక్కు చెదరని దృఢత్వం , తుహినాద్రి అంతెత్తు వ్యక్తిత్వంలా గోచరించింది.

"సాయీ.." అంటూ ఇంకేదో చెప్పబోయిన భానోజీకి గుండె గొంతులో కొట్లాడటమంటే ఏమిటో జీవితంలో తొలిసారిగా తెలిసొచ్చింది!!

***0***



# భారతీయం

## నిష్ఠల సుబ్రహ్మణ్యం

"ఒరేయ్! అబ్బాయ్! నువ్వు ఎన్నైనా చెప్పు. నువ్వు చేసింది నాకు నచ్చలేదు. 'ఆడపిల్లకు ఎక్కువ చదువులు వద్దు అంటే వినలేదు. పదో క్లాస్ వరకు చదివింది చాలు, ఇక ఆపేయరా బాబూ, పెళ్లి చేసేద్దాం అన్నాను. వినలేదు. చూడు ఇప్పుడు అది ఏం చేసిందో?"

రామశాస్త్రిగారి తల్లి, గంగా భాగీరథీ సమానులైన కామేశ్వరమ్మ గట్టిగా అరచినట్లుగా అంది. "అయ్యో! అయ్యో!! వాడు ఎవడో తెలియదు, వాడి కులం ఏమిటో తెలియదు. వాడితో ఆ ఇకఇకలు, పకపకలూ ఏమిటి? మన ఖర్మ కాకపోతే!"

"అమ్మ ఊరుకో! ఏమి కాదులే. కాస్త చనువుగా ఉన్నంత మాత్రాన ఏమయింది? కాలేజిలో చదువుతున్నప్పుడు ఇలాంటివి మామూలే! కాస్త స్నేహితుల మధ్య నవ్వుతూ ఉంది అంతేగా! ఇంతలా ప్రత్యేకంగా పనిగట్టుకుని, ఈ ఫోటో, మనకు పంపించారు అంటే, వాళ్ళకి మన భారతి అంటే, ఇష్టం లేక ఇలా చేసి ఉంటారు. నేను రాత్రి ట్రైన్ కే విశాఖపట్నం వెళ్తాను. సరేనా?"

రాజమండ్రి దగ్గర ఒక పల్లెటూరులో కృష్ణశాస్త్రిగారి వీధిలో అందరూ వేద పండితులే! ఎప్పుడూ ఆ వీధిలో వేద పారాయణా ఘోష వినిపిస్తూనే ఉంటుంది. ప్రతి ఇంట్లో హోమాగ్ని వెలుగుతూనే ఉంటుంది. ఆ వీధికి రామశాస్త్రి తాతగారి పేరే పెట్టారు. ఆయన ఎందరో బీద బ్రాహ్మణులను, చేరదీసి, ఉచితంగా వేద విద్య బోధించి అందరికి ఉపనయనాలు, పెళ్లిళ్లు చేయించారు. రామశాస్త్రి కూడా, తాత గారి పేరు నిలబెట్టడానికి సాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. వీరికి ఒక్కత్తే కూతురు. పేరు భారతి. ఒక్కత్తే కూతురు అవడం వలన, అల్లారు ముద్దుగా పెంచారు. తనకు ఉన్న శ్రద్ధ, పట్టుదలతో ఎంసెట్ లో కూడా మంచి రేంక్ సంపాదించి, మెడికల్ లో ఫ్రీ సీట్ సంపాదించుకుంది. విశాఖపట్నంలో జాయిన్ అయింది. మూడవ సంవత్సరం చదువుతోంది. ఎప్పటికైనా మంచి గైనకాలాజిస్ట్ అవాలని కోరిక. దీనికి కారణం లేక పోలేదు. వాళ్ల ఇంట్లో పనిమనిషి, రాములమ్మ కూతురు కాన్పుకి, సమయానికి మంత్రసాని దొరకక, ఆ పల్లెటూరిలో ఎవరూ డాక్టర్ లేకపోవడం వలన, రాజమండ్రి తీసుకువెళ్లే లోపు మరణించింది. అది మనసులో పెట్టుకున్న భారతి ఎప్పటికైనా మంచి డాక్టర్ అవాలని, ఆ ఊరిలోని ప్రజలకు, సేవ చెయ్యాలని నిర్ణయించుకుంది.

***

భారతి ప్రొద్దుటే కాలేజికి వెళ్లడానికి తయారు అవుతుంటే, హాస్టల్ ముందు ఆటోలో దిగిన తండ్రిని చూసి, చెంగున గెంతి, తండ్రి చెయ్యి ఆప్యాయంగా పట్టుకుని, కుశల ప్రశ్నలు వేస్తూనే లోపలకి తీసుకువచ్చి, కుర్చీలో కూర్చోబెట్టి, మంచినీళ్లు, తరువాత ఫ్లాస్క్ లో కాఫీ ఇచ్చి, "ఏమిటి నాన్నా! వస్తున్నట్లు, ఫోన్ చెయ్యకుండా సడన్ గా వచ్చావు! మొన్ననే కదా నేను వచ్చాను. ఈ లోగానే చూడాలని అనిపించిందా? ఇంట్లో అమ్మా, అమ్మమ్మా బాగున్నారా?" అంటూ ప్రశ్నలు వేసింది.

"ఏమి లేదమ్మా! ఊరికే వచ్చాను. నీ రూమ్ మేట్ లేదామ్మా? "

"దానికి తొందర ఎక్కువ. క్లాసుకు వెళ్లిపోయింది!"

రామశాస్త్రి, కొద్దిగా బిడియ పడుతూ, జేబులోంచి సెల్ తీసి,ఆన్ చేసి, తనకు వచ్చిన ఫోటో చూపించాడు.

భారతి ఆశ్చర్యపోయింది. మొన్న కాలేజి ఫంక్షన్లో, తను, కృష్ణ నవ్వుతూ ఉన్న ఫోటో. అంతలా, చుట్టూ ఎవరూ పడకుండా కేవలం తామిద్దరూ మాత్రమే ఉన్న ఫోటో ఎవరు తీశారు? తన తండ్రికి ఎవరు పంపించారు? ఆలోచిస్తోంది.

"ఏమిటమ్మా? ఆలోచిస్తున్నావు? నాకు నీ మీద పూర్తి నమ్మకం ఉంది. నీకు తెలుసుగా మామ్మ సంగతి. మామ్మకి మీ అమ్మ చూపించి, ఎంతో మురిసిపోయిందిట. 'అత్తయ్య గారూ! మన భారతి ఎంత బాగుందో ఈ డాక్టర్ డ్రెస్ లో అంటూ.' అది అంతే ఆలోచించింది. కానీ మీ మామ్మ గడుసు పిండం. వెంటనే, అందుకుంది. 'ఏమిటీ ఇకఇకలూ పకపకలు అంటూ!"

"దాని కోసం నువ్వు వచ్చేసేవా? ఫోన్ చేసి అడగవచ్చు కదా? అయినా ఇప్పుడు ఏమైంది? నేనంటే కిట్టని వాళ్ళు, మొన్న కాలేజీలో ఫంక్షన్ జరిగినప్పుడు ఎవరో తీసి, నీకు పంపించారు. నేను కనుక్కుంటాను. మీరేమీ బెంగ పెట్టేసుకోకండి. నా సంగతి నీకు తెలీదా నాన్నా!"

"కన్నవాళ్ళం మాకు బెంగ ఉండదా తల్లీ! సరే, నీకు టైమ్ అవుతోంది. నువ్వు వెళ్ళు. ఇక్కడ మా ఫ్రెండ్ ని ఒకసారి కలసి, వెళ్లిపోతాను. జాగ్రత్త!!"

"సరే నాన్నా! అనవసరంగా అంత దూరం నుంచి వచ్చావు!"

ఇద్దరూ బయటకు వచ్చి ఎవరి దారిని వాళ్ళు వెళ్లిపోయారు.

భారతి కాలేజ్ కి వెళ్తుంటే రవి, తన క్లాస్ మేట్, కనిపించి "హలో! భారతి గారూ! మీ నాన్న గారు వచ్చినట్లున్నారు!" అంటూ వెకిలిగా నవ్వాడు.

భారతి "మా నాన్నగారు వచ్చినట్లు మీకెలా తెలుసు?" రవి మీద అనుమానం వచ్చింది. తన తండ్రి రావడం, వెళ్లిపోవడం అంతా ఒక అరగంటలో అయిపోయింది. ఆయన రావడం కానీ వెళ్లిపోవడం కానీ, ఎవరు చూడలేదు. మరి

ఇతనికి ఎలా తెలిసింది? అంతే కాకుండా అతను వెకిలిగా నవ్వడం తనకి నచ్చలేదు. ఇంతలో కాలేజి రావడంతో, తన ఆలోచనలకి స్వస్తి పలికి, తన క్లాస్ రూమ్ లోకి వెళ్ళిపోయింది. రెండవ పీరియడ్ అయిపోయాక, టీ తాగటానికి కాంటీన్ కి వెళ్ళింది. తనతో బాటు జానకి, స్రవంతి కూడా వచ్చారు. ఫ్రెండ్స్ ఇద్దరూ జోక్స్ వేసుకుంటూ పకపక నవ్వుతున్నారు. కానీ, భారతి మాత్రం తన తండ్రి రావడం ఆ ఫోటో, వీటి గురించే ఆలోచిస్తోంది. ఇదంతా ఆ రవి చేసి ఉంటాడు. లేకపోతే పొద్దుట ఆ వెకిలి నవ్వు ఎందుకు నవ్వుతాడు?

"భారతీ! ఏమిటే! కాంటీన్ కి వచ్చి ఆ పరధ్యానం?" జానకి అడిగింది.

"ఏమి లేదే, పొద్దుట నాన్న వచ్చారు!"

"మంచిదే కదే! మీ మామ్మ తినడానికి ఏమైనా పంపిందా? "

"ఆ! పంపింది. నన్ను తినమని మా నాన్నని పంపింది."

"అదేమిటే? మీరు విజిటేరియన్స్ కదా?"

జానకి, స్రవంతి పక్కుమని నవ్వారు.

భారతికి నిజంగానే కోపం వచ్చి "ఉండండి. మీ జోక్స్. . అసలే చికాకుగా ఉంది!" గట్టిగా అంది

"ఏమయింది?" స్రవంతి అడిగింది.

భారతి పొద్దుట తన తండ్రి వచ్చిన విషయం, తను, కృష్ణ ఉన్న ఫోటో.. ఆ విషయాలు చెప్పింది. ఎవరు ఆ ఫోటో తన తండ్రికి పంపించారో అని, తనకు రవి మీద అనుమానం అని చెప్పింది

"వాడే అయి ఉంటాడు. వాడే అలాంటి పనులు చేస్తాడు!" జానకి అంది.

"నువ్వే కాలంలో ఉన్నావే? దానికోసం ఇంతగా వర్రీ అయిపోవడం ఎందుకు? ఈసారి మళ్ళీ అలాంటి వెధవ వేషాలు వేస్తే చెప్పు, వాడికి బుద్ధి చెబుదాం.." అంది స్రవంతి. ఆమె ధైర్యం గల అమ్మాయి.

ఈలోగా కృష్ణ వచ్చాడు

"భారతి గారూ! ఏమిటీ డల్ గా ఉన్నట్లు ఉన్నారు? మీ ఫ్రెండ్స్ ఒక ప్రక్క నవ్వుకుంటున్నారు. మీరు ఏదో ఆలోచనలో ఉన్నారు?" అంటూ అడిగాడు.

"ఏమి లేదండీ. ఇంట్లో ఏవో సమస్యలు. పొద్దుట మా నాన్న గారు వచ్చారు."

"అవునా! అయినా, సమస్యలు లేని ఇల్లు ఉంటుందా? సమస్యలు వస్తే, సామరస్యంగా పరిష్కరించుకోవాలి. అంతే గాని, అదే ఆలోచిస్తూ మనసు పాడు చేసుకోకూడదు. ఏమంటారు?"

ఆ సమయంలో కృష్ణ ఎంతో అనుభవం ఉన్నవాడి లాగా కనిపించాడు. మొదటిసారిగా కృష్ణ మీద తన ఆలోచనలు చుట్టుముట్టాయి. నిజంగా కృష్ణ బాగుంటాడు. అందమైన నేత్రాలు, చురుకైన చూపు, కోటేరు ముక్కు, ఒకసారి చూస్తే మళ్లీ మళ్ళీ చూడలనిపించే అతని ముఖం. చాలా తెలివైనవాడు.

"ఏమిటండి బాబు! అంత పరధ్యానం!" అన్నాడు కృష్ణ.

అప్పుడు ఈ లోకంలోకి వచ్చి "అబ్బే ఏం లేదండి. అదుగో బెల్ కొట్టారు. పదండి, వెళ్లిపోదాం!"

జానకి, స్రవంతి కూడ లేచారు. అందరూ క్లాస్ కి వెళ్లిపోయారు.

***

సాయంత్రం రూమ్ ముందు క్రోటన్ మొక్కల దగ్గర కూర్చుని, పుస్తకం పట్టుకుంది. అబ్బే! మనసు మొదటిసారిగా అదుపు తప్పింది. తండ్రి పొద్దుట సెల్ లో చూపించిన ఫోటో కళ్ల ముందు తిరుగుతోంది.

రవి తమ ఫోటో తీసి మంచి పని చేశాడా? మొదటిసారిగా రవికి మనసులో థేంక్స్ చెప్పుకుంది.

చ! ఛ! ఏమిటి? ఎప్పుడూ లేనిది, తన మనసు తన మాట వినడం లేదు. చేతిలో పుస్తకం ఉందన్నమాటే కానీ, చదివినదే మళ్ళీ మళ్ళీ చదువుతోంది. అతి కష్టం మీద మనసు ఆధీనంలోకి తెచ్చుకుని, తన రూమ్మేట్ పద్మని 'అలా గుడి దాకా, వెళ్దాము వస్తావా' అని అడిగింది. పద్మ సరే అంది. రూమ్ తాళం వేసి ఇద్దరూ బయలు దేరారు. కాలేజ్ కాంపస్ లో వినాయకుడి గుడి ఉంది. సాయంత్రం వేళ స్టూడెంట్స్ అందరూ అక్కడ చేరుతారు. ఆ గుడికి అబ్బాయిల హాస్టల్ దాటి వెళ్లాలి. అబ్బాయిల హాస్టల్ వచ్చేసరికి, భారతి కళ్ళు అనుకోకుండానే అటు వైపు తిరిగాయి.

"ఏమిటి? ఇవాళ నాకు ఏమైంది? కాలేజిలో చేరి మూడు సంవత్సరాలు అయింది. ఎప్పుడూ అబ్బాయిల హాస్టల్ కేసి చూడలేదు" తనలో తానే గొణుక్కున్నట్లుగా అనుకుంది.

'ఏమిటి తల్లి! ఏమయింది నీకు? అలా గొణుక్కుంటున్నావు?"

"ఏమి లేదులే పద!" అంది కానీ, మనసులో కలవరంగా ఉంది.

గుడికి వెళ్లి వినాయకునికి దండం పెట్టుకుని, బయటకి వచ్చేసరికి కొద్దిగా దూరంగా జానకి, స్రవంతి ఇంకా కొంతమంది ఫ్రెండ్స్ కనిపించారు. కాస్సేపు కూర్చుని మాట్లాడి, భారతి, పద్మ రూమ్ కి వచ్చేశారు.

***

ఒకరోజు రామశాస్త్రి ఇంటి అరుగు మీద కూర్చుని, వేద విద్యార్థుల చేత సంస్కృత శ్లోకాలు వల్లె వేస్తున్నారు. అంతలో పోస్ట్ మెన్ వచ్చి ఉత్తరం ఇచ్చి వెళ్ళిపోయాడు.

అది చూసిన కామేశ్వరి "ఎక్కడనుంచిరా అబ్బాయ్! ఉత్తరం?" అంటూ అడిగింది.

రామశాస్త్రి కవర్ తీసి," రామనాధం దగ్గర నుంచి" అని తల్లి కి సమాధానం చెప్పి, ఉత్తరం చదివాడు.

"ఏమంటాడు ఏమిటి?"

"ఏముందీ? మామూలే. మన భారతిని వాడి కొడుకు వాసుకి ఇచ్చి పెళ్లి చెయ్యమంటాడు. పాతపాటే కదా!"

"వాడు అడగడంలో తప్పేముందిరా? దానికి బావ వరసే కదా?"

"బాగుందే అమ్మా! వాడి చదువేమిటి? మన అమ్మాయి చదువేమిటి?"

"చదువెందుకురా? ముప్పై ఎకరాల పొలం ఉంది. పెళ్ళాన్ని దివ్యంగా పోషించుకుంటాడు. అంత కంటే ఏమి కావాలిరా?"

"పొలం ఎవరికి కావాలి? డాక్టర్ చదివి, ఈ పల్లెటూరు రైతుని పెళ్లి చేసుకుంటుందా? అయినా దాని చదువు పూర్తి అవాలి కదా? తరువాత చూద్దాములే!"

ఇక లాభం లేదనుకుని కామేశ్వరమ్మ మాట్లాడకుండా లోపలకి వెళ్లిపోయింది.

***

భారతి, "పద్మా! నేను అలా బుక్ షాప్ కి వెళ్లి వస్తాను. కొన్ని బుక్స్, రికార్డ్స్ కొనుక్కోవాలి!" అని రూమ్మేట్ కి చెప్పి, బయటకు వెళ్లింది.

భారతి బుక్స్ కొనుక్కుని వస్తుంటే, దారిలో కృష్ణ కనిపించాడు.

"హలో భారతి గారూ! ఏమిటి? ఇలా వచ్చారు?"

"బుక్స్ కొనుక్కుందుకు వచ్చాను. పని అయిపోయింది. రూమ్ కి వెళ్లిపోతున్నాను!"

"నేను ఇప్పుడే రూమ్ లోంచి బయటకి వచ్చాను. తల నొప్పిగా ఉంటే, టీ తాగుదామని .. మీరూ రాకూడదూ! ఇద్దరం కలిసి వెళ్లిపోవచ్చు!" అంటూ ఇద్దరు అక్కడే ఉన్న హోటల్లోకి వెళ్ళేరు.

ఏవో కబుర్లు చెప్పుకున్నారు.

కథా మంజరి

"వూరిలో స్వంతంగా హాస్పిటల్ పెట్టాలని ఉంది. ఎక్కడా పనిచెయ్యను. ఒకరికి తలవంచి పని చెయ్యడమూ, వాళ్లు చెప్పినట్లు ఉండటం నాకు ఇష్టం ఉండదు. పేదలను ఆదుకోవడం, వారికి మెరుగయిన సేవలు అందించడం, నా అభిలాష!" కృష్ణ తన ఆలోచనల గురించి చెప్పాడు.

"చాలా బాగా చెప్పారు. నేను మాత్రం ఇప్పుడేమి చెప్పలేను. ఇంకా ఏమి అనుకోలేదు!"

భారతికి కృష్ణ అంటే ఇష్టం ఏర్పడుతోంది. అతన్ని చూడాలనిపిస్తోంది. కంటికి ఎదురుగా కనిపిస్తే,ఏం మాట్లాడాలో తెలియడం లేదు. ఇదేనా ప్రేమ అంటే? అతని గురించే ఆలోచిస్తోంది.

"భారతి గారూ! ఏదో ఆలోచిస్తున్నారు?"

"అబ్బే! ఏమిలేదండి. పదండి.. టైం అవుతోంది."

ఇద్దరూ ఎవరి రూం కి వాళ్లు వెళ్లిపోయారు.

తన రూముకి వచ్చింది కాని, కృష్ణ గురించే ఆలోచనలు. నాలుగు సంవత్సరాలుగా లేనిది ఇప్పుడేమిటి ఇలాగా? అనుకుంది. ఇంక అతని గురించి, ఆలోచించడం మానేసి, పుస్తకం లో తల దూర్చింది.

విజయవంతంగా, చదువు ముగిసింది. హౌస్ సర్జన్ లో భాగంగా, కాకినాడ మెడికల్ కాలేజీలో భారతికి, తన స్నేహితురాలు జానకి అలాగే కృష్ణ కూడా అక్కడే సీట్లు వచ్చాయి. విశేషం ఏమిటంటే కృష్ణ వాళ్ల ఊరు కాకినాడ.

***

ఒక రోజు సాయంత్రం, కాలేజీ కేంటీన్లో కాఫీ తాగుతూ, భారతి, కృష్ణ మాట్లాడుకుంటున్నారు.

కృష్ణ, అకస్మాత్తు గా, "భారతి గారూ! మీకు ఒక విషయం చెప్పాలనుకుంటున్నాను!" అంటూ అడిగాడు.

"చెప్పండి. మనసులో మనకి మొహమాటాలు ఎందుకు?" భారతి అంది.

"మీకు నేను అంటే ఇష్టం ఉంటే నేను మిమ్మల్ని పెళ్లి చేసుకొందామని అనుకుంటున్నాను. మీకు కూడా ఆ ఉద్దేశ్యం ఉంటే చెప్పండి. లేకపోతే లేదు!"

సడన్ గా కృష్ణ అలా అడిగేసరికి, భారతి ఆశ్చర్యపోయింది. ఇన్నాళ్లు అతని మీద తనకు ఆ ఉద్దేశ్యం ఉన్నప్పటికీ, తనూ పైకి చెప్పలేకపోయింది. అతనూ ఆ విధంగా అనుమానం వచ్చేటట్లుగా ప్రవర్తించలేదు. ఇలా అతను అడిగేసరికి సమాధానం చెప్పాలో తెలియలేదు.

మళ్లీ కృష్ణ అన్నాడు "మీరు ఆలోచించుకుని చెప్పండి. నేను ఎప్పుడూ ఈ ప్రస్తావన తేలేదు. ఇంత సడన్ గా అడిగేసరికి, మీకు కొంచెం ఇబ్బంది ఉండవచ్చు! మా వాళ్ళు నాకు పెళ్లి చెయ్యాలని అనుకుంటున్నారు. మీరు అంటే

నాకు సదభిప్రాయం ఉంది.  ఎవరో ముక్కూ మొహం తెలియని వారిని పెళ్లి చేసుకోవడం కంటే, మిమ్మల్ని చేసుకుంటే మంచిదనిపించింది.  మన ఈ పరిచయంలో మిమ్మల్ని నేను, నన్ను మీరూ బాగా స్టడీ చేసి ఉంటాము కదా? మనం పెళ్లి చేసుకుంటే ఇద్దరం కలిసి, బాగా సంపాదించవచ్చు. ఎలాంటి ఒడిదుడుకులు ఉండవు.  ఏమంటారు?"

భారతికి ఏమి చెప్పాలో తెలియలేదు. నన్ను అతను ప్రేమించడం లేదా? ఏదో పెళ్లి చేసుకోవాలి కాబట్టి, నన్ను చేసుకుంటే, ఇద్దరి సంపాదన, బాగుంటుందని అతని ఆలోచనా? ఎంత స్వార్థం! తనకు, ముందునుంచీ, తన స్వంత ఊరులో ప్రాక్టీస్ పెట్టాలని, వీలయితే, హాస్పిటల్ కట్టించాలని తన కోరిక.  తన ఆశ నెరవేరదా?

"ఏమిటి ఆలోచిస్తున్నారు? తొందర ఏమి లేదు.  ఆలోచించి చెప్పండి!" అని వెళ్లిపోయాడు.

అక్కడ కాలేజీ లోనే హాస్టల్ లో హౌస్ సర్జన్స్ బస ఇచ్చారు . కృష్ణ స్వంత వూరు ఇక్కడే కాబట్టి అతను వాళ్ళ ఇంట్లోనే ఉంటున్నాడు.

హాస్టల్ కి వెళ్ళిపోయి, ఆలోచనల్లో పడింది.

'మిమ్మల్ని నేను ప్రేమించాను.  మీకు ఇష్టమైతే పెళ్లి చేసుకుందాము' అని కృష్ణ అడిగి ఉంటే, వెంటనే ఒప్పేసుకునే దానిని.  హు! ఇంకా నయం! తొందరపడి, అతనిని ప్రేమిస్తున్నానని చెప్పలేదు.

ఇంతలో జానకి, స్రవంతి కూడా రూమ్ కి వచ్చేశారు.

"హలో మాడం! డాక్టర్ భారతి గారూ! ఏమిటి? మా లోకంలోకి కాస్త వస్తారా?" అంది జానకి.

"ఇందాక, మేడం గారూ, కృష్ణ గారు కలిసి కేంటిన్ లో టీ తాగారులే. అప్పుడు ఏం మాట్లాడుకున్నారో? ఏమో? దాని గురించే అయిఉంటుంది!" అంది స్రవంతి.

భారతి, భారంగా "నిజమే!" అంది.

"అవునా? మరింక ఎందుకు ఆలశ్యం? ఏం జరిగిందో చెప్పు!" జానకి ఆతృతగా అడిగింది.

భారతి జరిగింది అంతా చెప్పింది.

"ఈ మగవాళ్ళు ఎందుకు ఇలా ఆలొచిస్తారో?" అంది స్రవంతి.

"అందరు మగవాళ్లని అలా అనకు" అంటూ జానకి భారతి వైపు చూసింది.

"సరే, ఇంక ఈ టాపిక్ ఆపేయండి!" అంటూ భారతి సీరియస్ అయిపోయింది.

"నువ్వు, కృష్ణ అంటే ఇష్టపడుతున్నావు కదే! మరి అతనిని పెళ్లి చేసుకోవాలని లేదా?" సౌమ్యంగానే అడిగింది.

"అంత కమర్షియల్ గా ఆలోచిస్తుంటే,  నేను చేసుకోలేను. నాకు బీదలకు ఉచితంగా సేవ చెయ్యాలని ఉంది. అతని ఆలోచన ఏమిటో తెలిసింది కదా! మా ఇద్దరికీ ఎలా పొత్తు కుదురుతుంది?" భారతి తన మనసులోని మాటని భావగర్భితంగా చెప్పింది.

***

చూస్తూ ఉండగానే, మెడిసిన్ పూర్తి అయిపోయింది.  ఎవరి ఇళ్ల కు వాళ్లు వెళ్ళి పోయారు.

ఈ లోగా భారతి కుటుంబం లో చాలా మార్పులు చోటు చేసుకున్నాయి. భారతి బామ్మగారు కాలం చేశారు. మేనమామ కొడుకుని తను పెళ్లి చేసుకోలేదని వీళ్లతో బంధుత్వం వదులుకున్నారు.

భారతి, తన చిరకాల కోరిక తీర్చుకోవడం కోసం ఎం డి (గైనకాలజీ ) పూర్తి చేసింది. తండ్రి అడ్డు చెప్పలేదు. . తన ఊరిలో నీ నర్సింగ్ హోమ్ ఓపెన్ చేసింది.

***0***



# ప్రక్షాళన

## జ్యోతి సుంకరణం

"మనింటికి వెడదాం, వచ్చేస్తావా సమీరా!" అన్న అత్తగారి మాటకి, పాపకి డైపర్ మారుస్తున్న సమీర, ఒక్కసారి ఉలిక్కిపడి చూసింది అర్థంకానట్లు. వస్తున్నట్లు కనీసం ఫోన్ అయినా చేసి చెప్పకుండా ఉన్నట్టుండి పొద్దున్నే అత్తగారెందుకు వచ్చేసిందో అర్థం కాని సమీరకు ఈ ప్రశ్న ఇంకా అర్థం కాలేదు.

"అదేమిటి వదినగారూ.. వచ్చే నెల్లో పిల్లను పంపించడానికి ముహూర్తం పెట్టుకున్నాంగా, ఇంతలో ఇలా అడుగుతున్నారేమిటీ?" పక్కనే నిలబడ్డ సమీర తల్లి వనజాక్షి అడిగింది విశాలని.

"ఔను.. నిజమే గాని ఇపుడు కొన్ని పరిస్థితుల వలన, తనని తీసుకు వెడదామనుకుంటున్నాను!" స్థిరంగా చెప్పింది విశాల.

"భలే వారే.. ఇంకా మీ ఇంట్లో జరిగిన దుర్ఘటన తెలిసి, మరో రెండు నెలలు మా ఇంట్లోనే అమ్మాయిని, మనవరాలిని ఉంచుకుని మరీ పంపిద్దామనుకుంటుంటే, మీరేవిటీ.." అంటూ సాగదీసింది వనజాక్షి.

"అవునత్తయ్యా! మన యాదమ్మ కూతురు పార్వతి కరెంట్ షాక్ తగిలి చనిపోయిందట కదా, ఎంత పనిపిల్ల కూతురైనా మన ఇంటి వాకిట్లోనే పోయింది కదా, కొద్ది రోజులు నన్ను ఇక్కడే ఉండమంటున్నారు అమ్మా వాళ్ళు!" అంటూ అత్తగారి మొహంలోకి చూసింది సమీర.

"అసలు పార్వతి చనిపోయినట్లు నీకెవరు చెప్పారు?" కోడలి కళ్ళలోకి సూటిగా చూస్తూ అడిగింది విశాల.

"ఇంకెవరూ మీ అబ్బాయే చెప్పారు!" అంది సమీర.

"అసలెలా చనిపోయిందో మొత్తం చెప్పాడా?" అనుమానంగా అడిగింది విశాల.

“ఆ..చెప్పారు, ఇందులో దాచడానికేముంది, ముందు రోజు రాత్రి గాలివానకి మన ఇంటి గేటు ముందు కరెంట్ వైరు తెగిపడింది, దాన్ని చూసుకోకుండా ముట్టుకోవడం వలన షాక్ తగిలి చనిపోయింది పార్వతి!” తడుముకోకుండా చెప్పింది సమీర తన కళ్ళతోనే చూసినట్లుగా.

“ఇంతేనా? ఇంకేమీ చెప్పలేదా వాడు?” మళ్ళీ అడిగింది విశాల.

కాస్త విసుగనిపించినా “ఇంతే ..ఇంకేమీ చెప్పలేదు” చెప్పింది సమీర వినయంగానే.

“పార్వతి మరణంలో అసలు నిజం వేరే ఉంది సమీరా, ఆ సంగతులు నీకు చెప్పాలనే వచ్చాను నేను!” అంటూ వివరించబోయింది విశాల.

పక్కమీద ఉన్న బిడ్డని భుజానికేసుకుని “దీన్ని తీసుకుని నేనే బైటకి పోతాను, అప్పుడు చెప్పండి!” అంటూ వెళ్ళబోయింది వనజాక్షి. వెంటనే ఆవిడని వెళ్లనివ్వకుండా చేతిని అడ్డుపెట్టి “ఆగండి మీరు కూడా ఈ నిజాలన్నిటిని విని తీరాలి, అదీ ఈ పసి బిడ్డ సమక్షంలోనే!” అంటూ సూటిగా కళ్ళలోకి చూస్తూ గంభీరమైన గొంతుతో విశాల చెప్పడంతో, అలా మంచం మీదనే కూర్చుని ఉండిపోయింది వనజాక్షి. చెప్పడం మొదలు పెట్టింది విశాల.

***

ఉదయాన్నే ఇంకా తెల్లారకుండానే అదే పనిగా కాలింగ్ బెల్ మోగుతుండడంతో, విసుగ్గా లేచి వెళ్లి తలుపు తీసాడు అజిత్. ఎదురుగా పనిమనిషి యాదమ్మ కూతురు పార్వతి.

“బాబూ పొద్దున్నే అమ్మగారూ వాళ్ళు వచ్చేత్తానన్నారట, వచ్చేరేమో కనుక్కోమంది మాయమ్మ!” అంది.

“ఇంకా రాలేదు, ఎనిమిదవుతుంది వాళ్ళు రావడానికి” నిద్ర మత్తుతో కొంచెం విసుగ్గా చెప్పాడు అజిత్.

“సరే బాబూ నేను మళ్ళీ ఆ టైం కి వత్తాను” అంటూ వెళ్ళిపోబోయింది పార్వతి.

“సరే” అంటూ తలుపేసుకోబోతున్న అజిత్ కి చటుక్కున గుర్తొచ్చింది, రాత్రి తనూ తన ఫ్రెండ్సూ కలిసి పార్టీ చేసుకోవడం గురించి, రాత్రి వాళ్లంతా వెళ్ళిపోయినా ఆ బాటిల్స్, సిగరెట్ పీకలతో బెడ్ రూమ్ అంతా దరిద్రంగా ఉండడంతో.. “ఏయ్.. ఆగాగు కొంచెం ఆ బెడ్ రూమ్ తుడిచి పో” అన్నాడు పార్వతితో.

'అలాగే బాబూ' అంటూ లోపలికి వచ్చింది. అస్తవ్యస్తంగా పడేసి ఉన్న దుప్పట్లను, తలగడలను తీసి దులిపి శుభ్రం చెయ్యసాగింది. బద్ధకంగా అలా అక్కడే కుర్చీలో కూర్చున్నాడు అజిత్. కాస్సేపటికి వంగునీ, కూర్చునీ,

రక రకాల భంగిమల్లో గది తుడుస్తున్న పార్వతి మీద దృష్టి సారించాడు అజిత్. పద్నాలుగు, పదిహేను సంవత్సరాలు ఉంటాయేమో దానికి, ఎత్తుగా, ఏపుగా వయసుకి మించి ఎదిగి ఉంది అది. దాని పొట్టి పరికిణీ, సాగదీసి ఎగుడు దిగుడుగా పిన్నీసు పెట్టుకుని వేసుకున్న చాలీ చాలని జాకెట్టు.. ఆ ఎదిగిన శరీరాన్ని దాచలేక పోతున్నాయి. ఇంట్లో ఎవరూ లేకపోవడం, భార్య పురిటికి వెళ్లి చాలా కాలం అవటం, మరీ ముఖ్యంగా రాత్రి తాగిన మందు మత్తు ఇంకా దిగకపోవడంతో అజిత్ చూపులు, పార్వతి మీద ఎక్కడ పడకూడదో, అక్కడే పడ్డాయి. అంతే!! అతని లోని మృగం, మేక పిల్లని కబళించే ప్రయత్నం చేసింది. ఈ హఠాత్పరిణామానికి ఆ పిల్ల బెదిరిపోయి విడిపించుకునేందుకు తన శాయశక్తులా ప్రయత్నించింది. అయితే పశుబలం ముందు పసితనం చాలలేకపోయింది .. ఓడిపోయింది!! వాంఛ తీరిన విజయగర్వంతో రిలాక్స్ గా పడుకున్నాడు అజిత్. అసలేం జరిగిందో, తర్వాత ఇంకేమి జరుగుతుందో కూడా అర్థం కాని పార్వతి విపరీతమైన భయంతో ఏడుస్తూ బైటకి పరుగు తీసింది. అంతే ఒక్కసారి మత్తు వదిలింది అజిత్ కి. అలాంటి పరిస్థితుల్లో పార్వతి ఏడుస్తూ బైటకి వెళితే ఏం జరుగుతుందో తెలిసొచ్చింది. వెంటనే దాని వెంట పరిగెత్తాడు

“ఏయ్ ..ఆగు, ఆగు” అంటూ.

వెనక పరిగెత్తి వస్తున్న అజిత్ ని చూసి ఇంకా వణికిపోయింది పార్వతి. అంతే ఇంక ముందు, వెనుక ఆలోచించలేదు, ఇంక ఆ రాక్షసుడి చేతికి చిక్కకూడదన్న వెర్రి భయంతో పరిగెట్టేస్తూ విచక్షణ కోల్పోయింది. పాపం ఇంకో అడుగేస్తే గేటు తీసుకుని రోడ్డు మీదకి వెళ్లిపోయేదే, మాయదారి దేవుడు ..అప్పుడప్పుడు చెడ్డ వాళ్ల పక్షాన్నే ఉంటాడు కాబోలు మరి. వస్తున్నప్పుడు చూసింది అక్కడ రాత్రి గాలి వానకి పడిపోయిన కరెంట్ తీగని, జాగ్రత్తగా దాటుకునే వచ్చింది వచ్చేటప్పుడు. కాని ఇప్పుడు తన మానసిక, శారీరక పరిస్థితి ఆ తీగని గమనించే స్థితిలో లేకపోవడంతో చటుక్కున దాని మీద అడుగేసేసింది!! అంతే మరుక్షణం బాణం దెబ్బ తగిలిన పక్షిలా విలవిలలాడుతూ నేలకొరిగిపోయింది. వెంటపడి పరిగెడుతున్న అజిత్ ఆ దృశ్యాన్ని చూడగానే ఆగిపోయాడు. కలిసి వచ్చిన అదృష్టాన్ని ముందు నమ్మలేకపోయాడు, ఆ తర్వాత పార్వతి విలవిల లాడడాన్ని వినోదం చూస్తూ దూరంగా ఉండిపోయాడు. అప్పుడప్పుడే అందరికీ తెల్లవారబోతోంది, పాపం పార్వతి జీవితం తెల్లారిపోతోంది. కాస్సేపటికి రోడ్డు మీద పోతూ ఎవరో పార్వతిని చూసి పరిగెట్టుకుంటూ వచ్చారు, అలా ఒకరి తర్వాతొకరు చుట్టూ చేరారు. అంతా అయ్యో .. అయ్యో అంటూ చూస్తూ చుట్టూ నిలిచి ఉన్నవారే, ఎవరూ చొరవ తీసుకున్నవారు లేరు. అప్పుడొచ్చాడు బైటకి అజిత్ “ఏమైంది .ఏమైంది” అంటూ అప్పుడే సంఘటనను చూసినట్లు. ఈలోగా ఆటో లోంచి దిగారు విశాల, ప్రసాదరావులు. సంఘటనను చూసి వెంటనే పార్వతి ఒంటి మీద దుప్పటి చుట్టి, అదే ఆటో లో హాస్పటల్ కి తీసుకు వెళ్లిపోయారు. ఈ లోగా వార్త తెలియడంతో గుండెలు బాదుకుంటూ వచ్చింది యాదమ్మ హాస్పటల్ కి. కొన ప్రాణం ఉండడంతో ట్రీట్మెంట్

మొదలు పెట్టారు. ఆ మర్నాడు కొద్దిగా స్పృహ వచ్చి గొణుగుతుండడంతో, అక్కడే ఉన్న విశాల, యాదమ్మ, ప్రసాదరావులు దగ్గరికి వెళ్లారు. అతి కష్టంగా కూడబలుక్కుంటూ జరిగిన విషయమంతా పూస గుచ్చినట్లు చెప్పింది. ఇది చెప్పేటందుకే ఆ కొన ప్రాణం నిలబెట్టుకుందేమో, మరి చెప్పీ చెప్పగానే మృత్యువు ఒడిలోకి చేరిపోయింది పార్వతి !!

విన్న విశాల మ్రాన్పడిపోయింది! యాదమ్మ ఘొల్లుమంది! తెరుచుకున్న నోరు మూత పడేలా ప్రసాదరావు యాదమ్మ చేతిలో నోట్లు కుక్కాడు ! అంతే పార్వతితో పాటు నిజం సమాధి అయిపోయింది.

***

జరిగింది విన్న సమీర కొయ్యబారిపోయింది. తనని అలా చూసిన వనజాక్షి "వదిన గారూ ..జరిగిందేదో జరిగిపోయింది. పోలీసు, కేసు అవీ ఏం లేవుగా, కడుపు చించుకుంటే కాళ్ళ మీద పడుతుందనీ, ఈ విషయాన్ని ఇక్కడితో మర్చిపోతే బావుండును" అంది కోపంగా.

కొద్ది సేపు మౌనం తర్వాత కోడలి వైపు చూస్తూ విశాల "అమ్మా .. సమీరా ఇలాంటి విషయాలు వినడానికి, జీర్ణించుకోవడానికి చాలా కఠినంగా ఉంటాయి, నాకు కూడా విన్న వెంటనే మెదడు మొద్దుబారిపోయింది. నీ పరిస్థితి అర్థం చేసుకోగలను. కానీ ధైర్యం తెచ్చుకో, మనసు చిక్కబరచుకో, ఇపుడు నీ ఉద్దేశ్యమేమిటో చెప్పు!" అంటూ అడిగింది.

అంతే అయోమయంగా చూసింది సమీర అత్తగారిని. ఈ విషయంలో 'నా ఉద్దేశ్యమేమిటని అడుగుతుందేమిటి ఈవిడ, అంటే అలాంటి మొగుడితో కాపురం చెయ్యడానికి వస్తావా, రావా అని అడుగుతోందా, తనకు తెలియని విషయాన్ని చెప్పి, హృదయాన్ని కెలికి ఇపుడు ఏమిటి నీ ఉద్దేశ్యమేమిటి అని తీరిగ్గా అడుగుతుంది.'

"చెప్పు సమీరా!" రెట్టించింది విశాల. అంతే బేలగా చూసింది సమీర అత్తగారి వైపు.

"ఏం చెప్పనత్తయ్యా, చేతిలో చంటి బిడ్డను చూస్తున్నారు, అదీ ఆడపిల్ల, నేను ఆవేశానికిలోనై నా జీవితాన్ని, నా బిడ్డ జీవితాన్ని కూడా పాడు చేయలేను కదా, పైగా ఆ పార్వతి ఎలాగో బతికి లేదు, ముమ్ముందు ఏమైనా ప్రాబ్లమ్స్ వస్తాయేమో అనుకోవడానికి. ఇక ఇక్కడితో ఈ విషయాన్ని మర్చిపోతే మంచిదేమో!" అంది అత్తగారితో.

ఆధునికంగా అలంకరించుకుని ఉన్న సమీర వైపు ఒకసారి జాలిగా చూసింది విశాల.

“చూడమ్మా ఆధునికంగా ఉండడమంటే లేటెస్ట్ ట్రెండ్ ఫాలో అవుతూ డ్రెసులు వేసుకోవడం, స్టైల్ గా ఉండడం మాత్రమే కాదమ్మా, అన్యాయాన్ని ధైర్యంగా వేలెత్తి చూపించగల్గడం! చూడు.. వాడు నా కన్న కొడుకే, కాదనను. కానీ ఎప్పుడైతే ఒక ఆడపిల్ల జీవితాన్ని వాడు నాశనం చేసాడని తెలిసిందో, అప్పుడే మా మధ్య తల్లీ కొడుకుల బంధం తెగిపోయింది. ఇపుడు నేనొక స్త్రీని, సాటి స్త్రీకి అన్యాయం జరిగింది, దాన్ని నేను ఎదుర్కోవాలి. అది మాత్రమే ఉంది నాలో ఇప్పుడు! నిజంగా నీ కూతురిదీ, నీదీ జీవితాలు నాశనం అవ్వడమంటే ఏంటో తెలుసా.. వాడు అంతటి క్రూర మృగం అని తెలిసి కూడా, వాడితో కాంప్రమైజ్ అవుతూ వాడితో జీవితాన్ని గడపటమే! ధైర్యంగా వాడి తప్పుని బైట పెట్టి.. మరొక తప్పు జరగకుండా చెయ్యగలిగితేనే, మీ జీవితాలు బాగుచేసుకున్న దానివే కాదు, మరొకరి జీవితాన్ని నాశనం కాకుండా చేసినదానవూ అవుతావు!” అంది ఆవేశంగా విశాల.

ఆ మాటలకి భోరుమంది సమీర. “అత్తయ్యా.. మీరేమిటి ఇలా మాట్లాడుతున్నారు, నాకు మతిపోతోంది, నా సంసారాన్ని నన్నే వీధిలో పెట్టేసుకోమంటారా? మొగుడ్ని వదిలేసి పుట్టింటికి చేరమంటారా, అసలు ఇదంతా చెప్పి, నా జీవితాన్ని మీరెందుకు నాశనం చేయాలనుకుంటున్నారు?” అంటూ ఏడ్చి పెడబొబ్బలు పెట్టింది.

ఇదంతా చూస్తున్న వనజాక్షి “ఏమిటి వదినగారూ .. ఏమిటి మీకీ పైత్యం, కొడుకూ, కోడలూ సుఖంగా ఉంటే మీరు చూడలేరా, అయిందేదో అయిపోయింది కదా, ఆ చచ్చిన పనిపిల్ల ఎవర్తో.. దాని గురించి ఇంత రాద్ధాంతమేమిటి?” అంటూ లబోదిబోమంది.

ఆ తల్లీ కూతుళ్ళవైపు అసహనంగా చూస్తూ “అయ్యో ..మీ ఇద్దరికీ నా ఉద్దేశ్యం, నా ఆవేదన, నా ఆక్రోశం, ఏదీ అర్ధం కావట్లేదు!” అంటూ తల పట్టుకుని కూర్చుంది విశాల.

ఆ తర్వాత చటుక్కున లేచి తన ఒళ్ళో ఉన్న చంటి పాపను సమీర ముందుంచి, “చూడు ఇదిగో ఇదీ ఆడపిల్లే, రేప్పొద్దున్న దీని జీవితం ఎవడైనా నాశనం చేస్తే, నువ్వు ఈ విధంగానే జరిగినదేదో జరిగిందిలే అన్నట్లు ఉండిపోగల్గుతావా?” అంటూ అరిచింది.

“అత్తయ్యా” అంటూ భరించలేనట్లు అరుస్తూ ఒక్క ఉదుటున బిడ్డను లాక్కుని దగ్గరికి తీసేసుకుంది సమీర.

“ఏమ్మా నీ కూతురైతే ఒకటీ, పరాయి పిల్ల అయితే ఒకటీనా, ఆలోచించు. తెల్లారి లేస్తే పేపర్ల నిండా ఇవే వార్తలు, ఎంతో మంది అత్యాచారాలకు గురవుతున్న అబలలు, వాళ్ళందరూ కూడా ఓ కన్న తల్లి బిడ్డలే కదా! అందులో చదువుకుని ఉద్యోగాలు చేస్తూ, పెద్ద పెద్ద నగరాల్లో ఉన్నవాళ్లూ ఉన్నారు. చదువు, సంధ్యకు నోచుకోని పల్లెటూళ్ళలో పెరిగే అనాగరికులూ ఉన్నారు, అభం, శుభం తెలియని పసి బిడ్డలూ ఉన్నారు! ఈ

ప్రభుత్వాలూ, పోలీసులూ ఎంత చూసినా, ఎన్ని నిర్భయ లాంటి చట్టాలను తీసుకు వచ్చినా కూడా జరిగేవి జరుగుతూనే ఉన్నాయి, ఏ అరాచకం ఆగటం లేదు, ఎందుకో తెలుసా? జరిగే ప్రతీ ఘోరం వెనుక తెలిసో, తెలియకో స్త్రీ పాత్ర కూడా ఉంటోంది కనుక. అది భయం కావచ్చు, స్వార్ధం కావచ్చు, చేతకానితనం కావచ్చు. ఏదైనా కానీ, దాన్ని అలుసుగా తీసుకుని ఇటువంటి వాళ్ళు మరింత చెలరేగిపోతున్నారు. అత్యాచారానికి పాల్పడ్డ ప్రతీ మగాడు కూడా ఎవరో ఒక స్త్రీకి తండ్రో, కొడుకో, అన్నో, తమ్ముడో, భర్తో ఏదో ఒకటి అవుతాడు. ఈ ప్రభుత్వాలు, చట్టాల కన్నా ముందు ఆ స్త్రీయే వాడిని నిలదీసి ప్రశ్నిస్తేనే వాడిలో మార్పొస్తుంది! ఒక ఆడపిల్లకి అన్యాయం జరిగింది, అది బైటకి రాలేదు కదా, పరువు పోలేదు కదా అని ఆడవాళ్ళమైన మనిద్దరం ఈ విషయాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తే, దాన్ని అలుసుగా తీసుకుని, మరోసారి మరో ఆడపిల్లకి అన్యాయం చెయ్యడానికి వాడు సిద్ధం అవుతాడు, వద్దమ్మా, వద్దు.. మరో ఆడపిల్ల జీవితాన్ని వాడికి పణంగా పెట్టొద్దు. ఈ పోలీసు కేసులూ, సాక్ష్యాలూ, జైలు శిక్షలు ఇవి ఏవీ ఇటువంటి మగవాళ్లలో సమూలంగా మంచి మార్పును తీసుకు రాలేవు. మనమే వాడికి తగిన శిక్షను వేద్దాం, బతికే ఉంటే ఆ పార్వతి జీవితాంతం తనకు జరిగిన ఘోరాన్ని తలచుకుని ఎంత మానసిక క్షోభను అనుభవించేదో, అంతా వీడు కూడా అనుభవించాలి. క్షణ క్షణం, అనుక్షణం వాడు చేసిన పాపమేమిటో తెలిసేలా చేసి, వాడిలో మానసిక పరివర్తనను తీసుకువద్దాం, వాడు చేసిన నేరమేమిటో వాడి నోటి ద్వారానే చెప్పిద్దాం. మన ఇంటికి పట్టిన చీడను మనమే శుభ్రం చేద్దాం. రేపు మనల్ని చూసి మరో స్త్రీ తన ఇంటికి పట్టిన చీడను శుభ్రం చేసుకోవడం మొదలు పెడుతుంది. అలా సమాజానికి పట్టిన చీడ కొంతయినా వదులుతుంది. అప్పుడు కనీసం నీ కూతురి లాగా .. భవిష్యత్ తరాలకైనా ఈ బెడద కొంత వరకూ తగ్గుతుంది. నీ జీవితం నాశనం అవుతోందని దిగులు పడకు. నువ్వు ధైర్యంగా తీసుకునే చిన్న తెగింపు, కొన్ని వేల ఆడవాళ్ళ జీవితాలకు భద్రతను ఇస్తాయనే ఆత్మవిశ్వాసంతో ఉండు! సమాజానికి నువ్వు చేసే మంచే, నీకూ నీ కూతురికి శ్రీ రామ రక్ష! రా నాతో కలిసి అడుగేయ్ .. మన జాతిని మనమే కాపాడుకుందాం, ఎవరో వచ్చి ఏదో చేస్తారని ఆశించొద్దు, మనలో ఐక్యత ఉంటే ఎంతటి నరరూప రాక్షసుడైనా మాడి మసై పోవాల్సిందే!!" అంటూ లేచింది విశాల.

ఇదంతా విన్న సమీర పాపని దగ్గరగా పొత్తిళ్లలోకి తీసుకుని పడుకుని ఆలోచించింది, బాగా ఆలోచించుకుంది, అలా ఆలోచించగా ఆలోచించగా అత్తగారి అంతరంగం నెమ్మది నెమ్మదిగా అర్ధమవడం మొదలు పెట్టింది. ఆ మాటలలోని సారాంశాన్ని గ్రహించింది. లేచి తన బుగ్గల మీద జారిన కన్నీటిని తుడుచుకుని, బిడ్డనెత్తుకుని ధైర్యంగా విశాల వెనుక నడిచింది ప్రక్షాళన దిశ వైపుగా.

***0***



# వినదగునెవ్వరు చెప్పిన ..

కథామంజరి జూలై, ఆగష్టు 2020 ల సంచికలలో ఒకటి రెండు కథలు మాత్రమే చదవగలిగాను. చదివిన కథల ప్రేరణతో సమయం చేసుకుని సెప్టెంబర్ నెల సంచిక పూర్తిగా చదివాను. కథలన్నీ బాగున్నాయి. కరిణేసు మంత్రి , జంట కవులు, తల్లి దీవెన కథలు బాగున్నాయి. మంచి కథలు అందిస్తున్న మీకు ధన్యవాదాలు.

కొవ్వలి భాను భారతి, విశాఖపట్నం

మీ, మా సెప్టెంబర్ కథామంజరి సంచిక కథల పరంగాను, పరిచయాల విషయంలోనూ గత సంచికల కంటే ఎంతో బావుంది. ఇది ఇలాగే ఇంకా ఉన్నత ప్రమాణాలందుకోవాలని కోరుకుంటున్నాను.

చలపతిరావు సూరంపూడి, విజయవాడ

మిత్రుడు దాట్ల నారాయణమూర్తి రాజు మీద మంచి వ్యాసం అందించిన, ఇందూరమణ కి అభినందనలు.

మెడికో శ్యాం, అమెరికా

## కథా మంజరి

### దీపావళి కథల పోటి

దీపావళి పండగ అంటే .. తెలుగు లోగిళ్ళ లో  టపాసులతో పాటు, దీపావళి ప్రత్యేక సంచికలు కూడా సందడి చేసేవి. ప్రఖ్యాత రచయిత(త్రి)ల ప్రత్యేక కథలు, కవితలతో నిండైన ఆ సంచికలు,  దీపావళి వెళ్లిన తర్వాత కూడా,  తెలుగువారి ఇళ్లల్లో శాశ్వతంగా ఉండేవి.  ఆ సంచికల్లో కథలు, కవితలు ప్రచురణ కావడం.. రచయితలకు ఓ గుర్తింపుగా ఉండేది. ఆనాటి తెలుగు కథా వైభవాన్ని తలుచుకుంటూ... కథా మంజరి .. వచ్చే దీపావళికి ప్రత్యేక సంచిక ప్రచురించాలనే తలంపుతో.. "దీపావళి కథల పోటి" నిర్వహించదలచమని తెలియచేయడానికి సంతోషిస్తున్నాం. రచయిత(త్రి)లందరూ తమ తమ రచనలను పంపి, కథలపోటిని జయప్రదం చేయవలసిందిగా కోరుతున్నాం.

మొదటి బహుమతి : రూ. 5000

రెండవ బహుమతి  :  రూ. 3000

మూడవ బహుమతి: రూ. 2000

ప్రత్యేక సంచికలో చోటుచేసుకునే మరో 12  కథలకు రూ. 500/- చొప్పున బహుమతి ఉంటుంది.

## పోటీ నిబంధనలు:

1. కథాంశం ఏదైనా పరవాలేదు.

2. కథలను word లో యూనికోడ్ లో, అక్షరాలు 12' సైజులో టైపు చేసి పంపవలెను.

3. కథలు ఆ టైపింగ్ లో 5 పేజీలకు మించి ఉండకూడదు. రచయిత పేరు, చిరునామా, హామీ పత్రం 6వ పేజీలో తప్పనిసరిగా ఉండాలి. కథ తమ స్వీయ రచనేనని, ఏ ఇతర పత్రికలలో ప్రచురింపబడలేదని లేదా వారి దగ్గిర పరిశీలనలో లేదని, అలాగే ఆ కథ ఇతర సాంఘిక మాధ్యమాలలో (ఫేస్ బుక్, వాట్సప్, బ్లాగ్ లు .. వగైరా) రాలేదనే విషయాలు హామీ పత్రం లో తప్పనిసరిగా ఉండాలి. ఈ హామీ పత్రం లేని కథలు స్వీకరింపబడవు. ఈ పేజిలోనే "దీపావళి కథల పోటీకి" అని రాయాలి.

4. ఏ రచయిత అయినా సరే, మూడు కథలకు మించి పంపకూడదు.

5. కథలు మరే ఇతర పద్ధతులలో పంపిన ఎడల స్వీకరింపబడవు.

6. పోటీలో ఎంపిక అయిన కథలన్నీ దీపావళి ప్రత్యేక సంచికలో ముద్రితమవుతాయి. అవి కాక, సాధరణ ప్రచురణకు స్వీకరింపబడే కథలను వీలువెంబడి కథామంజరిలో ప్రచురణ అవుతాయి. ఆ కథల జాబితా కథమంజరి ప్రత్యేక సంచికలో ప్రచురింపబడతాయి. మిగతా కథలు స్వీకరింపబడలేదనే విషయం ఆయా రచయితలు గమనించాలి.

7. కథలను ఈ క్రింది చిరునామాకు ఇమెయిల్ ద్వారానే పంపాలి.

submit@kathamanjari.in

8. ఆఖరి తేది: 25.10.2020 రాత్రి 10.00 గంటలు

9. ఈ పోటీ మీద తుది నిర్ణయాలు తీసుకునే అధికారం కథా మంజరి నిర్వాహకులదే.

కథా మంజరి - నవంబరు 2020 సంచిక దీపావళి ప్రత్యేక సంచికగా 14.11.2020 న విడుదల అవుతుంది. పాఠకులు, రచయితలు గమనించగలరు.

కథా మంజరి దీపావళి ప్రత్యేక సంచిక మీ యింట కొత్త వెలుగులను అందిస్తుందని అభిలషిస్తూ.. ఈ ప్రయత్నానికి మీ సహాయసహకారాలు ఉంటాయని ఆశిస్తున్నాం!

నిర్వాహక బృందం

కథా మంజరి

ఇవండీ .. ఈ సంచిక విశేషాలు!!

**మళ్ళీ .. రాబోయే**

## దీపావళి ప్రత్యేక సంచికతో

**కలుసుకుందాం**

ఈలోగా మధ్యలో వచ్చే

## దసరా పండుగ శుభాకాంక్షలు

